ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 25-8-2019 ఆదివారం సిటీ సంపుటి 46 సంచిక 16

రూ. 8-00. పేజీలు 14+16+32 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కమల గళపతి

అరుణ్ జైట్లీ కన్నుమూత



- తీవ్ర అస్వస్థతతో ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచిన మాజీ మంత్రి
- ప్రధాని మోదీ, అమిత్‌షా, వెంకయ్యనాయుడు, కేసీఆర్ దిగ్భ్రాంతి
- శోకసంద్రంలో జైట్లీ కుటుంబ సభ్యులు, భాజపా శ్రేణులు
- సంతాపం తెలిపిన పలు పార్టీల నేతలు
- నేడు దిల్లీలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

ఈనాడు - దిల్లీ

వర్తమాన రాజకీయాల్లో అజాత శత్రువు, భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ కన్నుమూశారు. భాజపాలో, మోదీ ప్రభుత్వంలో సంక్షోభ పరిష్కర్తగా పేరొందిన జైట్లీ.. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు వంటి భారీ నిర్ణయాలను ధైర్యంగా అమలుచేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. మృదు కణజాల క్యాన్సర్‌తో ఈనెల 9న దిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరిన జైట్లీకి కార్డియోన్యూరో సెంటర్‌లో పలు విభాగాల వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్సనందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను వైద్యులు నిరంతరం గమనిస్తూ వచ్చారు. వారం రోజులుగా ప్రాణాధార వ్యవస్థపై ఉన్న జైట్లీ ప్రాణాలను కాపాడేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. శనివారం మధ్యాహ్నం 12.07 గంటలకు జైట్లీ తుది శ్వాస విడిచినట్లు ఎయిమ్స్ వర్గాలు ప్రకటించాయి. 66 ఏళ్ల జైట్లీ కొంత కాలంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. గత ఏడాది మే 14న ఆయనకు ఎయిమ్స్‌లోనే మూత్రపిండాల మార్పిడి జరిగింది. మధుమేహంతో బాధపడుతున్న జైట్లీ బరువు తగ్గటం కోసం 2014 సెప్టెంబరులో బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్నారు. జైట్లీకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గొప్ప స్నేహితుడు: జైట్లీ మృతిపట్ల రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, వివిధ పార్టీల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గొప్ప స్నేహితుడు, రాజనీతిజ్ఞుడు, న్యాయకోవిదుడిని దేశం కోల్పోయినట్లయిందని వారు తమ సంతాప సందేశాల్లో పేర్కొన్నారు. (మిగతా 2లో)

కథనాలు 11, బిజినెస్ పేజీల్లో.. ప్రత్యేక వ్యాసం 4లో

మోదీకి యూఏఈ అత్యున్నత పురస్కారం

'ఆర్డర్ ఆఫ్ జాయేద్' ప్రదానం

అబుదాబి/మనామా: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ జాయేద్'ను శనివారం భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ ప్రభుత్వం ప్రదానం చేసింది. పట్టాభిషిక్తుడుకానున్న అబుదాబి యువరాజు మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ దీనిని అందజేశారు. రెండు దేశాల మధ్య సంబంధాల పెంపుదలకు కృషి చేసినందుకు గుర్తుగా ఈ పురస్కారాన్ని ఇస్తున్నట్టు ఆయన ప్రకటించారు. మోదీకి స్వాగతం పలికిన యువరాజు ఆయనను 'నా సోదరుడు' అని సంబోధించారు. యూఏఈ మోదీకి రెండో నివాసంలాంటిదని అభివర్ణించారు. ఇరువురు నేతలు వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడంపై చర్చలు జరిపారు. (మిగతా 2లో)

పసిడి పతకానికి ఇంకొక్క అడుగు

వరుసగా మూడోసారి ప్రపంచ బ్యాడ్మింటన్ ఫైనల్లోకి సింధు

ఒకసారి బోల్తా కొట్టింది.. అయినా వదల్లేదు. ఇంకోసారి ఎదురు దెబ్బ తగిలింది.. అయినా తగ్గలేదు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఒకటికి రెండుసార్లు చిక్కినట్లే చిక్కి చేజారిన స్వర్ణాన్ని ఒడిసిపట్టేందుకు మన సింధు మళ్లీ సిద్ధమైంది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆమె వరుసగా మూడో ఏడాది కూడా ఫైనల్ చేరి చరిత్ర సృష్టించింది. శనివారం సెమీఫైనల్లో సింధు.. 21-7, 21-14 తేడాతో ప్రపంచ మూడో ర్యాంకర్ చెన్ యూ ఫీని వరుస గేముల్లో చిత్తుచేసింది. 2017లో సింధు ఆశలకు గండికొట్టిన జపాన్ స్టార్ ఒకహూరనే మరోసారి ఆమె ప్రత్యర్థిగా నిలిచింది. ఆదివారమే అంతిమ సమరం. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్ సెమీస్‌లో ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.

...పూర్తి వివరాలు బ్యాడ్మింటన్ లో

శ్రీనగర్ నుంచి రాహుల్ వెనక్కి

- ప్రతిపక్ష నేతలను తిప్పిపంపిన అధికారులు

శ్రీనగర్: కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ సారథ్యంలో శ్రీనగర్ చేరుకున్న ప్రతిపక్ష ప్రతినిధి బృందాన్ని అధికారులు శనివారం విమానాశ్రయంలోనే అడ్డుకుని వెనక్కి తిప్పి పంపించారు. 370 అధికరణం రద్దు అనంతరం కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆంక్షలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపక్ష నేతల బృందాన్ని వెనక్కి పంపివేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్ వెళ్లిన 12 మందితో కూడిన ప్రతిపక్ష బృందంలో రాహుల్‌తోపాటు, గులాంనబీ ఆజాద్(కాంగ్రెస్), శరద్‌పవార్(ఎన్సీపీ), వామపక్ష నేతలు డి.రాజా, సీతారాం ఏచూరి తదితరులున్నారు. ప్రతిపక్ష ప్రతినిధి బృందాన్ని వెనక్కి తిప్పిపంపకుండా అనుమతించి ఉండాల్సిందని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ అభిప్రాయపడ్డారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లాను కొందరు కేంద్రప్రభుత్వ అధికారులు కలుసుకున్నారంటూ వచ్చిన వార్తలను ఆ పార్టీ ఖండించింది. జమ్మూ-కశ్మీర్‌లోవాస్తవ నియంత్రణ రేఖ(ఎల్ ఓసీ), అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ) వెంబడి భద్రతాదళాలు హై అలర్ట్‌లో ఉన్నట్లు అధికారులు శనివారం తెలిపారు. కశ్మీరు లోయలో విధించి ఉన్న ఆంక్షలను పలుప్రాంతాల్లో శనివారం సడలించారు. (మిగతా 2లో)

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్‌పరేడ్‌ను పర్యవేక్షిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఆర్టికల్ 370 రద్దుతో పటేల్ కల సాకారం

- ఐపీఎస్ అధికారులు రాజ్యాంగ మూలాల్ని మరవొద్దు 5లో
- పేదరికాన్ని తొలగించి, దేశాన్ని అవినీతి రహితంగా మార్చాలి
- ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో అమిత్‌షా

"ఐపీఎస్ సాధనతో మీ లక్ష్యం పూర్తికాలేదు. అసలైన లక్ష్యం, బాధ్యత ఇప్పుడే మొదలయ్యాయి. సుశిక్షిత, సురక్షిత, సమృద్ధ భారత్‌గా దేశాన్ని తీర్చిదిద్దాలి. ఐపీఎస్ అధికారిగా మీరు దేశ పటిష్ఠతకు, ప్రజల పేదరికాన్ని దూరం చేసేందుకు అంకితం కావాలి. దేశాన్ని గౌరవప్రదమైన స్థానంలోకి తీసుకెళ్లాలి. ఈ లక్ష్య సాధనలో కఠోర సమస్యలు, కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా చేసిన ప్రతిజ్ఞ గుర్తుకు తెచ్చుకోవాలి.

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

శ్రీనగర్ విమానాశ్రయంలో ప్రతిపక్ష నేతల బృందం. చిత్రంలో రాహుల్‌గాంధీ, శరద్‌యాదవ్, డి.రాజా, గులాంనబీ ఆజాద్, సీతారాం ఏచూరి తదితరులు

ఇదీ సంగతి!

ఆలస్యం కాటేస్తోంది

గాంధీ, ఉస్మానియాలకు పాముకాటు బాధితులు

- ప్రతి నెలా 40-50 కేసుల వరకు నమోదు
- ఎక్కువగా చుట్టు పక్కల జిల్లాల నుంచి రాక
- చికిత్స అందించడంలో తీవ్ర జాప్యం

ఈనాడు, హైదరాబాద్: ఆధునికత ఎంతగా పెరుగుతున్నా.. రవాణా, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నా ఇప్పటికీ పాము కాటు మృతుల సంఖ్య తగ్గడంలేదు. గత 18 రోజుల్లో ఒక్క ఉస్మానియాలోనే 19 మంది పాము కాటుతో చేరారు. గాంధీకి నెలకు 30 మంది వరకు బాధితులు వస్తున్నారు. వీరంతా ఎక్కువగా నగరం చుట్టు పక్కల జిల్లాల నుంచి రిఫరల్ కేసుల కింద ఇక్కడకు వస్తున్నారు. (మిగతా 2లో)

పాములు కాటేస్తే..

నాగు లేదా తాచుపాము, రక్త పింజరి, కట్లపాము, రాచనాగు వంటివి అత్యంత విషపూరితమైనవి. ఇవి కాటు వేస్తే తప్పనిసరిగా యాంటీ వీనమ్ మందు ఇవ్వాల్సిందే.

పాము కాటు వేసినచోట రెండు గాట్లు పడి ఉంటే.. అది కచ్చితంగా విషపూరితమైనదని అర్థం. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలి.

ఎవరైనా నాటు మందు వల్ల ప్రమాదం నుంచి బయటపడ్డారంటే అది విషపూరితమైన పాము కాదని అర్థం.

తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేక ముద్ర

- తెలంగాణ ఏర్పాటుకు మద్దతు పలుకుతూనే..
- సీమాంధ్ర హామీలకు చట్టబద్ధతను కోరిన జైట్లీ

జైట్లీతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఏపీ సీఎం చంద్రబాబు (పాతచిత్రాలు)

ఈనాడు, దిల్లీ: భాజపా జాతీయ నేతల్లో కీలకంగా వెలుగొందిన అరుణ్ జైట్లీ తెలుగు రాష్ట్రాలపై తన ప్రత్యేక ముద్ర వేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ ఏర్పాటుకు గట్టి మద్దతు ఇస్తూనే, సీమాంధ్ర హామీలకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో గందరగోళ వాతావరణం మధ్య తెలంగాణ ఏర్పాటు బిల్లుపై జరిగిన చర్చలో ఆయన రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. 1980 నుంచి భాజపా కోరుకుంటున్న ప్రత్యేక రాష్ట్రం ఏర్పడుతున్నందుకు సంతోషంగా ఉందని, అదే సమయంలో రాష్ట్ర ఏర్పాటు ద్వారా నష్టపోతున్న సీమాంధ్రకు ఇచ్చే హామీలకు బిల్లులో స్థానం కల్పించాలన్నారు. అవసరమైతే బిల్లులో సవరణలు తీసుకురావాలని సూచించారు. 2014 ఫిబ్రవరి 18న సీమాంధ్రపై డిమాండ్లు లేకుండానే లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందగా, 20వ తేదీన రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న అరుణ్‌జైట్లీ తెలంగాణకు మద్దతిస్తూనే సీమాంధ్రులకు సంబంధించి ఏదో ఒక హామీ ఇవ్వాలని తెరవెనక ప్రభుత్వంపై గట్టిగా పట్టుబట్టారు. ఫలితంగానే నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ బిల్లు ఆమోదం పొందే అంతిమ ఘడియల్లో ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు, పన్ను రాయితీలు, వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ, రెవెన్యూ లోటు భర్తీ చేస్తామని ప్రకటించాల్సి వచ్చింది. నాడు సభలో అరుణ్‌జైట్లీ ప్రసంగం ఇలా సాగింది..

తెలంగాణ ఏర్పాటు చారిత్రక అవసరం

"తెలంగాణ ఏర్పాటు చేయబోతున్నందుకు సంతోషంగా ఉన్నాను. మా పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో 1980 నుంచి, కేంద్రంలో 2006 నుంచి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు మద్దతిస్తూ వస్తోంది. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు దిశగా సాగుతున్న ప్రక్రియలో భాగస్వామి కావడం నాకెంతో సంతృప్తినిస్తోంది. తెలంగాణను ఏర్పాటు చేస్తున్న సమయంలోనే సీమాంధ్రులకు ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులనూ పరిష్కరించాల్సి ఉంది. ఈ మొత్తం ప్రక్రియలో యూపీఏ ప్రభుత్వం కసరత్తు చేసిన తీరు నన్ను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. తెలంగాణకున్న సుదీర్ఘ చరిత్రను దృష్టిలో ఉంచుకొని మేం ప్రత్యేక తెలంగాణ కోసం డిమాండ్ చేశాం. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ ఎన్నో పోరాటాల తర్వాత భారత్ యూనియన్‌లో విలీనమైంది. అందుకే మా పార్టీ దీనికి పూర్తిగా మద్దతు పలికింది.

యూపీఏ కసరత్తు చెడ్డపేరు తెస్తోంది..

వాజ్‌పేయీ హయాంలో ఎన్డీఏ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌ల పేరుతో మూడు రాష్ట్రాలు ఏర్పాటు చేసినప్పుడు.. మేం జాతీయ స్థాయిలో విస్తృత ఏకాభిప్రాయాన్ని సాధించి అందరిలో సంతోషం నింపాం. యూపీఏ ప్రభుత్వం కొత్త రాష్ట్ర ఏర్పాటు విషయంలో వ్యవహరించిన తీరు ఆందోళనకరంగా ఉంది. డిమాండ్ నెరవేర్చే సమయంలో రాష్ట్రంలోని రెండు ప్రాంతాల ప్రజలను సమీకృతం చేయలేకపోయారు. ప్రస్తుతం మంచికోసం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తుంటే ప్రభుత్వంలోని మంత్రులు, అధికార పార్టీ ఎంపీలే తప్పుపడుతున్నారు. లోక్‌సభలో చాలామంది ఎంపీలను సస్పెండ్ చేసి, వారి పరోక్షంలో రాష్ట్రం ఏర్పాటు చేసింది. దీనివల్లే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ చేదెక్కింది. యూపీఏ ప్రభుత్వం వ్యవహరించిన తీరువల్ల మంచికోసం తలపెట్టిన తెలంగాణ ఏర్పాటు ప్రక్రియకు చెడ్డపేరు వచ్చింది. కొత్త రాష్ట్ర ఏర్పాటు న్యాయబద్ధంగా, న్యాయపరీక్షకు నిలబడేలా, సరైన పద్ధతిలో జరగాలి.

రాజ్యాంగ సవరణ లేకుండా గవర్నర్‌కు శాంతిభద్రతల అధికారాలు ఎలా?

విభజన బిల్లులోని 8వ సెక్షన్‌లో హైదరాబాద్‌ను రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధానిగా ప్రతిపాదించారు. పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉండటంలో మాకేమీ ఇబ్బంది లేదు. గవర్నర్‌కు శాంతిభద్రతల బాధ్యతలు అప్పగించడంపైనా సమస్య లేదు. నా భయమల్లా బిల్లు రాజ్యాంగబద్ధతపైనే. సాధారణ చట్టం ద్వారా శాంతిభద్రతల అధికారాలను గవర్నర్‌కు అప్పగించవచ్చా? లేదంటే దానికేదైనా రాజ్యాంగ సవరణ అవసరమా? అన్న దానిపైనే. గవర్నర్ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి. అలాంటప్పుడు రాజ్యాంగ సవరణ చేపట్టకుండా శాంతిభద్రతల అధికారాలను గవర్నర్‌కు బదలాయించగలరా? రాజ్యాంగ సవరణ చేసి గవర్నర్‌కు అధికారాలు అప్పగించడమే న్యాయబద్ధమైన చర్య. ఆ సవరణకూ మద్దతివ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

సీమాంధ్రుల హామీలకు బిల్లులో స్థానం కల్పించాలి..

సీమాంధ్ర ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. సీమాంధ్ర ఆదాయానికి రక్షణ కల్పించాలి. అక్కడ చేపట్టిన సాగునీటి పథకాలకూ సంరక్షణ ఇవ్వాలి. ఆ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలి. దీనిపై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలి. అవసరమైతే సీమాంధ్రకు ఇచ్చే హామీలను బిల్లులో పొందుపరచడానికి వీలుగా సవరణలు తీసుకురావాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి మాకు సంతృప్తికరమైన హామీ లభించకపోయినా మేం తెలంగాణ ఏర్పాటుకు మద్దతు పలుకుతున్నాం. నేను, వెంకయ్యనాయుడు ప్రతిపాదించిన సవరణలకు బిల్లులో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం" అని అరుణ్‌జైట్లీ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మృతిపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. దేశానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. జైట్లీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. జైట్లీ మృతిపై సంతాపం వ్యక్తంచేశారు. "జైట్లీ అత్యంత స్ఫూర్తిదాయక వ్యక్తి. వ్యక్తిగతంగానూ, రాజకీయంగానూ ఆయన మచ్చలేని మహారాజుగా జీవించారు. ఆయనను చాలా సార్లు కలిసే అవకాశం రావడం నా అదృష్టం' అని కేటీఆర్ తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, తదితరులు జైట్లీ కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

గవర్నర్ సంతాపం

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందని, జైట్లీ ఆత్మకు శాంతి చేకూరాలని గవర్నర్ నరసింహన్ సంతాప సందేశంలో పేర్కొన్నారు.

జగన్, చంద్రబాబు...

ఈనాడు డిజిటల్, అమరావతి: అరుణ్ జైట్లీ మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన గొప్ప వక్త, మేధావి అంటూ కొనియాడారు. అరుణ్ జైట్లీ మృతి దేశానికే తీరని లోటని తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు.

కమల గళపతి అరుణ్ జైట్లీ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

జైట్లీ తుది శ్వాస విడిచే సమయానికి ప్రధాని మోదీ విదేశీ పర్యటనలో, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఏపీ పర్యటనలో, హోం మంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటనలో, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పట్నా పర్యటనలో ఉన్నారు. జైట్లీ మరణ వార్త తెలియగానే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షాలు తమ అధికారిక పర్యటనలను రద్దుచేసుకొని హుటాహుటిన దిల్లీ చేరుకున్నారు.

భావోద్వేగానికి గురైన మోదీ: తనకు అత్యంత సన్నిహితుడైన జైట్లీ మృతి చెందటంపై ప్రధాని మోదీ తీవ్ర ఆవేదన చెందారు. మిత్రుడు తిరిగిరాని లోకాలకు వెళ్తున్న సమయంలో తాను ఎంతో దూరంలో ఉన్న బహ్రెయిన్‌లో ఉండిపోతానని ఊహించలేకపోయానని విచారం వ్యక్తం చేశారు. బహ్రెయిన్ నేషనల్ స్టేడియంలో భారత జాతీయులు నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ప్రజలు కృష్ణాష్టమి వేడుకలు జరుపుకుంటున్న వేళ స్నేహితుడు జైట్లీని కోల్పోయిన విషాదంలో తాను మునిగిపోయానని తెలిపారు. అంతకుముందు ప్రధాని మోదీ ఫోన్‌లో జైట్లీ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జైట్లీ భార్య సంగీత, కుమారుడు రోహన్‌కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విషాదంలో ఉన్నప్పటికీ వారు ప్రధానిని విదేశీ పర్యటన రద్దు చేసుకోవద్దని కోరారు. సన్నిహిత మిత్రుడు జైట్లీ అంత్యక్రియలకు ప్రధాని మోదీ హాజరుకాలేకపోతున్నారు. ప్యారిస్‌లో జరుగనున్న జీ7 దేశాల సదస్సులో మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొనాల్సి ఉన్నందున పర్యటన వాయిదా వేసుకోవటం సాధ్యంకావటంలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

> "జైట్లీ మరణంతో ఓ విలువైన మిత్రుడిని కోల్పోయాను. రాజ్యాంగం, చరిత్ర, న్యాయపరమైన అంశాలపై ఆయనకు ఉన్న పరిజ్ఞానం అపారం. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించడం ద్వారా దేశ ఆర్థిక ప్రగతికి, రక్షణ సామర్థ్యాల బలోపేతానికి జైట్లీ కృషి చేశారు. వివిధ దేశాలతో వాణిజ్య సంబంధాల అభివృద్ధికి ఎంతో శ్రమించారు. భాజపా సిద్ధాంతాలను, విధానాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీలకు అతీతంగా కూడా అందరి అభిమానాన్ని పొందారు"
>
> – నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

వెంటాడిన అరోగ్య సమస్యలు: ప్రధాన మంత్రి మోదీ తొలి ప్రభుత్వంలో పూర్తి స్వేచ్ఛతో పనిచేసిన మంత్రిగా పేరొందిన జైట్లీ రాజకీయ ఎదుగుదలతో పాటే ఆరోగ్య తరుగుదల ప్రారంభమైంది. రాజకీయ జీవితంలో ఉన్నత స్థితికి చేరి ఆర్థికమంత్రిగా విస్తృతమైన సేవలు అందించే పనిలో నిమగ్నమైన సమయంలో ఆయన్ను తొలుత కిడ్నీ సమస్య చుట్టుముట్టింది. రెండు మూత్రపిండాలు చెడిపోవడంతో 2018లో వాటిని మార్చారు. దాన్నుంచి బయటపడి సాధారణ స్థితికి చేరుకొనే లోపే తొడ భాగంలో మృదుకణజాల క్యాన్సర్ బయటపడింది. అమెరికాకు వెళ్లి చికిత్స చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. క్యాన్సర్ ఆయన్ను కదలలేని స్థితికి తీసుకురావడంతో 2019 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేకపోయారు. మానసికంగా బలంగా ఉన్నప్పటికీ శారీరకంగా ఇంటికే పరిమితం కావాల్సి రావడంతో మోదీ రెండో ప్రభుత్వంలో ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టలేకపోయారు. పోర్టుపోలియో లేని మంత్రిగా అయినా ఉండమని మోదీ చేసిన సూచనను ఆయన సున్నితంగానే తిరస్కరించి అధికార బాధ్యతలకు దూరంగా ఉండిపోయారు. ప్రస్తుతం యూపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వ్యక్తిగత విమర్శలకు దూరం: కమలం పార్టీలో నిన్నటి తరం జాతీయ నేతల్లో పిన్నవయస్కుడైన అరుణ్‌జైట్లీ రాజకీయంగా ఉన్నత దశకు ఎదుగుతున్న క్రమంలో మృతి చెందటం భాజపా శ్రేణులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. అరుణ్‌జైట్లీ దేశంలోని ప్రముఖ న్యాయవాదుల్లో ఒకరిగా పేరొందారు. భాజపా విధానాలను గట్టిగా సమర్థించినప్పటికీ ఏనాడూ మతం రంగు అంటించుకోని అరుదైన నేత. ప్రత్యర్థులను విధానపరంగానే తప్ప వ్యక్తిగతంగా ఎన్నడూ విమర్శించని గొప్ప పార్లమెంటేరియన్. అన్ని పార్టీల నుంచీ మిత్రులను సంపాదించుకున్న స్నేహశీలి.

అరుణ్‌జైట్లీ పార్థివదేహం వద్ద విషాద వదనాలతో కుటుంబసభ్యులు, బంధువులు

నిగంబోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు

అరుణ్ జైట్లీ భౌతిక కాయానికి ఆదివారం సాయంత్రం అధికార లాంఛనాలతో దిల్లీలోని యమునా నది ఒడ్డున ఉన్న నిగంబోధ్ ఘాట్‌లో అంతిమ సంస్కారాలు జరుపనున్నట్లు భాజపా నాయకుడు సుధాన్షు మిత్తల్ ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి నివాళులు

ఎయిమ్స్ ఆసుపత్రి నుంచి శనివారం సాయంత్రం అరుణ్ జైట్లీ పార్థివ దేహాన్ని దక్షిణ దిల్లీలోని కైలాస్ కాలనీలో ఉన్న ఆయన స్వగృహానికి తరలించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, పియూష్ గోయెల్, హర్షవర్ధన్, జితేంద్ర సింగ్, జయ్‌శంకర్, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, అగ్రనేత అడ్వాణీ, ఆ పార్టీ ఎంపీలు, నాయకులు, కార్యకర్తలు జైట్లీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ఆజాద్, అహ్మద్ పటేల్, ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, నవీన్ పట్నాయక్, కమల్‌నాథ్, కేజ్రీవాల్, వివిధ పార్టీల ఎంపీలు అంజలి ఘటించారు. హోంమంత్రి అమిత్ షా మూడున్నర గంటల పాటు జైట్లీ ఇంటి వద్దే ఉన్నారు.

ఎల్ఏసీ ఛైర్మన్ పదవికి ప్రవీణ్ ప్రకాష్ రాజీనామా

ఈనాడు, దిల్లీ: దిల్లీలోని తితిదే గోల్‌మార్కెట్ వేంకటేశ్వర ఆలయ స్థానిక సలహాదారుల సంఘం (ఎల్ఏసీ) ఛైర్మన్ పదవికి ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ రాజీనామా చేశారు. ఆలయానికి సంబంధించి నిధుల దుర్వినియోగంపై ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అక్రమాలపై తాము విచారణ చేయిస్తున్న సమయంలో సమాంతరంగా తనిఖీలు చేయించడం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. ఈ చర్యతో తమ సమర్థతపై నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

Top Institute For Diploma Students
SSC-JE
(CIVIL - MECH - EEE)
SE JLM ECET
Admissions Are In Progress
SAIMEDHA
KOTI, HYD : 9246212138

S.I & కానిస్టేబుల్స్
ఇసాక్ సార్ ఆధ్వర్యంలో
NEW BATCH on 5-9-19 @ 8.00 A.M
Separate Batch for TM/EM
G.S / Group-2 Faculty రే భోధించబడును
ఆర్యభట్ట ఇనిస్టిట్యూట్ ఆఫ్ టాలెంట్
3rd Floor, Near Signals, Above ANDHRA BANK, DSNR, HYD.
6305056616 / 6305054993

ఆలస్యం కాటేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

విషసర్పాలపై సరైన అవగాహన లేకపోవడం, వైద్య సిబ్బంది కొరత, విరుగుడు మందు కొరత వల్ల పాము కాటు బాధితుల్లో చాలామంది మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలో సరైన సౌకర్యాలు, వైద్య సిబ్బంది అందుబాటులో లేక నగరానికి వచ్చే లోపు విలువైన సమయం హరించుకుపోతోంది. చికిత్సకు తరలించే లోపు రోగికి వెంటిలేటర్ అవసరం ఎంతైనా ఉంది. చాలామందిని అది లేకుండా ఆసుపత్రులకు తీసుకుస్తున్నారు. హైదరాబాద్ శివార్లలో పాముల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి నిత్యం 200 వరకు ఫోన్ కాల్స్ వస్తున్నాయంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.

కాటేస్తే హైదరాబాద్‌కే..

బాధితుల్లో ఎక్కువమంది మంత్రగాళ్లు, నాటు వైద్యులనో లేదా ఆర్ఎంపీలనో ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆ తర్వాతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వెళ్తున్నారు. అప్పటికే కొంత జాప్యం జరుగుతోంది. రాత్రి వేళల్లో పీహెచ్‌సీల్లో వైద్యులే ఉండటం లేదు. సిబ్బంది హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీలకు రిఫర్ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో పాటుకాటు విరుగుడు మందు (యాంటీ వీనమ్) అందుబాటులో ఉంచాలి. చాలాచోట్ల ఫ్రిజ్‌లు ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. కొన్నిసార్లు విష సర్పం కాటేయకున్నా విషానికి విరుగుడు అందిస్తుండం వల్ల పరిస్థితి విషమిస్తోంది. వైద్య సిబ్బందికి తగిన శిక్షణ లేకపోవడమే దీనికి కారణం.

ఆందోళన వద్దు..

- పాము కాటేసిందంటే చాలామంది మొదట తీవ్రంగా భయపడిపోతారు. దీంతో రక్తపోటు పెరిగిపోయి మృత్యువాతకు దారితీస్తుంది.
- కాటేసిన పాము జాతిని గుర్తించడం అవసరమే కాని దానిని పట్టుకోడానికి లేదా చంపడానికి ప్రయత్నించడం వల్ల మరిన్ని కాట్లకు గురి కావచ్చు. చికిత్సకూ ఆలస్యమవుతుంది.
- బాధితుడిని ప్రశాంతంగా ఉంచాలి. ఒత్తిడి చర్యల వల్ల రక్త ప్రవాహం పెరుగుతుంది. దీనివల్ల విషం వేగంగా శరీర భాగాలకు చేరుతుంది.
- కాటేసిన వెంటనే వీలైతే 108 ఫోన్ చేయాలి. అందుబాటులో లేకపోతే పాముకాటుకు గురైన అవయవం నుంచి ఇతర భాగాలకు రక్త సరఫరా జరగకుండా కట్టు కట్టాలి.
- పాముకాటు బాధితుడికి తినేందుకు లేదా తాగేందుకు ఏమీ ఇవ్వకూడదు.
- వైద్యుని ఆధ్వర్యంలో మినహా ఉత్ప్రేరకాలు లేదా నొప్పి నివారణ మందులు అందించకూడదు.
- పాము కాటేసిన చోట ఎలాంటి కోత పెట్టకూడదు. అనుభవం లేనివారు నోటితో రక్తం పీల్చే పని చేయవద్దు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి పాముకాటు

- భర్త మృతి.. భార్య, కుమారుడి పరిస్థితి విషమం

కొమ్ములవంచ(నర్సింహులపేట), న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తున్న ముగ్గురిని పాము కాటేయడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు విషమ పరిస్థితుల్లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం ఎర్రచక్రుతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన జాటోతు రవి(45), భార్య నీల, కుమారులు చరణ్, సాయి, కుమార్తె శైలజ శుక్రవారం రాత్రి తమ ఇంట్లో మంచంపై నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 9 గంటలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో రవి, నీల, చరణ్‌లను పాము కాటు వేసింది. ఏదో కుట్టినట్లు అనిపించిందని చరణ్ వారికి చెప్పాడు. కరెంటు వచ్చిన తర్వాత వెలుగులో వారికి పాము కనిపించడంతో కర్రతో కొట్టి చంపేశారు. రాత్రి 10 గంటలకు కొమ్ములవంచ గ్రామంలో పాముకాటుకు మంత్రాలు వేసే వ్యక్తి వద్దకు వెళ్లారు. అప్పటికే రవి పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబాబాద్‌లోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడి వైద్యుల సూచన మేరకు నీల, చరణ్‌లను ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

మాటకారి మహాత్ముడు!

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

ఎవరి నుంచీ ఏదీ ఆశించటానికి ఇష్టపడని గాంధీజీ తాను తలపెట్టిన హరిజనోద్ధరణ కార్యక్రమాల కోసం మాత్రం ఒక్కరిని కూడా వదలకుండా చిన్నాపెద్దా అందరినీ చేయిచాచి అర్థించేవాళ్లు. అనునయంగా, బింకంగా.. చాలాసార్లు సరదాగా.. మాటకారితనంతో మొహమాటపెట్టి మరీ ప్రజల నుంచి విరాళాలు రాబట్టేవారు. 1933 చివర్లో ఆయన హరిజన యాత్రలో భాగంగా ఆంధ్ర దేశంలో చోటుచేసుకున్న కొన్ని సరదా సంఘటనలు...

- నెల్లూరులో రేబాల సోదరుల ఇంట్లో బస చేసిన గాంధీజీ వారింట్లో ఉన్న అమ్మమ్మ గారిని చూడటానికి వెళ్లి ఆమెతో "అమ్మా.. నన్ను పెంచుకోరాదా?" అన్నారు. "అందుకు ఆక్షేపణ ఏముంది నాయనా?" అన్నారామె. వెంటనే ఆయన "నా పొట్ట చాలా పెద్దది! నాకు ఆకలి ఎక్కువ. నేను అన్నం తినను. బంగారమూ, నగలూ తిని జీర్ణం చేసుకుంటాను. నాకు అహర్నిశలూ నగలే కావాలి తల్లీ!" అన్నారు. ఆ మాట వింటూనే ఆమె మెడలో హారాన్ని తీసి గాంధీజీకి సమర్పించారు. ఆ రాత్రి గూడూరు బహిరంగ సభలో గోగినేని పిచ్చయ్యనాయుడు ఎంతో శ్రద్ధగా వచ్చి గాంధీజీకి రూ.116 సమర్పించారు. పక్కనున్నవారు ఆయనకు అబ్రకం గనులున్నాయని చెప్పటంతో "అలాగైతే లాభంలో నాకూ వాటా రావాలే! లాభం వచ్చే ప్రతి కంపెనీలోనూ నేను భాగస్తుణ్ణే. నేనెక్కడ తిరుగుతున్నా నాకు రావాల్సింది పంపుతుండండి సుమా..!" అనే సరికి వెంటనే ఆయన అంగీకారంగా తలూపారు.
- ఇదే యాత్రలో రాజమహేంద్రవరం స్టేషన్లో రైలులో నుంచి గాంధీజీ చెయ్యి చాచగానే ఒకాయన చేతిలో నారింజపండు పెట్టారు. వెంటనే గాంధీజీ "యే పైసాకీ బాత్ హై.. ఔర్ దూసరేకీ బాత్ నహీ" అని కోపం నటించగానే ఆయన జేబులో నుంచి డబ్బుతీసిచ్చారు. మరొకరు బంగారు ఉంగరం ఇవ్వగా "ఇది చాలా బాగుందే. నేను వేలికి పెట్టుకు తిరుగుతుంటే యరవాడ జైలులో ఉన్న ముసలమ్మ (కస్తూర్బా) ఏమనుకుంటుందో.." అంటూ నవ్వు ఆపుకోలేకపోయారు గాంధీజీ. ఇంతలో ఒకరు కొబ్బరిపెంకు ఉంగరం ఇవ్వగా.. "ఆహా.. ఇది బంగారు ఉంగరం కంటే మంచిది కదా" అంటూ వెంటనే పైసాతో వేలంపాట మొదలెట్టారు. చివరికి అది రూ.2.50కి అమ్ముడు పోయింది. సభలో ఒకరు గాంధీజీకి ఫౌంటెన్ పెన్ను బహూకరిస్తూ.. "ఈ ఖరీదైన 'ఏంజెల్' కంపెనీ పెన్ను మీకోసమే" అన్నారు. వెంటనే గాంధీజీ దాన్నీ వేలానికి పెడుతూ "ఏంజెల్స్ అంత చౌకగా దొరకరు.. దేవదూతలను చౌకగా పోనిచ్చి అవమానపరచకండి.." అన్నారు. చివరికి పాట రూ.5 దగ్గర ఆగింది. "సరే.. రూ.5కు దీన్ని తీసుకోండిగానీ.. క్యాష్ బేరం సుమా.." అనగానే అంతా ఫక్కున నవ్వారు. "ఈ డబ్బు హరిజనోద్ధరణకు ఉపయోగపడుతుంది కాబట్టి మంచి పనే చేశావు" అంటూ అతడి నుంచి డబ్బు తీసుకున్నారు.

మోదీకి యూఏఈ అత్యున్నత పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మోదీ రూపే కార్డును ప్రారంభించారు. ఆదివారం బహ్రెయిన్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ప్రసాదంగా సమర్పించడానికి ఓ ప్రత్యేక వస్తువును ఆయన కోనుగోలు చేశారు. మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా ముద్రించిన తపాలా బిళ్లను యువరాజుతో కలిసి ఆవిష్కరించారు.

కశ్మీర్‌లో పెట్టుబడులు పెట్టండి: ప్రవాస భారతీయుల సమావేశంలో మోదీ ప్రసంగిస్తూ రాజకీయ సుస్థిరత కారణంగా భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. ఇంతవరకు నిర్లక్ష్యానికి గురయిన జమ్మూ-కశ్మీర్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని కోరారు. ఓ పత్రికకు మోదీ ఇంటర్వ్యూ ఇస్తూ 370 అధికరణం కారణంగా కశ్మీరీ యువతను ఒంటరితనం ఆవహించిందని చెప్పారు. దాంతో స్వార్థపర శక్తులు వారిని తప్పుదోవపట్టించి తీవ్రవాదంవైపు వెళ్లేలా చేశారని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికే పూర్తి ప్రజాస్వామ్య, పారదర్శక, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ఆ అధికరణాన్ని రద్దు చేశాయని వివరించారు. చాలా మంది భారతీయులు యూఏఈని తమ రెండో నివాసంగా భావిస్తున్నారని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వం బహుళత్వాన్ని గౌరవిస్తూ, సహనశీలతతో వ్యవహరించడమే ఇందుకు కారణమని అన్నారు. ఇక్కడ 'సహనం' అనే శాఖకు ప్రత్యేకంగా మంత్రి ఉన్నారని తెలిపారు. అబుదాబిలో పర్యటన ముగించుకున్న అనంతరం మోదీ బహ్రెయిన్ రాజధాని మనామా చేరుకున్నారు. ప్రధాని, యువరాజు అయిన ఖలీఫా బిన్ సల్మాన్ అల్ ఖలీఫా స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలికారు. అంతరిక్ష, సౌర విద్యుత్తు రంగాల్లో సహకరించుకోవాలని ఇరు నేతలు నిర్ణయించారు. అనంతరం మోదీ మనామాలోని బహ్రెయిన్ జాతీయ స్టేడియంలో వేలమంది భారతీయులను ఉద్దేశించి మాట్లాడారు. త్వరలోనే ఇక్కడ రూపే కార్డును ప్రవేశపెడతామన్నారు.

తీరంలో హై అలర్ట్ ప్రకటించిన భారత నేవీ!

కోచి: తీరప్రాంతాల్లో భారత నౌకాదళం అత్యంత అప్రమత్తత (హైఅలర్ట్)ను ప్రకటించింది. లష్కరే తొయిబా(ఎల్ఈటీ)కు చెందినట్లుగా అనుమానిస్తున్న ఉగ్రవాదులు తమిళనాడులోకి చొరబడ్డారన్న నిఘావర్గాల సమాచారంతో ఈ చర్య చేపట్టింది. రక్షణశాఖ ప్రతినిధి ఒకరు శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. కోయంబత్తూర్‌లో హై అలర్ట్ ప్రకటించినట్లు నగర పోలీసు కమిషనరు సుమిత్ సహారన్ శుక్రవారం తెలిపిన విషయం గమనార్హం.

ఇరాక్‌లో భారీపేలుడు... ముగ్గురి మృతి

బాగ్దాద్: ముసయ్యిబ్ గ్రామంలోని ఓ షియా మసీదు వద్ద జరిగిన పేలుడులో ముగ్గురు వ్యక్తులు మరణించగా 34 మంది గా

అప్పుల ఊబిలోనే అన్నదాత

"దేశంలో వ్యవసాయ వృద్ధి శాతం పెరుగుతున్నా రైతుల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు ఉండటంలేదు. రెండు దశాబ్దాలుగా ఇదే పరంపర కొనసాగుతోంది. రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆర్థికంగా చితికిపోయి భూములను అమ్ముకొంటున్నారు. 1995 నుంచి 2017 వరకూ 22 సంవత్సరాల్లో మూడు లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు" అని దేశలో పెరుగుతున్న అసమానతలపై కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ (సీఎస్డీ) రూపొందించిన సామాజిక అభివృద్ధి నివేదిక-2018 విశ్లేషించింది. ఆర్థికాభివృద్ధి, విద్య, వ్యవసాయం, పట్టణీకరణ, వేతనాలు సహా అనేక అంశాలను ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్తలు టి.హక్, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి వంటి ప్రముఖులు విశ్లేషించారు. 'మార్కెటింగ్ సౌకర్యాలు సరిగాలేకపోవడం, ధరలకు సంబంధించిన సమాచార వ్యవస్థ లేకపోవడం రైతులకు నష్టం కలిగిస్తోంది. ఈ-నామ్ ద్వారా 585 హోల్‌సేల్ మార్కెట్‌లు 22 వేల గ్రామాలను అనుసంధానం చేయడం సమర్థంగా అమలైతే రైతులకు దోహదపడవచ్చు. రైతులకు ఆదాయ బీమా విధానం తీసుకురావాలి. దిగుబడి, ధరల హెచ్చుతగ్గుల నుంచి కాపాడేందుకు ఇది అవసరం' అని నివేదిక సూచించింది.

- దేశంలో 22 ఏళ్లలో 3 లక్షలమంది రైతుల బలవన్మరణం
- ఆదాయ బీమా విధానం కావాలి
- విశ్లేషించిన సామాజిక అభివృద్ధి నివేదిక-2018



వ్యవసాయ వృద్ధి పయనం	
1993-94	2%
2003-2004	3.8%

వ్యవసాయ కుటుంబాల్లో మూడింట రెండు వంతుల మందికి పంటల సాగే ప్రధాన ఆదాయ వనరు. కేవలం 4.7 శాతం మందికి మాత్రమే వ్యవసాయేతర రాబడి ఉంది.

పెట్టుబడి వ్యయం విపరీతంగా పెరిగినా అందుకు తగినట్లు పంటల ధరలు పెరగలేదు. రాబడి తగ్గిపోయింది. అనేక పంటల సాగు లాభసాటి కాకుండా పోయింది.

వ్యవసాయ కుటుంబం సగటు రాబడి నెలకు రూ.6,427. వ్యవసాయ కుటుంబాల్లో 33 శాతం పేదరికంలో ఉన్నాయి.

కమతం కరిగిపోతోంది

కమతాలు చిన్నవిగా ఉండటం వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రాబడులు తగ్గడానికి ఇది ప్రధాన కారణాల్లో ఒకటి. 1990-91లో సగటు కమతం 1.57 హెక్టార్లు ఉండగా 2010-11లో 1.15 హెక్టార్లకు.. ఇప్పుడు హెక్టారుకు పడిపోయింది.

అల్పాదాయ వర్గాలకు సగటున	0.80 హెక్టార్ల భూమి	చిన్న రైతు వార్షికాదాయం రూ.11,346
ఎక్కువ ఆదాయం ఉన్న వాళ్లకి	1.92 హెక్టార్ల భూమి	పెద్ద రైతుల రాబడి రూ.34,941

దిగుబడి అంతంతమాత్రమే

- మన దేశంలో పంటల దిగుబడి ప్రపంచ సగటు కంటే తక్కువ.
- ప్రపంచంలో పప్పు ధాన్యాల సగటు దిగుబడి 2012 గణాంకాల ప్రకారం హెక్టారుకు 3.62 టన్నులు. మన దేశంలో 2.05 టన్నులే. బిహార్, ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో జాతీయ సగటు కంటే తక్కువ.

పరిశోధన, విస్తరణలో విఫలం

- వ్యవసాయ పరిశోధన, విస్తరణ విధానం పూర్తిగా విఫలమైంది. ప్రాంతాల పరిస్థితులకు తగిన వంగడాలు అందుబాటులో లేవు. ఎక్కువ దిగుబడిని ఇచ్చేవి, తెగుళ్లను తట్టుకునేవి లేవు. వర్షాభావ, భారీ వర్షాలను తట్టుకునేవి అభివృద్ధి చేయడం అనేది ఇప్పటికీ సవాల్‌గానే ఉంది. ఎక్కువ దిగుబడిని ఇచ్చే వంగడాలు పరిశోధన కేంద్రాలు దాటి క్షేత్రస్థాయికి చేరలేదు.
- ప్రభుత్వ పరిశోధనలు తగిన స్థాయిలో లేవు. ఐసీఏఆర్, వ్యవసాయ విద్యాలయాల మధ్య సమన్వయంలేదు.

రెండు పంటలకే కనీస మద్దతు ధర

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై పూర్తి అవగాహన లేదు. ఉదాహరణకు తీవ్రమైన కరవు, వరద పరిస్థితులు ఉన్న 2015-16వ సంవత్సరంలో పంటల బీమా.. సాగులో 26 శాతం మాత్రమే. కనీస మద్దతు ధర విధానం కూడా విఫలమైంది. మొత్తం 24 వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర అమల్లో ఉన్నా వరి, గోధుమలకు మాత్రమే సమర్థంగా అమలవుతోంది. అదీ కొన్ని ప్రాంతాల్లోనే.

– ఈనాడు, హైదరాబాద్

గుట్ట మీద గుడొక్కటే..!

- యాదాద్రిలో భక్తుల వసతులన్నీ కిందే ఏర్పాటు
- కొండపైనున్న మిగతా గదుల కూల్చివేతకు సన్నాహాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: దివ్యక్షేత్రంగా రూపుదిద్దుకొంటున్న యాదాద్రిలో భక్తిభావంతో జనం ఓలలాడేందుకు సరికొత్త ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేందుకు కొండపై ఆలయాలు మాత్రమే ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. క్షేత్రాభివృద్ధి కోసం 2016లోనే గుట్టపై ఉన్న కాటేజీలు, గదుల సముదాయాలను నేలమట్టం చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత 90 గదుల శ్రీచక్ర, వ్రతమండపం, దేవస్థానం కార్యాలయ భవనాలు మాత్రమే మిగిలాయి. ఇటీవల యాదాద్రిని సందర్శించిన సీఎం ఆదేశాల మేరకు మిగిలిఉన్న వసతి సముదాయాలనూ తొలగించేందుకు రంగం సిద్ధంచేశారు. త్వరలోనే క్షేత్రంలో శ్రీసుదర్శన మహాయాగం నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఆ పర్వానికి ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగేందుకు మరో దారి అవసరమని ఆర్‌అండ్‌బీ శాఖ సూచించింది. సులభ్, శ్రీచక్ర కాంప్లెక్స్, వ్రత మండపం, పుష్కరిణి వీధి మీదుగా శివాలయం సమీపంలో విశాల రహదారి నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రహదారి ఏర్పాటుతోపాటు క్షేత్రాన్ని సువిశాలంగా మార్చేందుకు పాత భవనాలు మొత్తం కుల్చివేయాలని నిర్ణయించారు.

ఆలయాభివృద్ధి పనులు పూర్తయ్యాక కూడా కొండపై వసతి సముదాయాలేవీ ఉండవని ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ(యాడా) చెబుతోంది. ఈ నేపథ్యంలో భక్తులకు అన్నప్రసాద వసతి ఎక్కడ కల్పించాలన్న దానిపై దేవస్థాన అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రసాదాల తయారీని పాతగుట్టలో చేపట్టి వాటిని కొండపైకి తరలించే ప్రక్రియలో సమస్యలు ఎదురవుతాయని భావిస్తున్నారు. మరోవైపు ఆలయాల చెంత బస చేసి నిద్ర మొక్కును తీర్చుకునే సదుపాయం ఉండదని భక్తులు భావిస్తున్నా.. విశాలమైన వసతుల కోసమే ఈ నిర్ణయమని 'యాడా' అధికారులు చెబుతున్నారు.

డాక్టర్ కొండవీటి మురళి మెమోరియల్'యువ మహిళా రైతు' అవార్డులు

దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: గురు కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ కొండవీటి మురళి మెమోరియల్ 'యువ మహిళా రైతు అవార్డుల(యంగ్ ఉమెన్ ఫార్మర్ అవార్డ్స్)ను త్వరలో అందజేయనున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ కె.వి.వి.రావు ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో చాలామంది మహిళలు వ్యవసాయ రంగాన్ని ఎంచుకుని ఎంతో మందికి స్ఫూర్తిని కలిగిస్తున్నారని చెప్పారు. వారి సేవలకు ఈ ఏడాది మొదటి సారిగా డాక్టర్ కొండవీటి మురళి మెమోరియల్ యువ మహిళా రైతు అవార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువ మహిళా రైతులు పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని సెప్టెంబరు 15వ తేదీలోగా..ప్లాట్ నంబర్ 318, ఐకాన్ కాస్మోస్, ఫ్లాట్ నంబర్ 402, మిథిలానగర్, ప్రగతినగర్, హైదరాబాద్-500090 చిరునామాకు పంపాలని కోరారు. పూర్తిసమాచారం కోసం www.kondaveeti.orgని సంప్రదించవచ్చని వివరించారు.

గాలి ఉద్ధృతికి నాగార్జున సాగర్ క్రస్టుగేట్ల మీద నుంచి దూకుతున్న నీరు

గరిష్ఠస్థాయికి సాగర్ నీటిమట్టం

- అర్ధరాత్రి రెండు గేట్లద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ జలాశయం క్రస్టుగేట్ల ద్వారా అధికారులు శుక్రవారం అర్ధరాత్రి నీటిని విడుదల చేశారు. జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరడం, శ్రీశైలం నుంచి 70,041 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటంతో అర్ధరాత్రి 11.00 గంటల నుంచి 3.00 గంటల వరకు రెండు క్రస్టుగేట్లను అయిదు అడుగుల మేరకు ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

గేట్లపై నుంచి దూకుతున్న నీరు

సాగర్ నీటిమట్టం గరిష్ఠ స్థాయి(590 అడుగులకు)కి చేరడం.. ఎగువ నుంచి వరద వస్తుండటంతో గాలి ఉద్ధృతికి అలలు డ్యాం క్రస్టుగేట్లపై నుంచి దూకుతున్నాయి. ఈ అలల నీరు 26 గేట్లపై నుంచి వస్తుండటంతో అన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లుగా కనిపిస్తోంది. ఆ జల దృశ్యం తెల్లని పాలనురుగు ప్రవాహం మాదిరిగా కనువిందు చేస్తూ.. పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తోంది.

మోసాలు విత్తుకుంటాయ్

- విత్తన వ్యాపారులకు మరింత స్వేచ్ఛ
- ఒక్కసారి లైసెన్సు తీసుకుంటే ఐదేళ్లు బేఫికర్
- విత్తన నియంత్రణ ఉత్తర్వులకు కేంద్రం సవరణ
- కంపెనీల ఒత్తిళ్లతో మారిన నిబంధనలు

ఈనాడు, హైదరాబాద్: విత్తన విక్రయ వ్యాపారులకు మరింత స్వేచ్ఛనిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకాలం లైసెన్సు చెల్లుబాటు కాలవ్యవధి మూడేళ్లు ఉండగా ఇకనుంచి ఐదేళ్లకు పెంచుతున్నట్లు కేంద్రం పేర్కొంది. ఈ మేరకు 'జాతీయ విత్తన నియంత్రణ ఉత్తర్వు-1983'(ఎస్‌సీఓ)కు సవరణ చేస్తున్నట్లు తెలుపుతూ రాష్ట్ర వ్యవసాయశాఖకు ఆదేశాలిచ్చింది. దీనివల్ల వ్యాపారులపై నిఘా తగ్గుతుందని వ్యవసాయాధికారులు సైతం వాపోతున్నారు. ఇప్పటికే నాసిరకం, నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులను పక్కా ఆధారాలతో పట్టుకున్నా వారిపై కేసులు పెట్టి లైసెన్సు రద్దు చేయాలంటే కష్టాలు తప్పడంలేదని సీనియర్ రాష్ట్రస్థాయి వ్యవసాయాధికారి ఒకరు 'ఈనాడు'కు చెప్పారు. ఇప్పుడున్న విధానంలో మూడేళ్లకో మారు లైసెన్సు పొడిగించేందు(రెన్యువల్)కు రాష్ట్ర వ్యవసాయశాఖకు దరఖాస్తు చేసి రూ.వెయ్యి రుసుం చెల్లిస్తే చాలు. ఇలా రెన్యువల్‌కు వచ్చినప్పుడు మూడేళ్లలో వారి విత్తన అమ్మకాలెలా ఉన్నాయనే చరిత్రను పరిశీలించి తప్పుడు పనులు చేసినట్లు గుర్తించే అవకాశముంటుంది. తప్పుడు పనుల జాబితాలో ఉన్నవారికి రెన్యువల్ చేయకుండా రాష్ట్ర వ్యవసాయశాఖ ఆపే అవకాశం ఉంది. ఇలా చేస్తున్నారనే ఐదేళ్లకోగడువు పెంచేలా విత్తన కంపెనీలు కేంద్ర వ్యవసాయశాఖ వద్ద లాబీయింగ్ చేసినట్లు తెలుస్తోంది.

లైసెన్సే వద్దని..

విత్తన వ్యాపారులకు లైసెన్సుల విషయంలో దిల్లీ కేంద్రంగా కొంతకాలంగా లాబీయింగ్ జరుగుతోంది. విత్తనాల విక్రయాలు 'నిత్యావసరాల చట్టం-1955' పరిధిలో ఉన్నాయి. ఈ చట్టం కింద ఉన్నవాటిని విక్రయించేందుకు లైసెన్సు అవసరం లేదని, రద్దు చేయాలని పలు కంపెనీలు కొంతకాలంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయి. దీనిపై అభిప్రాయం చెప్పాలని కేంద్ర వ్యవసాయశాఖ ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖను అడిగింది. లైసెన్సులుంటేనే నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను నష్టపరుస్తున్నారని, ఇక లైసెన్సులే లేకపోతే మరింత కష్టమవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ కేంద్రానికి స్పష్టం చేసింది. వాస్తవానికి లైసెన్సు రెన్యువల్ చేసుకునే ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతున్నందున అది పెద్ద పని కాదు. ఒకసారి నాసిరకం అమ్ముతూ పట్టుబడితే మళ్లీ రెన్యువల్‌కు కష్టమవుతుందని వ్యాపారులు కంపెనీల ద్వారా లైసెన్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని గట్టిగా కోరుతున్నారు. చివరికి రాష్ట్రాల అభిప్రాయాలకనుగుణంగా లైసెన్సు రద్దు చేయడానికి బదులు మూడేళ్ల నుంచి ఐదేళ్లకు రెన్యువల్ గడువును పొడిగిస్తూ విత్తన నియంత్రణ సవరణ ఉత్తర్వు-2019ను జారీ చేసిందని సీనియర్ అధికారి చెప్పారు.

హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణ వారికి అన్యాయం

- కొన్ని సామాజిక వర్గాలకు అవకాశాలు రావడం లేదు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణ వారికి గాకుండా ఇతరులకు అవకాశం ఇస్తున్నారని, కొన్ని సామాజిక వర్గాల వారికి అన్యాయం జరుగుతోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పించాల్సి ఉందని అన్నారు. ఇకనైనా ఇక్కడి వారిని ఎంపిక చేయాలన్నారు. కొత్త పదవి చేపట్టిన సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం వినోద్‌ను న్యాయవాదులు సన్మానించారు. "ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేరుస్తున్నారు. న్యాయవాదుల సంక్షేమానికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నారు. నేను న్యాయవాదిగా ఉన్నాను కాబట్టే నాకు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి ఇచ్చారు. తెలంగాణలో ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు విషయంలో కేంద్రం మరో ఐదేళ్లు వాయిదా వేయాలని అనుకుంది. సీఎం, ఎంపీలు, న్యాయవాదుల ఒత్తిడితోనే దానిని ఏర్పాటు చేసింది. న్యాయవాదుల సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా. వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాల్సిన అవసరం గురించి కూడా వివరిస్తా. కొత్త జిల్లాల్లో కూడా న్యాయస్థానాలు రాబోతున్నాయి. అక్కడ నియామకాల్లో కూడా మన వాళ్లకు ప్రాధాన్యం లభిస్తుంది' అని వినోద్ అన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ, వినోద్ సామర్థ్యాన్ని గుర్తించి ఆయనకు సీఎం సరైన పదవి ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గండ్ర మోహన్‌రావు, కళ్యాణ్‌రావు, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరంగారావు, రాజేశ్వర్‌రావు, గోవర్ధన్ రెడ్డి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. లలితారెడ్డి, భానుప్రియ, కృష్ణ యాదవ్, రజిత రెడ్డి మరికొందరు న్యాయవాదులు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

వినోద్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

పచ్చదనానికి బలరాముడు

నిరుపేద కుటుంబం నుంచి ఉన్నతాధికారిగా ఎదిగిన ఆయన పర్యావరణ పరిరక్షణలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రోజూవారీ విధులకు హాజరవుతూనే ఖాళీ సమయాల్లో వేలాది మొక్కలు నాటుతున్నారు. సివిల్ సర్వీసులో ఐఆర్ఎస్ విభాగానికి ఎంపికైన బలరాం సింగరేణి సంస్థలో సంచాలకుడిగా పనిచేస్తున్నారు. హరితహారం పథకంలో భాగంగా తానొక్కరే సొంతంగా ఐదు వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుని నాలుగు నెలల్లో 4220 మొక్కలు నాటారని సింగరేణి సంస్థ తెలిపింది. గత నెల 20న శ్రీరాంపూర్‌లో ఉపరితలగని మట్టి కుప్పలపై గంట వ్యవధిలో 1257 మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. అదే రోజు జైపూర్ విద్యుత్కేంద్రంలో మరో 501 మొక్కలు నాటారు. ఈ రికార్డు హైరేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదైంది. పాలమూరు జిల్లా తిరుమలగిరికి చెందిన హన్య, కెస్లీ దంపతుల ఏడుగురు సంతానంలో పెద్దవాడైన బలరాం చిన్నతనంలో పేదరికం వల్ల కూలి పనులు చేశారు. ఇంటర్ చదువుతున్న సమయంలోనే వివాహమైనా కుటుంబ భారం మోస్తూనే చదువు కొనసాగించారు. 2010లో సివిల్స్ రాసి రెవెన్యూ విభాగానికి ఎంపికయ్యారు. ముంబయిలో కస్టమ్స్‌శాఖలో ఉప కమిషనర్‌గా పనిచేసి అనంతరం సింగరేణికి వచ్చారు.

–ఈనాడు, హైదరాబాద్

పర్షియన్ రికార్డులపై అధ్యయనం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లోని రాష్ట్ర రాజ్యాభిలేఖన పరిశోధనాలయంలో అధ్యయనం చేయడానికి జర్మనీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ పర్షియన్ సమ్మర్ స్కూల్' శనివారం ప్రారంభమైంది. ఐదురోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా క్రీ.పూ 1406 ముందు నుంచి ఉన్న ఇండో- పర్షియన్ రికార్డులపై 30 మంది విదేశీ పరిశోధకులు అధ్యయనం చేయనున్నారు.

Few Seats in
MBBS
BDS
(Should be qualified in NEET)
Contact: (0) 90528 77360

ఓహ్..మియావాకీ!

మొక్కల పెంపకంలో జపాన్ విధానంపై రాష్ట్ర అటవీ శాఖ చూపు □ వరంగల్ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు

కాకులు దూరని కారడవి, చీమలు చేరని చిట్టడవి..అని చిన్నప్పుడు కథల్లో వినే ఉంటాం. అడవి అంటేనే అడుగడుగునా దట్టమైన చెట్లు! అక్కడికి వెళ్లి వాటిని చూడకుండానే, అదే అనుభూతిని ఇంటి పెరటి ప్రాంతంలో పొందాలంటే, రోజూ హాయిగా సేద దీరాలంటే..ఇదిగో ఇదీ దారి!

ఈనాడు, వరంగల్: ఒకే ప్రదేశంలో పక్కపక్కనే వందలాది మొక్కలు నాటితే..కొంతకాలానికి అదే చిట్టడవి. ఈ పద్ధతినే జపాన్ పరిభాషలో 'మియావాకీ' అంటారు. మంచి ఫలితాలు ఇస్తుండటంతో, దీన్ని ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ అందిపుచ్చుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియ చేపట్టింది. ముఖ్యంగా వరంగల్ పట్టణ, గ్రామీణ జిల్లాల్లో మియావాకీ రీతిలోనే చిట్టడవిని పెంచుతోంది. ఈసారి 'హరిత హారం'లో భాగంగా ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలోని అటవీ కార్యాలయ ఆవరణతో పాటు గ్రామీణ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్‌నగర్ నర్సరీలోనూ ఒకేచోట వేలాది మొక్కలను నాటారు. సమీప ప్రాంతాల ప్రజలకు మరింత అవగాహన కల్పించే పనిలో ఉన్నారు. పలువురి కృషి ఫలితంగానే వివిధ సంస్థలు, ప్రభుత్వ శాఖలు ముందుకొస్తున్నాయి. ఇప్పటికే కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ వరంగల్ కోట ప్రాంతంలో పదివేల మొక్కల్ని నాటే పనిని అందుకుంది. వరంగల్‌లోని జాతీయ సాంకేతిక సంస్థ (ఎన్ ఐటీ)లో కూడా త్వరలో నాటేందుకు సిద్ధమవుతున్నారు. ఇతర జిల్లాలకు సైతం పనులు విస్తరిస్తున్నారు. సిబ్బంది ఇప్పటికే సమగ్ర శిక్షణ తీసుకున్నారు. ఇదంతా పట్టణ ప్రాంత అటవీకరణకు దోహదపడుతోందని వరంగల్ గ్రామీణ జిల్లా అటవీ అధికారి పురుషోత్తం తెలిపారు.

జపాన్ విధానం ద్వారా హన్మకొండలోని అటవీశాఖ కార్యాలయం వద్ద ఒకే చోట నాటిన మొక్కలు

పెంచిన చిట్టడవితో వృక్షశాస్త్రవేత్త అకీరా మియావాకీ

ఆసక్తికి శక్తి తోడైతే..

జపాన్ వృక్షశాస్త్రవేత్త అకీరా మియావాకీ దశాబ్దాల కిందటే చిట్టడవుల 'ఏర్పాటు'కు సంకల్పించారు. అనేక కారణాలతో అడవులు అంతరిస్తున్న తరుణంలో ప్రత్యామ్నాయంగా నూతన రీతికి ఆద్యులయ్యారు. ఇళ్ల పెరట్లోనే కాదు- కళాశాలలు, కార్యాలయాలు, పబ్లిక్ పార్కులు..ఇలా ఎన్నో ప్రదేశాల్లో 'సృష్టించడం'పై వ్యవస్థాత్మక విధానాన్ని రూపుదిద్దారు. ఆయన పేరుతోనే 'మియావాకీ'ని వివిధ దేశాలు అనుసరిస్తున్నాయి. మనదేశంలోనూ హైదరాబాద్ సహా, బెంగళూరు, చెన్నై, ముంబయి, తదితర నగరాల్లో కార్పొరేట్ సంస్థలు ఈ తీరులో మొక్కలు నాటుతున్నాయి. ముంబయిలోని ఒక స్వచ్ఛంద సంస్థ ఎకరం స్థలంలో 12,000 మొక్కలు నాటడంతో, అదంతా చిట్టడవిని తలపిస్తోంది. మొక్కల ప్రేమికులు ఎంతోమంది ఇళ్ల పెరళ్లలో అడవులు పెంచుతున్నారు.

నేడు పలుచోట్ల భారీ వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: బంగాళాఖాతం ఒడిశా తీరంలో శనివారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా 7600 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఉంది. ఈ నెల 28న బంగాళాఖాతం ఉత్తర ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. తెలంగాణలోని తూర్పు, ఉత్తర ప్రాంత జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. మిగతా ప్రాంతాల్లో ఒక మాదిరిగా పడతాయన్నారు. శనివారం పగలు రాష్ట్రంలోని 164 ప్రాంతాల్లో ఒక మాదిరి వర్షాలు కురిశాయి. అత్యధికంగా అశ్వారావుపేట, కొత్తపల్లిలో 38.5, వాజేడులో 25.8, సిర్గాపూర్‌లో 24, దేవులవాడలో 19, ఎల్కపల్లిలో 18.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

ఆదివారాల్లోనూ ఉస్మానియా ఓపీ సేవలు

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం విషజ్వరాలు, వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో.. నగరంలోని ఉస్మానియా ఆసుపత్రిలో ఆదివారాలూ ఓపీ కేంద్రాలు తెరచి ఉంచి రోగులకు వైద్యసేవలు అందజేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.బి.నాగేందర్ తెలిపారు. అవసరమైతే ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుంటామని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యవిద్యా సంచాలకులు డా.రమేశ్‌రెడ్డి మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జనరల్ మెడిసిన్ విభాగం ఓపీ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. మందులనూ పంపిణీ చేస్తామన్నారు.

SRI RAMACHANDRA 34
INSTITUTE OF HIGHER EDUCATION AND RESEARCH
(Deemed to be University), Porur, Chennai
Graded as a Category – I University by the UGC and Accredited by NAAC with 'A' Grade
044 - 45928533, 24765512/ 24768403. Ext. 228/568 Mob : 9444474076
ADMISSION NOTIFICATION
Applications are invited from eligible candidates to fill up a few unfilled seats in
M.PHARM & PHARM.D (PB) - 2019-20
full-time programmes approved by AICTE & PCI
M.Pharm
Pharmacognosy, Pharmaceutical Quality Assurance, Pharmacy Practice, Pharmacology, Pharmaceutics, Pharmaceutical Regulatory Affairs
&
PHARM . D (PB)
Limited seats available
Spot Admission
Highlights: AICTE-GPAT scholarship, Vibrant Placement Cell, Industrial Projects
Eligibility: Bachelors Degree in Pharmacy with not less than 55% in the aggregate
For Details: Visit : www.sriramachandra.edu.in
Last Date for submission of applications : 30th September 2019
REGISTRAR

ఈనాడు

ఏది దారి?

ప్రతి మనిషికీ సృష్టికర్త ఒక్కోరకమైన ప్రజ్ఞావిశేషాన్ని అనుగ్రహిస్తాడు. తనలోని ప్రతిభను గుర్తించి వెలికితీసిన మనిషి జీవితంలో విశేషంగా రాణిస్తాడు. తిరుపతి వేంకటకవుల్లో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి 'కవనార్థంబుదయించితిన్ సుకవితా కావ్యంబె నా వృత్తి' అని తన అంతర్గత ప్రజ్ఞా స్వరూపాన్ని గోళీలాడే వయసులోనే గుర్తించారు. 'ఈ భవము అద్దాన తరియింతు, తద్భవమె మద్భాగ్యంబు సర్వంబు' అని నిర్ణయించుకున్నారు. ఆ రంగంలో సాధన కొనసాగించారు. ఆశువుగా కవిత్వం చెప్పడమనేది 'నల్లేరుపై బండి నడక మాకు' అని నిరూపించారు. వారి కవితా వ్యాసంగం ఏ స్థాయి విజయం సాధించిందో వారి మాటల్లోనే చెప్పాలంటే- 'ఏనుగునెక్కినాము ధరణీంద్రులు మ్రొక్కగ నిక్కినాము, సన్మానములందినాము, దిగ్విజయంబొనర్చి ప్రజ్ఞానిధులంచు పేరు గొనినారము...' పైగా తమతో సమానమైన వేలమంది శిష్యులను సృజించగలిగారు. అందుకే వారిని 'అద్యతనాంధ్ర కవి ప్రపంచ నిర్మాతలు'గా లోకం ప్రస్తుతించింది. కవిసమ్రాట్ విశ్వనాథ సైతం వారిలో ఒకరు. 'మా రోజుల్లో చెళ్ళపిళ్ళ మాకు గురువు అని చెప్పుకోవడం శిష్యులకు ఎంతో గర్వకారణంగా ఉండేది' అని స్వయంగా విశ్వనాథే ప్రకటించారు. ఇదంతా ఎందుకు సాధ్యమైందంటే- ఈశ్వరుడు తనకు ప్రసాదించిన ప్రజ్ఞ ఏమిటో చెళ్ళపిళ్ళ తన బాల్యంలోనే గుర్తించి, అదే రంగంలో కృషి చేయడం వల్ల! ఒకవేళ అలా గుర్తించడంలో విఫలమైనా, లేక ఆ రంగంలో కొనసాగడానికి వీలుకాకపోయినా- 1870లో పుట్టి 80 ఏళ్లు జీవించిన ఆ వ్యక్తి గురించి ఇన్నేళ్ల తరవాత మనం మాట్లాడుకోవలసిన అవసరం ఉండేది కాదు. 'జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః...' రససిద్ధులైన కవీశ్వరులు కీర్తిదేహాలతో జీవించే ఉంటారన్న సూక్తి వారికి అన్వయించేదీ కాదు.

ఇంతకీ మనిషిలో ఆలోచనాశక్తి ఎలా పుడుతుందో, దాన్ని గుర్తించడం ఎలాగో, తన దారేదో గ్రహించడం ఎలాగో చెప్పడం కష్టం. 'అరయగ ఊహశక్తి తనయంతట తాను ఘటిల్లునో, పురాభరిత అనంత సంసృతి(సంసారం) శుభంబున చేకురునో' అంటూ ఊహ ఆవిర్భావ హేతువును అన్వేషించారు విశ్వనాథ. 'నా ఊహ రసరాజ్యడోల' అని పసిగట్టిన శ్రీశ్రీ క్రమంగా మహా(ప్రస్థాన) కవిగా ఎదిగారు. తన విషయంలో అమ్మఒడి దానికి కారణంగా గుర్తించారు జాషువా. 'పుణ్యముల తల్లి! నీ పాలపుష్టి కతన కవన బాలిక నా జిహ్వ నవతరించె' అంటూ ఆమెకు 'కన్నతల్లి' ఖండకావ్యంలో నివాళులు అర్పించారు. గోదావరి నీళ్ళు తాగడం కవితా శక్తికి బలవర్ధకమని కవుల విశ్వాసం. 'గౌతమాపత్య వాఃపూరంబున్ సయిదోడుగా సుకవితా భోగంబు అవిచ్ఛిన్న ధారా రమ్యంబగు' అని మల్లంపల్లి శరభయ్య ఘంటాపథంగా తేల్చి చెప్పారు. ఎక్కువమంది విషయంలో గురువులు ఆ పుణ్యం కట్టుకుంటారు. శిష్యుల విషయంలో ఏ పుట్టలో ఏ పాముందో పసిగట్టగల నైపుణ్యం గురువులకు ఉంటుంది. ఆయా విద్యల్లో శిష్యులకు ప్రత్యేక శిక్షణనిచ్చి తమను మించినవారిగా తయారుచేస్తారు. 'పక్షి శిరంబు తిరంబుగ వీక్షించితిని ఒండు కానను ఎద్దియున్... పక్షి తల తప్ప నాకు, వేరేదీ కనపడటం లేదు' అని పలికిన అర్జునుడి నిశిత దృష్టిని ద్రోణుడు గ్రహించి ఎన్నో విలువిద్యా రహస్యాలు నేర్పించాడని భారతంలోని ఆదిపర్వం వివరించింది. దాంతో అర్జునుడు గురువును మించిన శిష్యుడు అయ్యాడంది. 'అయిదడుగుల తాపీమేస్త్రి వంద అడుగుల ఎత్తున్న భవనాన్ని నిర్మించినట్లు' అంటూ శాస్త్రం గురుశిష్యుల అనుబంధం విషయమై చక్కని పోలికను చెప్పింది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల గురించి ఇదే కోణంలో ఆలోచిస్తారు. పిల్లలు తమను మించిపోవాలనుకుంటారు- అన్నింటా!

'తమ పూర్వీకుల ఘనతను తలచుకొని గర్వించలేనివారికి ఘనకార్యాలు సాధించాలన్న కుతూహలం ఉండదు' అన్నారు మనస్తత్వవేత్తలు. ఫలానా వారికి మేము వారసులం... ఇంతటి గొప్ప సంస్థలో ఉద్యోగులం... ఖ్యాతిగాంచిన భారతదేశపు పౌరులం... అనిపించే ఒకానొక గర్వరేఖ మనిషిని గొప్ప పనులకు ప్రోత్సహిస్తుంది. 'ఇదమిత్థమని నిర్ణయింపగా రానిది ఏ కోర్కెయో రూపు గైకొన్నయట్లు' అని విశ్వనాథ చెప్పినట్లు తెలియని ఆ గర్వరేఖ బలమైన ఉత్ప్రేరకమై ఉన్నత శిఖరాల వైపు మనిషిని ఎగదోస్తుంది. అంతరాంతరాల్లో దహించివేసే ఆ తహతహను స్ఫూర్తిగా గ్రహించి కార్యాచరణకు సిద్ధపడినవాడు తన విద్యలో సిద్ధుడవుతాడు. బద్ధకించి ఊరుకున్నవాడు కాలానికి, ఖర్మానికి బద్ధుడవుతాడు. ప్రబంధ కవుల్లో పింగళి సూరనది ఒక విశిష్ట స్థానం. అదే వంశంలో పుట్టడం పింగళి లక్ష్మీకాంతానికి ఉత్తేజాన్నిచ్చింది. చక్కని సాహితీవేత్తగా ఆవిర్భవించేందుకు తగిన ఆలంబన ఇచ్చింది. 'మా పూర్వులు సూరనాదుల తపోబల సంపద కల్మి నాకు' అని చెప్పుకొన్నారాయన. 'మహాకవియన్న కీర్తి ఆంధ్రోర్వి(తెలుగునాట) లభించె నిక్కమిది, యోగ్యత లేని యశంబు మోసితిన్...' అన్నారాయన. ఆ బరువును క్రమంగా పరువుగా మార్చుకొన్నారు. 'ఇంజినీరింగ్ విద్యార్థుల విషయంలో అంతర్గత ప్రజ్ఞను కనుగొనే ప్రయత్నం మేము చేపడుతున్నాం' అంటోంది కేంద్ర మానవ వనరుల శాఖ. తమ మిత్రులు చేరుతున్నారనో, తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారనో తమది కాని రంగంలోకి విద్యార్థులు ప్రవేశిస్తున్నారని ఆ మంత్రిత్వశాఖ గమనించింది. చేరారు కనుక ఏదో విధంగా గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నారు గాని, ఆ విద్యలో ఏ విధమైన నైపుణ్యం చూపించలేకపోతున్న విద్యార్థులను ముందే వడపోయాలంటోంది. ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఏ విద్యకు ఆ విద్యార్థి పనికొస్తాడనేది ప్రారంభంలోనే తేలుస్తామంటోంది. ఆలోచన మంచిదే మరి!

బహుముఖ ప్రజ్ఞా ధురీణుడు

ముప్పవరపు వెంకయ్యనాయుడు
(భారత ఉపరాష్ట్రపతి)

స్పష్టమైన ఆలోచనా సరళి, దృఢ సంకల్పం, సమర్థ భావప్రకటనా సామర్థ్యం అరుణ్ జైట్లీ సొంతం. నా చిరకాల ప్రియ మిత్రుడు అరుణ్ జైట్లీని ఈ నెల 11న దిల్లీ ఆస్పత్రిలో పరామర్శించినప్పుడు, ఆయన శీఘ్రంగా కోలుకుంటారని, కోలుకోవాలని ఆశించాను. ఆయన కూడా నా చేతిలో చేయి వేసి, త్వరలోనే మామూలు మనిషిని అవుతానని సైగల ద్వారా సూచించారు. ఆయనతో అదే చివరి కరచాలనం అవుతుందని కలలోనైనా ఊహించలేదు. ఇంత త్వరగా ఆయన శాశ్వత వీడ్కోలు పలుకుతారని అనుకోలేదు. జైట్లీ మళ్ళీ మన మధ్యకు వచ్చి కర్తవ్య నిర్వహణకు ఉపక్రమించబోరని, అవసరమైనప్పుడు ఆయన సలహాసంప్రతింపులు నాకు లభించబోవని భావించడమే దుస్సహంగా ఉంది. ఆ కఠోర వాస్తవంతో రాజీపడలేకున్నాను.

నాలుగు దశాబ్దాల స్నేహం

కళాశాల రోజుల నాటిది మా ఇద్దరి తొలి పరిచయం. అప్పటి నుంచి 40 ఏళ్లపాటు దూరదృష్టి గల వివేకవంతమైన ఆయన సలహాలు స్వీకరిస్తూ వచ్చాను. 1974లో అఖిల భారత విద్యార్థి సంఘాల సదస్సులో మేము మొదటిసారి కలుసుకున్నాం. ఆ సదస్సులో జైట్లీ దిల్లీ విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తే, నేను ఆంధ్ర విశ్వవిద్యాలయ సంఘానికి ప్రతినిధిని. అప్పటినుంచి మా రాజకీయ పయనం చెట్టపట్టాలుగా సాగింది. ఆ సుదీర్ఘ యానంలో ఎన్నో ఒడుదొడుకులను కలిసికట్టుగా ఎదుర్కొని అధిగమించాం. ఈ క్రమంలో మా మధ్య దృఢమైన సాన్నిహిత్యం, పరస్పర గౌరవం నెలకొన్నాయి. చివరకు విధి క్రూర హాసం నా నేస్తాన్ని నాకు దూరం చేసి తీరని వేదన మిగిల్చింది. బహుముఖ ప్రజ్ఞావంతుడు అనే పదానికి నిలువెత్తు నిర్వచనమే అరుణ్ జైట్లీ. 66 ఏళ్ల జైట్లీ సమకాలీన భారతంలో అందరి మన్ననలు చూరగొన్న రాజకీయ దిగ్గంతుడు. ఆయన విస్పష్ట ఆలోచనా సరళి, తాను నమ్మిన ఆశయాలు, విలువల పట్ల పూర్ణ విశ్వాసం, దృఢ సంకల్పం, సమర్థ వాగ్ధాటి, సమస్యల నేపథ్యాన్ని విడమరచి చెప్పి కార్యోన్ముఖుల్ని చేసే సత్తా జైట్లీని అద్వితీయ నాయకుడిగా నిలబెట్టింది. సమకాలీన యుగంలో పార్టీకి, ప్రభుత్వానికి సమర్థ వాణిగా వెలిగిన జైట్లీ అస్తమయంతో దేశం గొప్ప దిగ్దర్శకుడిని కోల్పోయింది.

న్యాయ శాస్త్ర అధ్యయనం, సుదీర్ఘకాలం న్యాయవాద వృత్తిలో రాణించడం జైట్లీ కుశాగ్ర బుద్ధికి అద్దం పడతాయి. బుద్ధి కుశలతతో ఎదుటివారి వాదనలను దీటుగా అధిగమించేవారు. వాదప్రతివాదాల్లో తన ఆధిక్యత చాటుకునేవారు. వాదంలో ఆయన ముందుకుతెచ్చే అంశాలన్నింటితో ఎదుటివారు ఏకీభవించకపోవచ్చు కానీ, జైట్లీ తన దృక్పథాన్ని శక్తిమంతంగా ప్రకటించే తీరుకు మాత్రం ముగ్ధులవుతారు. స్వపర భేదాల్లేకుండా అన్ని పక్షాలవారిని ఒప్పించే వాదనా పటిమ జైట్లీకి గొప్ప గుర్తింపు తెచ్చింది. అనేక కీలక సమస్యలపై జైట్లీ ప్రదర్శించిన అవగాహన, దృక్కోణాలు పార్లమెంటు లోపల, వెలుపల ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలపై గాఢమైన ముద్ర వేశాయి. సమకాలీన రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యలపై ఆయన క్రమం తప్పకుండా రాసిన బ్లాగులు చదివి తీరాల్సినవి. ఆ బ్లాగులు జనానికి ముఖ్యమైన సమాచారాన్ని అందించి, వారి ఆలోచనా పరిధిని విస్తరించాయి.

జైట్లీ ప్రతిభావ్యుత్పత్తులు చాలా వేగంగా ఆయన్ను ప్రఖ్యాతుడిని చేశాయి. 1974లో దిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన జైట్లీ, ఆత్యయిక స్థితి అనంతరం 1977లో స్థాపితమైన జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక వర్గానికి అత్యంత పిన్నవయస్కుడైన సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తరవాత భారతదేశం రాజకీయంగా ఎన్నో మిట్టపల్లాలు చూసింది. అంత గతుకుల బాటలోనూ జైట్లీ రాజకీయ పయనం స్థిరంగా సాగింది. 1991 నుంచి భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక వర్గ సభ్యుడిగా అవిరళ సేవలు అందించారు. నేను భాజపా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జైట్లీని, ఆయనతోపాటు సుష్మా స్వరాజ్‌ను పార్టీలో అత్యున్నత నిర్ణాయక సంఘమైన పార్లమెంటరీ బోర్డు సభ్యులుగా నియమించాను. వివిధ ప్రజా సమస్యలపై లోతైన అవగాహనతో పరిష్కారాలను ప్రతిపాదించిన



అరుణ్ జైట్లీ (1952-2019)

వాగ్ధాటి దార్శనికతల కలబోత

జైట్లీ, దీర్ఘకాలంగా పార్టీ తరఫున ఎన్నో తీర్మానాలను రూపొందించారు.

ఆర్థికం, కార్పొరేట్ వ్యవహారాలు, రక్షణ, వాణిజ్యం, పరిశ్రమలు, నౌకా రవాణా, సమాచార- ప్రసారాలు, ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ వంటి కీలక శాఖల మంత్రిగా తనదైన ముద్ర కనబరచారు. వస్తుసేవల పన్ను చట్టం, దివాలా చట్టం, అవినీతి, అక్రమ ధన చలామణీ నిరోధ చట్టాలకు సారథ్యం వహించి దేశ ఆర్థిక రూపాంతరానికి బాట వేశారు. 2014-19 మధ్యకాలంలో

అవినీతికి బద్ధ వ్యతిరేకి

ప్రజా జీవనంలోకి ప్రవేశించిననాటి నుంచి జైట్లీ అవినీతిని తీవ్రంగా వ్యతిరేకించేవారు. అవినీతి మన దేశ జవజీవాలను హరించేస్తున్న మహమ్మారి అని మండిపడేవారు. 1973లో జయప్రకాశ్ నారాయణ్ ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. తరవాత అన్నా హజారే జన్ లోక్‌పాల్ ఉద్యమాన్ని బలపరచారు. అవినీతికి బద్ధ విరోధి కాబట్టే జైట్లీ ఆర్థిక నేరాలకు, అవకతవకలకు వ్యతిరేకంగా పార్లమెంటులో కొన్ని చట్టాలు తీసుకొచ్చారు. అద్వితీయ పార్లమెంటేరియన్‌గా, మంచి వక్తగా ఆయన ఖ్యాతికెక్కారు. 2014-19 మధ్యకాలంలో జైట్లీ అన్ని సామాజిక ఆర్థిక రాజకీయ సమస్యలపై ప్రభుత్వ దృష్టికోణాన్ని, వైఖరిని, విధానాలను పార్లమెంటు లోపలా వెలుపల అందరి మన్ననలు పొందే విధంగా చాటిచెప్పారు. తన పార్టీ, ప్రభుత్వాల మౌలిక విధానాలు, దృక్పథాలకు భంగం కలగని రీతిలో శక్తిమంతమైన పరిష్కారాలను ప్రతిపాదించే చాతుర్యం ఆయన సొంతం. రాజ్యసభలో ఏదైనా ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు సభా నాయకుడిగా ఒడుపును కనబరచి అందరినీ కలుపుకొని వెళ్లడం నేను ప్రత్యక్షంగా వీక్షించాను.

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిగా మన రాజకీయార్థిక రథాన్ని లాఘవంగా నడిపించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్ఠంగా ఉండేట్లు చూసుకొంటూనే అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. 2009లో రాజ్యసభలో ప్రతిపక్ష నాయక పదవికి మా ఇద్దరి పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. అప్పుడు ఈ పదవిని మీరు తీసుకోవాలంటే మీరు తీసుకోవాలని పరస్పరం ఆత్మీయంగా వాదులాడుకున్నాం. చివరకు ఆ పదవిని చేపట్టడానికి జైట్లీ ఒప్పుకొన్నారు. ఆ హోదాలో మహిళా రిజర్వేషన్ల బిల్లు రాజ్యసభ ఆమోదం పొందడానికి కృషి చేశారు. రాజ్యసభ అధ్యక్షుడినైన నాకు, రాజ్యసభ నాయకుడి హోదాలో ఆయన అండదండలు ఇచ్చారు. గొప్ప రాజకీయ వ్యూహ దురంధరుడైన జైట్లీకి. ఎక్కడ గట్టిగా పట్టు పట్టాలో, ఎక్కడ సామరస్యంగా వ్యవహరించాలో బాగా తెలుసు.

జైట్లీ పక్కా ప్రజాస్వామ్యవాది. రాజ్యాంగ స్ఫూర్తిని తు.చ.తప్పకుండా అనుసరిస్తూ, రాజ్యాంగం ప్రసాదించిన పౌర హక్కులకు అండగా నిలిచేవారు. ఆయన పౌర హక్కుల ఉద్యమంలో క్రియాశీలంగా ఉండేవారని, పౌర హక్కుల సంఘం (పీయూసీఎల్) బులెటిన్ ప్రచురణకు తోడ్పడ్డారని తెలిసినవారు చాలా తక్కువ. 1977లో లోక్ తాంత్రిక్ యువ మోర్చా కన్వీనరు గానూ వ్యవహరించారు. ఎమర్జెన్సీని ప్రతిఘటించినందుకు నాతోపాటు ఆయన కూడా 19 నెలలపాటు జైల్లో ఉన్నారు. తిరుగులేని జాతీయవాది అయిన జైట్లీ భారతదేశానికి సమున్నత శిఖరాలను అందుకునే సత్తా ఉందని విశ్వసించేవారు. ఆ సత్తాను ఆచరణలోకి తీసుకురావాలని తపించేవారు.

విశిష్ట వ్యక్తిత్వం

ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లుపై రాజ్యసభలో చర్చ జరిగిన సమయంలో కొత్త రాష్ట్రానికి న్యాయం చేయడానికి జైట్లీ విశేష కృషి జరిపారు. తరవాత ఏర్పడిన ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆపై ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద సాయం అందించే విషయంలో అరుణ్ జైట్లీ నిర్వర్తించిన పాత్ర ప్రశంసనీయం. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి నాబార్డు ద్వారా నిధులు జతచేయడం, ప్రత్యేక ప్యాకేజీ రూపకల్పన, ఆంధ్రప్రదేశ్‌లో వివిధ సంస్థల స్థాపనలో ఆయన అందించిన సహాయాన్ని నేను మరువలేను. ఆ ప్రాంత ప్రజలూ ఆయన్ను ఎప్పుడూ గుర్తుంచుకుంటారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై ఆయనకున్న పరిజ్ఞానం, అవగాహనా విస్తృతిని వేరెవరిలోనూ చూడలేదు. సమస్య మూలాలు, వాటి సాంఘిక రాజకీయ ఆర్థిక పర్యవసానాలను లోతుగా అధ్యయనం చేసి పరిష్కారాలు కనుగొనడానికి అహరహం శ్రమించేవారు. జైట్లీ మేధాపటిమ, విశ్లేషణా సామర్థ్యం, సమస్య పూర్వాపరాలను కనిపెట్టి పరిష్కారాలు ప్రతిపాదించే శక్తి, ఆయన వాణికి అపార ప్రాధాన్యం సంతరించిపెట్టాయి. ఇక ఆ వాణి మనకు వినిపించదనే వాస్తవం ఎంతో విచారకరమైనా, ఆయన వారసత్వం మనకు గొప్ప దిక్సూచిగా నిలవబోతోందనే భావన ఎంతో ఊరట కలిగిస్తుంది. ఈ ఏడాది పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించినా, ఆరోగ్య కారణాల వల్ల ఏ పదవినీ స్వీకరించలేనని ఆయన స్పష్టం చేశారు. పదవికి న్యాయం చేయడానికి తన శరీరం సహకరించదు కాబట్టి అన్ని పదవులను తృణప్రాయంగా తోసిపుచ్చారు. ఆయన విశిష్ట వ్యక్తిత్వానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనమేముంటుంది? వ్యక్తిగతంగా మేమిద్దరం ఎంతో సన్నిహిత మిత్రులం, భోజన ప్రియులం. మేం పిన్న వయస్కులుగా ఉన్నప్పుడు అన్ని రకాల రెస్టారెంట్లకు వెళ్లి రకరకాల వంటకాలను ఆస్వాదించేవాళ్లం. అన్ని శుభ సందర్భాల్లో ఆయన్ను మా ఇంట విందుకు ఆహ్వానించేవాడిని. పండుగలు, పబ్బాలు, పలకరింపులు, విందులకు నేను తరచూ వెళ్లేది ఆయన ఇంటికే. భోజనం చేసేటప్పుడు వివిధ అంశాలపై అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకొనేవాళ్లం. మేము తరచూ కలుసుకునేది మృష్టాన్న భోజనాల కోసమే కాదు, మెదడుకు మేత కోసం కూడా.

ఈ ఆగస్టు నెల నాకు తీరని వేదన మిగిల్చింది. ఈ నెలలో కేవలం రోజుల తేడాతో జైపాల్ రెడ్డి, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీలను కోల్పోయాం. వీరంతా అద్వితీయ పార్లమెంటేరియన్లు, ప్రజలకు ఎనలేని సేవలు అందించిన ఉద్దండులు, విశేష ప్రతిభా సంపన్నులు. నాకెంతో ఆత్మీయుడైన అరుణ్ జైట్లీ అస్తమయం నన్ను కకావికలం చేసింది. ఇది నాకే కాదు, యావత్ దేశానికీ అపార నష్టదాయకం. ఆయన ఆత్మకు శాంతి కలుగు గాక!

కళాశాలల్లో రాక్షస క్రీడ!

పుణ్యభూమి

రాగింగ్- తోటి విద్యార్థుల్ని వేదించి హింసించి వికృతానందం పొందే రాక్షసక్రీడ. దాన్ని అణిచేసేందుకు ఎన్ని చట్టాలు, నిబంధనలు వండివార్చామంటున్నా ఇప్పటికీ అది ఎన్నో సరస్వతీ నిలయాల్ని వదలక పట్టి పీడిస్తున్న విపరీత చీడ! విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టామన్న వీరాలాపాలకు గాలితీసేస్తూ అది తరచూ నిక్షేపంగా ఉనికి చాటుకుంటూనే ఉంది. తమతోపాటు అదే ప్రాంగణంలో చదవడానికి వచ్చిన కొత్త విద్యార్థుల బెరుకు పోగొట్టడానికి, ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి వారిని సన్నద్ధం చేసే ముసుగులో విచ్చలవిడి ర్యాగింగ్ అమాయక విద్యార్థుల ఉసురు పోసుకుంటోంది. వారి తల్లిదండ్రుల ఆశల్ని కర్కశంగా చిదిమేస్తోంది. ఆ పరంపరలో రెండు తాజా బాగోతాలు- ఒకటి యూపీలో, మరొకటి ఒడిశాలో నమోదయ్యాయి.

ఉత్తర్ ప్రదేశ్‌లోని ఇటావాలో ఓ వైద్య విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ల నుంచి ఫర్మానాలు జారీ అయ్యాయి. అందరూ గుండు కొట్టించుకుని తెల్లదుస్తులు ధరించి వరసలో కళాశాలకు రావాలని, సీనియర్లకు వంగివంగి సలాములు కొట్టాలన్నది వాటి సారాంశం. అవి సీనియర్ల ఆదేశాలు కాబట్టి అక్షరం పొల్లుపోకుండా అమలయ్యాయి. ఉత్సాహపరులెవరో ఆ వైనాన్నంతా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టేసరికి గగ్గోలు పుట్టింది. విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తేసరికి ఉలిక్కిపడ్డ విశ్వవిద్యాలయ పెద్దలు అసలక్కడ ర్యాగింగుకు తావే లేదని, విద్యార్థులందరిపైనా తాము నిఘా వేసే ఉంచామని శాయశక్తులా దబాయించజూశారు. మాటలంటే పొల్లుపోతాయి, వీడియోను మూసిపెట్టలేరు కదా! గత్యంతరం లేని పరిస్థితుల్లో నియమించాల్సి వచ్చిన పన్నెండు మంది సభ్యుల కమిటీ నిప్పులాంటి నిజాల్ని కక్కింది. ఇదంతా మామూలేనని తేలిగ్గా కొట్టిపారేయబోయిన ఉపకులపతే- ఏడుగురు సీనియర్ విద్యార్థుల్ని నెల్లాళ్ల పాటు తరగతులకు, హాస్టల్‌కు హాజరు కాకుండా ఉత్తర్వులివ్వాల్సి వచ్చింది. ఆ ఏడుగురూ తలా పాతికవేల రూపాయలు, 2018 బ్యాచ్ విద్యార్థులందరూ అయిదు వేల రూపాయల చొప్పున జరిమానా కక్కాలి. గుట్టుచప్పుడు కాకుండా దాచబోయిన దారుణాన్ని రచ్చకీడ్చిన ఘనత కచ్చితంగా సామాజిక మాధ్యమాలు, పత్రికలదే.

యూపీ ఘటన వెలుగుచూసిన రెండురోజులకే ఒడిశాలోని వీర్‌సురేంద్ర సాయి సాంకేతిక విశ్వవిద్యాలయ బాగోతం రచ్చకెక్కింది. 'స్వాగత వేడుక' పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్లు రెచ్చిపోయి జూనియర్ల చెంపలు పేలగొట్టి, బట్టలు విప్పించి వారితో వేదికపై అర్ధనగ్న నృత్యాలు చేయించిన వీడియో ఆ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖామాత్యుల కంట్లో పడింది. ఆ దెబ్బతో 52 మందిని కళాశాల నుంచి సస్పెండ్ చేసి, తలా రెండు వేల రూపాయల జరిమానా వడ్డించారు. కొన్నాళ్ల కిందట ఆ కాలేజీ విద్యార్థులే 15మందిని ర్యాగింగుకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఏడాది కాలం బహిష్కరించారు. అయినా సీనియర్ల దూకుడు మందగించలేదంటే, లోపమెక్కడుంది? ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాల పుణ్యమా అని సమాచారం వెలుపలికి పొక్కి శిక్షల దాకా వచ్చిందిగాని- వెలికి రాని నేరాలు ఘోరాలు మరెన్ని ఉన్నాయో!

ఇరవై మూడేళ్ల క్రితం రాజా ముత్తయ్య వైద్య కళాశాల (చిదంబరం, తమిళనాడు)లో పాస్ నవరసు అనే కొత్త విద్యార్థి, మాట వినకపోయేసరికి జాన్ డేవిడ్ అనే సీనియర్ క్రోధావేశాలతో రగిలిపోయాడు. మద్రాస్ విశ్వవిద్యాలయ ఉపకులపతి పొన్నుస్వామి కుమారుడైతేనేం- జూనియర్‌గా తనకు విధేయత కనబరచాల్సిందేనని తలపోసిన అతగాడు నవరసును వేటాడి ముక్కలు ముక్కలుగా నరికి శరీరభాగాల్ని వేర్వేరు చోట్ల పారేశాడు. అప్పట్లో దేశమంతటా తీవ్ర సంచలనం సృష్టించిన ఆ కేసులో మృత్యుక్రీడకు తెగబడిన కిరాతకుడికి 36 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. హిమాచల్ ప్రదేశ్‌లో అమన్ కష్రూ, బెంగళూరులో అజ్మల్, కోల్‌కతాలో ఆకాశ్ అగర్వాల్, నొయిడాకు చెందిన దిల్లీ పబ్లిక్ స్కూలులో పదిహేనేళ్ల విద్యార్థి... ర్యాగింగ్ అమానుషత్వానికి కొన్ని ఉదాహరణలు. తొలుత తమిళనాడు, దరిమిలా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర వంటివి ర్యాగింగ్ నిరోధక చట్టాలు తెచ్చాక- 2001 సంవత్సరంలో సర్వోన్నత న్యాయస్థానం దేశవ్యాప్తంగా ర్యాగింగును నిషేధించింది. ఏడిపించడం, వేధించడం, క్రూరత్వం, శారీరకంగా మానసికంగా హింసించడం, భయవిహ్వలతకు లోనుచేయడం- ఈ పైశాచిక చేష్టలకు పర్యాయపదంగా ర్యాగింగ్ మారిపోయిందన్న సుప్రీంకోర్టు దశాబ్దం కిందట పలు మార్గదర్శకాలూ వెలువరించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ సంచాలకులుగా పనిచేసిన ఆర్‌కే రాఘవన్ సారథ్యంలోని కమిటీ ర్యాగింగును మానవ హక్కుల ఉల్లంఘనగా తప్పుపట్టి, అటువంటి అమానుష దుర్మార్గాలు పెచ్చరిల్లకుండా ఆరంచెల్లో అమలుపరచదగ్గ యాభై సిఫార్సుల్ని క్రోడీకరించింది. జరగరానిది ఏదైనా జరిగినప్పుడు కమిటీల ఏర్పాటు ఎంత ఆనవాయితీయో, రాబట్టిన సూచనలూ సిఫార్సుల నివేదికల్ని పేరబెట్టడమూ అంతే రివాజుగా మారిన దేశంలో- అమలు గురించి అడక్కూడదు. తన వంతుగా విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూజీసీ) 2017 నవంబరులో ర్యాగింగ్ నియంత్రణకంటూ నూతన ప్రమాణాలు విడుదల చేసింది. విద్యాసంస్థల ప్రాంగణాల్లో సీసీటీవీలు అమర్చాలని, నిఘా యంత్రాంగం నెలకొల్పాలని, ర్యాగింగ్ బాధితులకు బాధ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని... ఇవన్నీ అంతటా అక్షరాలా కార్యాచరణకు నోచుకుంటే- గోడుగోడున విలపించే, తమలోతాము కుమిలిపోయే బాధితుల సంఖ్య ఎందుకు పెరుగుతుంది?

ర్యాగింగుకు పాల్పడ్డవారికి పాస్‌పోర్టు జారీ కాదు. ఉపకార వేతనం నిలిచిపోతుంది. ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. అయినప్పటికీ- నిబంధనల ప్రకారం శిక్షార్హులపై సకాలంలో సరైన చర్యలు కొరవడటం ఎప్పటికప్పుడు సీనియర్లకు కోరలు తొడుగుతున్నట్లు పదే పదే రుజువవుతోంది. 2013లో దేశం నలుమూలల నుంచీ 640 ర్యాగింగ్ కేసులు బయటపడ్డాయి. వాటి సంఖ్య 2017లో 901కి, మరుసటి ఏడాది 1015కి విస్తరించింది. గత తొమ్మిదేళ్లలోనే యూపీ, పశ్చిమ్ బంగలలో ర్యాగింగ్ కేసులు దాదాపు మూడింతలకు, మధ్యప్రదేశ్‌లో రెండింతలకు పైగా ఎగబాకాయి. పదేళ్లుగా దేశంలో నమోదైనవి 5,777. తెలుగు నేలపైనా ర్యాగింగ్ రాక్షసానిది పెద్ద రికార్డే. జస్బీర్ సింగ్, సొరాబ్ సుమన్, రాధికారెడ్డి, పద్మజ తదితరుల ఆత్మహత్యలకు కారణభూతమైంది ర్యాగింగే. పంజాబులో ఇంజినీరింగ్ చదవడానికి వెళ్ళిన సిక్కోలు విద్యార్థి మనీష్‌కుమార్ జీవితం నాలుగు నెలల క్రితం అర్ధాంతరంగా ముగిసిపోయింది. ర్యాగింగ్ ఆరోపణలపై మొన్న మార్చిలో అయిదుగురు వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ (నిట్) విద్యార్థులు, ఏడాది క్రితం అయిదుగురు తాడేపల్లి గూడెం నిట్ విద్యార్థులు సస్పెండయ్యారు. హైదరాబాద్ లాంటిచోట్ల పాఠశాలల్లోనూ ర్యాగింగ్ భూతం చొరబాటు చీకటి భవితను కళ్లకు కడుతోంది.

కళాశాలల్లో మత్తుపానీయాల ఉరవడే ర్యాగింగ్, హింసలను ప్రేరేపిస్తున్నదని లోగడ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అప్పటితో పోలిస్తే మాదక ద్రవ్యాల సరఫరా సైతం జోరెత్తి పాఠశాలలూ మత్తుబారిన పడుతుండటం తెలిసిందే. విద్యార్థులు గాడి తప్పితే సంబంధిత సంస్థలనే బోనులో నిలబెట్టాలి. క్రమశిక్షణ నెలకొల్పడంలోన

ఆర్టికల్ 370 రద్దుతో పటేల్ కల సాకారం

- ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఈనాడు - హైదరాబాద్

జమ్మూ-కశ్మీర్ దేశంలో అంతర్భాగమైనప్పటికీ ఆర్టికల్ 370 రూపంలో వెలితి ఉండేదని, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సంకల్ప చర్యతో సమైక్య భారత్ సంపూర్ణమైందని హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. స్వాతంత్ర్యం తరువాత వందలాది సంస్థానాల్ని ఉక్కుమనిషి సర్దార్ పటేల్ విలీనం చేశారని, ఆర్టికల్ 370 రద్దుతో ఆయన కల నెరవేరిందని పేర్కొన్నారు. దేశభద్రత, రక్షణ పోలీసుల చేతుల్లో ఉందని, రాజ్యాంగ పీఠికకు లోబడి రాజ్యాంగాన్ని కాపాడాలని, అసాంఘిక శక్తుల నుంచి దేశాన్ని రక్షించాలని సూచించారు. ఐపీఎస్‌లుగా ఎంపిక కావడంతో జీవిత లక్ష్యం నెరవేరినట్టు కాదని, అవినీతి రహితంగా తీర్చిదిద్ది, బాహ్య అంతర్గత శక్తులను ఎదుర్కొని భద్రత కల్పించాల్సిన లక్ష్యం ఇప్పుడే మొదలైందన్నారు. దేశరక్షణతో అభివృద్ధి జరుగుతుందని, ఆర్థికవ్యవస్థను ఐదు ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లడం సాధ్యమవుతుందని తెలిపారు. శనివారమిక్కడ సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ పోలీసు అకాడమీలో 70వ బ్యాచ్ ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్‌లో (దీక్షాంత్‌పరేడ్) పాల్గొన్నారు. అకాడమీ డైరెక్టర్ అభయ్, పరేడ్ కమాండర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో ట్రైనీ ఐపీఎస్ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ బ్యాచ్‌లో 103 మంది ఉండగా వారిలో 92 మంది ఐపీఎస్‌లు. అందులో 12 మంది మహిళా అధికారులు. నేపాల్ పోలీసు సర్వీసు నుంచి ఐదుగురు, రాయల్ భూటాన్ పోలీసు సర్వీసు నుంచి ఆరుగురు శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 15 మంది మహిళా అధికారులు ఉన్నందున హోం మంత్రి అమిత్ షా సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.

"కష్టపడి పనిచేస్తే గుర్తింపుతో పాటు ఆత్మసంతృప్తి లభిస్తుంది. తీవ్రవాదం, నార్కొటిక్, సైబర్‌క్రైమ్, పొరుగుదేశాల నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు మోదీ సూచించిన స్మార్ట్ పోలీసు లక్ష్యంతో పనిచేయాలి. పోలీసు బలగాలకు నేతృత్వం వహించేప్పుడు దేశరక్షణ కోసం ప్రాణాలను బలిదానం చేసిన 33 వేల మంది పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తు తెచ్చుకుని, వారు చూపిన మార్గంలో వెళ్లాలి." అని అమిత్‌షా సూచించారు.. ఈ కార్యక్రమంలో అకాడమీ అదనపు డైరెక్టర్ ఉమేష్ షరాఫ్, తెలంగాణ గవర్నర్ నరసింహన్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, అకాడమీ పూర్వ అధికారులు, 71వ బ్యాచ్ ప్రొబేషనరీ ట్రైనీ ఐపీఎస్‌లు పాల్గొన్నారు. పరేడ్ కమాండర్‌గా వ్యహరించిన ప్రొబేషనరీ ఐపీఎస్ గౌష్ ఆలం (తెలంగాణ కేడర్) ఆరు రంగాల్లో ప్రతిభచూపి అవార్డులు పొందారు. మహిళా విభాగంలో రిచా తోమర్ (రాజస్థాన్) టాపర్‌గా నిలిచారు.

శిక్షణలో ప్రతిభకనబరచిన ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారి గౌష్ ఆలంకు అవార్డును ప్రదానం చేస్తున్న హోంమంత్రి అమిత్‌షా ★ పాసింగ్ అవుట్ పరేడ్‌ను తిలకిస్తున్న రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ నరసింహన్

> ఒక చారిత్రక పోలీసు చర్య తరువాత హైదరాబాద్ భారత్‌లో విలీనమైంది. స్వాతంత్ర్యం తరువాత పటేల్ ఆధ్వర్యంలో వందలాది సంస్థానాలు విలీనమయ్యాయి. ఇక్కడి నిజాం భారత దేశంలో కలిసేందుకు ఒప్పుకోలేదు. వల్లభ్‌భాయ్‌పటేల్ నేతృత్వంలో జరిగిన పోలీసు చర్యతో తెలంగాణ, హైదరాబాద్, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రలలోని కొన్ని ప్రాంతాలు దేశంలో విలీనమయ్యాయి. ఈ ఘనత అంతా పోలీసు చర్యకు వెళ్తుంది
> - అమిత్‌షా

అమ్మ భాషకు.. అక్షర తిలకం

- తెలుగు వికీపీడియా బలోపేతానికి ఐఐఐటీ శ్రీకారం
- ఆరేళ్లలో 30 లక్షల వ్యాసాలు అందుబాటులోకి తెచ్చే క్రతువు
- కేంద్ర సమాచార శాఖ, తెలంగాణ ప్రభుత్వం సహకారం

తెలుగు భాషలోని మాధుర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషనల్ టెక్నాలజీ(ఐఐఐటీ)-హైదరాబాద్ శ్రీకారం చుట్టింది. అరకొరగా ఉన్న తెలుగు వికీపీడియాను బలోపేతం చేసే మహాక్రతువును చేపట్టింది. దీనికి కేంద్ర సమాచార సాంకేతికశాఖ ఆమోదం లభించగా.. తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. మాతృభాషలో వ్యాసాల సంఖ్యను రానున్న ఆరేళ్లలో 30 లక్షలకు పెంచాలన్న భారీ సంకల్పంతో ఐఐఐటీ పనిచేస్తోంది. ఈ ప్రాజెక్టులో తెలుగు అధ్యాపకులు, పరిశోధకులు, సాహితీవేత్తలు, రచయితలు, విద్యార్థులు, ఎన్జీవోలు.. ఇలా మాతృభాషపై పట్టున్న ప్రతి వర్గాన్నీ ప్రాజెక్టులో భాగస్వాముల్ని చేసి సమగ్రమైన తెలుగు వికీపీడియాను అందుబాటులోకి తేనుంది. ప్రఖ్యాత ఆచార్యులు రాజిరెడ్డి ఆశయాల మేరకు ఈ ప్రాజెక్టు చేపట్టగా ముఖ్య పరిశోధకులుగా ఆచార్య వాసుదేవవర్మ వ్యవహరిస్తున్నారు.

వికీపీడియా
స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వము

2001లో ఆంగ్ల వికీపీడియా ప్రారంభమైంది. 2003 డిసెంబరు 10 నుంచి తెలుగు వికీపీడియా అందుబాటులోకి వచ్చింది. ఆంగ్లంలో సుమారు 70 లక్షలకు పైగా వ్యాసాలు అందుబాటులో ఉన్నాయి. నిత్యం ఏదో ఒక వ్యాసాన్ని రచయితలు అప్‌లోడ్ చేయడం, ఇప్పటికే ఉన్న అంశాలను అప్‌డేట్ చేయడం చేస్తుంటారు. తెలుగు వికీపీడియాలో మాత్రం సమాచారం ఆశించిన స్థాయిలో లేదు. ఇప్పటివరకు 71,100 వ్యాసాలే అందుబాటులో ఉన్నాయి. వికీపీడియాలో వ్యక్తం చేసే సందేహాల్లో దేశంలో తెలుగు వీక్షకులవే ఎక్కువగా ఉంటున్నాయి. ఇప్పటికే ఆంగ్లంలో ఉన్న వ్యాసాలను తెలుగులోకి తర్జుమా చేస్తే చదువుకోవడానికి వీలుంటుంది. సరికొత్త ఆవిష్కరణలు, పరిశోధనలకు సమాచారం అందుబాటులోకి వచ్చినట్లవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తెలుగు వికీపీడియాను బలోపేతం చేస్తున్నారు.

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఐఐఐటీ

ఏం చేస్తారు..?

- ఈ క్రతువులో భాగంగా రెండు విధాలుగా ముందుకెళ్లనున్నారు. మొదటిది.. ఇప్పటికే ఆంగ్లంలో ఉన్న వ్యాసాలను తెలుగులోకి అనువదిస్తారు. ఇందుకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ టూల్స్‌ను ఐఐఐటీ అభివృద్ధి చేస్తోంది. ఆంగ్లంలో ఉన్న అంశాలు తెలుగీకరించేందుకు ఇవి ఉపకరిస్తాయి. అలా అనువాదం చేశాక మూడు దశల్లో ప్రూఫ్ రీడింగ్ చేసి తప్పులను సరిచేస్తారు. అనంతరం ఆ అంశాన్ని వికీపీడియాలో అప్‌లోడ్ చేస్తారు. ఆన్‌లైన్‌లో అనువాదం చేయనుండటంతో యంత్రం కూడా ఎప్పటికప్పుడు కొత్త పదాలు తెలుసుకుని తప్పులు సరిదిద్దుకుంటుంది.
- రెండో విధానంలో సమాజంలోని అందరినీ భాగస్వాముల్ని చేసుకుని వివిధ అంశాలపై తెలుగులో వ్యాసాలు రాయించి అప్‌లోడ్ చేసేలా ప్రోత్సహిస్తారు. ఔత్సాహికులు తమకు అందుబాటులో ఉన్న తెలుగు టైపింగ్ టూల్స్‌ను వినియోగించి వ్యాసాలు రాసి ఐఐఐటీ అందించే ఫాంట్ కన్వర్టర్ సాయంతో యూనికోడ్ కిందకు మార్చి అప్‌లోడ్ చేయవచ్చు. సులువుగా తెలుగు టైపింగ్ చేసే టూల్స్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తారు.

తెలుగు తర్వాత అన్ని భాషల్లోనూ..

ప్రపంచంలోని ఎన్నో అంశాలను తెలుగు ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో తెలుగు వికీపీడియా బలోపేతానికి శ్రీకారం చుట్టాం. ఆచార్య రాజిరెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. దీనిద్వారా మాతృభాషలోనే ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఇది నిరంతర క్రతువుగా ఏళ్ల తరబడి కొనసాగుతుంది. మా పరిశోధన ఒక్క తెలుగుకే పరిమితం కాదు. దేశంలోని 12-13 భాషాల్లో వికీపీడియాను బలోపేతం చేయాలనేది లక్ష్యం. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోంది.

-ఆచార్య వాసుదేవవర్మ, ప్రాజెక్టు ముఖ్య పరిశోధకులు, ఐఐఐటీ

ఈనాడు - హైదరాబాద్

కొత్తగా 101 ఎంపీడీవో పోస్టులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 101 మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటితోపాటు ఖాళీల భర్తీకి ఆదేశాలిచ్చింది. దీంతోపాటు ఇప్పటికే 208 ఎంపీడీవో స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని కూడా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో 146 ఖాళీలను పదోన్నతుల ద్వారా, 62 ఖాళీలను ప్రత్యక్ష నియామకాల (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ద్వారా భర్తీచేయనున్నారు. ప్రత్యక్ష నియామకాలు నిర్వహించేంత వరకు అడహాక్ పద్ధతిలో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి భర్తీ చేయనున్నారు. మొత్తం 208 ఖాళీల్లో 98 స్థానాలను మండల పంచాయతీ అధికారులు (ఈవో, పీఆర్ఆర్‌డీ), 101 పోస్టులను జిల్లా పరిషత్ సూపరింటెండెంట్, 9 ఖాళీలను సహాయ సెక్షన్ అధికారుల (సచివాలయం) కోటాలో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ అంతర్గత ఉత్తర్వులు జారీచేశారు.

పంచాయతీ కార్యదర్శి పదోన్నతులకు జాబితాలు..

పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించేందుకు అవసరమైన జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్-బిల్ కలెక్టర్లకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు పంపించాలని ఆ శాఖ.. జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించింది. 2016 ఏప్రిల్ 29, మార్చి 30వ తేదీల వరకు సీనియారిటీకి సంబంధించిన జాబితాలను పంపాలని ఆదేశాల్లో పేర్కొంది.

శ్రీవారికి ఆర్ఎస్ బ్రదర్స్ రూ.2 కోట్ల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థలు ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యజమానులు రూ.2 కోట్ల విరాళాన్ని సమర్పించారు. ఆ సంస్థల యజమానులు పి.వెంకటేశ్వర్లు, టి.ప్రసాదరావు, ఎస్.రాజమౌళి కుటుంబసభ్యులతో కలిసి శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మందిరంలోని రంగనాయకుల మండపంలో తితిదే ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి, ప్రత్యేకాధికారి ఏవీ ధర్మారెడ్డిని కలిశారు. విరాళానికి సంబంధించిన డీడీలను అందజేశారు. రూ.2 కోట్ల విరాళంలో బాలాజీ ఆరోగ్య వరప్రదాయినికి రూ.కోటి, శ్రీవాణి ట్రస్టుకు రూ.కోటి వంతున డిపాజిట్ చేయాలని తితిదేను కోరారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలోనే వీసీ దరఖాస్తుల 'పరిశీలన'

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 9 విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పోస్టులకు అందిన దరఖాస్తులను ఉన్నత విద్యాశాఖ పరిశీలన (స్క్రూటినీ) చేస్తోంది. గతంలో ఈ ప్రక్రియను ఉన్నత విద్యామండలి నిర్వహించింది. 2016 జూన్‌లోనూ వీసీ పోస్టులకు అందిన దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి పరిశీలన చేసింది. అనంతరం జాబితాను ఉన్నత విద్యాశాఖకు పంపింది. ఆ శాఖ పరిశీలన తర్వాత అన్వేషణ కమిటీకి పంపారు. ఈసారి దరఖాస్తుల స్వీకరణ గడువు జులై 23తో ముగిసింది. 840 దరఖాస్తులు అందాయి. దాదాపు నెల గడుస్తున్నా దరఖాస్తులు ఉన్నత విద్యామండలికి పంపలేదు. దీనిపై ఆశావహులు ఆరా తీయగా.. ఉన్నత విద్యాశాఖ అధికారులే పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఆర్.లింబాద్రి, వి.వెంకటరమణలు కూడా ఉపకులపతి పదవికి దరఖాస్తు చేశారు. ఈక్రమంలో దరఖాస్తులను స్క్రూటినీ కోసం ఉన్నత విద్యామండలికి పంపిస్తే విమర్శలు రావొచ్చన్న అభిప్రాయంతో పంపలేదని సమాచారం. ఇప్పటివరకు అన్వేషణ కమిటీలను నియమించక పోవడంతో ఉపకులపతుల నియామకం మరింత ఆలస్యం కావొచ్చని ఆచార్యులు అంచనా వేస్తున్నారు.



ఆకాశహర్మ్యం 66 అంతస్తులు

- హైదరాబాద్ శివారులోని కోకాపేట్‌లో భారీ టవర్

ఈనాడు, హైదరాబాద్: ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో పది అంతస్తుల భవనం కనిపిస్తేనే ఔరా అంటూ ఆశ్చర్యపోయేవారు.. ఆ తర్వాత కాలం మారింది. . 20.. 30..40 అంతస్తుల భవనాలు వెలిశాయి. ఇప్పుడు నగర శివారులోని కోకాపేట్‌లో 4.6 ఎకరాల్లో 239 మీటర్ల ఎత్తులో 66 బహుళ అంతస్తుల భవన నిర్మాణం అనుమతి కోసం ఓ ప్రైవేట్ నిర్మాణరంగ సంస్థ తాజాగా హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)కు దరఖాస్తు చేసుకుంది. చైనాకు చెందిన ఓ ప్రముఖ నిర్మాణరంగ సంస్థ భాగస్వామ్యంతో కోకాపేట్‌లో రూ.1800 కోట్ల నుంచి రూ.2వేల కోట్లతో 66 అంతస్తుల్లో 58 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన భారీ టవర్‌ను నిర్మించేందుకు ఓ ప్రైవేట్ సంస్థ ప్రణాళికలు రూపొందించింది. సదరు సంస్థ అనుమతి కోసం పెట్టుకున్న దరఖాస్తును హెచ్ఎండీఏ అధికారులు పరిశీలిస్తున్నారు. గతంతో పోలిస్తే పూర్తిగా వ్యాపార అవసరాల కోసమే బహుళ అంతస్తులను నిర్మించేందుకు నిర్మాణ సంస్థలు మొగ్గు చూపుతున్నాయి. ఒకేచోట షాపింగ్ మాల్స్, హోటల్స్, కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా నిర్మిస్తున్నాయి. జీ+4 వరకు షాపింగ్ మాల్స్, ఫుడ్ కోర్టులు, ఆ తర్వాత 30 అంతస్తుల్లో కార్యాలయాలు, ఇంకో 10 అంతస్తుల్లో విలాసవంతమైన కార్యాలయాలు, ఆపైన సర్వీస్ అపార్ట్‌మెంట్లు, స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌస్, ఆపైన 10 అంతస్తుల్లో స్టార్ హోటల్ తదితరాలను నిర్మించనున్నట్లుగా సదరు సంస్థ హెచ్ఎండీఏకు అందజేసిన దరఖాస్తులో పేర్కొంది. 63వ అంతస్తులో నగర అందాలను వీక్షించేలా ప్రత్యేకంగా స్కైలాంజ్‌ను ఏర్పాటు చేయనున్నట్లుగా వివరించింది.

డిసెంబరు 17న లక్ష మందితో చలో దిల్లీ

- తెలుగు రాష్ట్రాల్లో సమాయత్త సదస్సులు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వెల్లడి

భద్రాచలం, న్యూస్‌టుడే: కేంద్రం మెడలువంచైనా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సాధించుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ వెల్లడించారు. భద్రాచలంలో 22, 23 తేదీల్లో జాతీయ కార్యవర్గ సమావేశాలను నిర్వహించి పలు కీలక తీర్మానాలు చేశారు. వీటిని శనివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలన్న ప్రధాన డిమాండ్‌తో డిసెంబరు 17న లక్ష మంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో చలో దిల్లీ చేపట్టనున్నట్లు ప్రకటించారు. దీన్ని విజయవంతం చేసేందుకు వచ్చే నెల 1 నుంచి 17 వరకు వరంగల్‌లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 31 వరకు, ఆంధ్రప్రదేశ్‌లోని 150 చోట్ల నవంబరు 1 నుంచి డిసెంబరు 14 వరకు సమాయత్త సమావేశాలు ఉంటాయని చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అఖిలపక్షాలతో దిల్లీకి వచ్చి కేంద్రంతో మాట్లాడితే సులువుగా వర్గీకరణ చట్టం వస్తుందని విశ్లేషించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాగాటి సత్యం, తెలంగాణ అధ్యక్షుడు రమేశ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, మహారాష్ట్ర అధ్యక్షుడు అజిత్ కసలైకర్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా కోడెల ఆరోగ్యం

ఈనాడు, గుంటూరు: ఏపీ మాజీ శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు ఆరోగ్యం నిలకడగా ఉంది. శనివారం కూడా ఐసీయూలోనే ఉంచి ఆయనకు వైద్యులు సేవలందించారు. శుక్రవారం రాత్రి ఆయనకు ఛాతి నొప్పి రావటంతో గుంటూరులో ఉన్న ఆయన అల్లుడు మనోహర్‌కు చెందిన ఆసుపత్రిలో చేర్చిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్రమేపీ మెరుగవుతోందని, ప్రస్తుతం వైద్య సేవలకు స్పందిస్తూ స్పృహలోకి వచ్చారని వైద్య వర్గాలు తెలిపాయి. తెదేపా అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రాష్ట్ర మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారితో పాటు జిల్లాకు చెందిన పలువురు నాయకులు ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. అనంతరం నేతలు ఆనందబాబు, జీవీ ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ.. కోడెల కుటుంబంపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆరోపించారు.

ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టుల మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబుజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భద్రతా దళ సభ్యులకు, మావోయిస్టులకు మధ్య శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. భద్రతా దళ సభ్యులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఉదయం 6 గంటల సమయంలో అబుజ్‌మడ్ (దుర్వేదా) అటవీ ప్రాంతం వైపు గాలింపు కొనసాగిస్తుండగా దుర్వేడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల శిక్షణ శిబిరాన్ని గుర్తించారు. ఈ క్రమంలో, భద్రతా దళాలకు, శిబిరంలోని మావోయిస్టులకు గంటన్నర ఎదురు కాల్పులు జరిగాయి. ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా, మరికొందరు అడవిలోకి పారిపోయారని డీజీపీ డీఎం అవస్థి చెప్పారు.

EDUCATION
★ Ag.BSc Seats Avlble in ICAR Colleges @ MAHARASTRA ✆ 7993680148/9100948360
★ ADMISSIONS Part Time MBA, B.Ed, M.Sc, Chemistry & Nutrition Ph.D. College ✆ 8186047777.

ADMISSION OPEN
BHMS
LOW PACKAGE
Mob: 7625041814
Aadhar Education Society

ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌గా బీఎస్ మూర్తి

ఈనాడు, సంగారెడ్డి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ నూతన డైరెక్టర్‌గా బూదరాజు శ్రీనివాస మూర్తి నియమితులయ్యారు. వారం రోజుల్లో బీఎస్ మూర్తి కొత్త బాధ్యతలు చేపట్టనున్నారని ఐఐటీ హైదరాబాద్ తాత్కాలిక డైరెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 1964 ఫిబ్రవరి 13న విజయవాడలో జన్మించిన ఆయన 1983లో అక్కడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెటలర్జీ విభాగంలో డిప్లొమా పూర్తిచేశారు. నాగ్‌పూర్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కళాశాల నుంచి బీఈ పట్టా అందుకున్నారు. ఆ తర్వాత ఐఐఎస్‌సీ బెంగళూరు నుంచి పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేశారు. 1995లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విజిటింగ్ లెక్చరర్‌గా ప్రస్థానం ప్రారంభించి 2004 వరకు అక్కడే వివిధ హోదాల్లో పనిచేశారు. 2004 నుంచి ఐఐటీ మద్రాసులో సేవలందిస్తున్నారు. నానో సాంకేతికతపై బీఎస్ మూర్తి విస్తృతంగా పరిశోధనలు సాగిస్తున్నారు. ఆయన చేస్తున్న కృషికి ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 31 అవార్డులు వచ్చాయి. నానో సాంకేతికత, మిశ్రమ లోహాల అభివృద్ధికి సంబంధించి సుమారు 20 పేటెంట్లు సాధించారు.

ప్రధాని ప్రశంసలు.. వారు విమర్శలు

- రాష్ట్ర భాజపా నేతలపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసిస్తుంటే.. ఇక్కడి భాజపా నేతలు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. భాజపా రాష్ట్రాధ్యక్షుడు లక్ష్మణ్ రోజూ సీఎం కేసీఆర్‌ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను దూషిస్తూ.. బలం పెరుగుతోందనే భ్రమలో ఉన్నారన్నారు. శనివారం తెలంగాణ శాసనసభా పక్ష కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. "మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలను ప్రధాని మెచ్చుకున్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలోనూ చెప్పారు. కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. నీటివనరుల పునరుద్ధరణలో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్ తాజా నివేదికలో పేర్కొంది. లక్ష్మణ్, తెలంగాణ భాజపా నేతలు మాత్రం అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం దారుణం. విద్యుత్ కొనుగోళ్లపై సీబీఐ విచారణకు సిద్ధమని అధికారులే తేల్చి చెబుతుంటే.. భాజపా నేతలు మాత్రం అధికారులను బెదిరించే రీతిలో మాట్లాడుతున్నారు. సభ్యత్వ నమోదులో మిస్డ్ కాల్స్ పేరిట భాజపా నాటకాలు వేస్తోంది. తెరాస మిస్డ్ కాల్స్ పంథాలో వెళితే మూడున్నర కోట్ల మంది నమోదవుతారు. మత రాజకీయాలు ఉత్తర భారతదేశంలో నడుస్తాయేమో కానీ.. దక్షిణ భారతంలో కాదు. ఇక్కడ కేసీఆర్ సెంటిమెంట్ మాత్రమే నడుస్తోంది." అని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

అభ్యుదయ రచయిత్రి జగద్ధాత్రి ఆత్మహత్య

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, అభ్యుదయవాది పి.జగద్ధాత్రి (56) విశాఖలో శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. వెంకోజిపాలెంలో తాను నివాసం ఉంటున్న నిఖిల్ ప్యారడైజ్ అపార్టుమెంటులో ఉరి వేసుకున్నారు. కొంతకాలంగా ఆమె ఏకాంత జీవనం గడుపుతున్నారు. భర్తతో తొమ్మిదేళ్ల నుంచి దూరంగా ఉంటున్నారు. తన చావుకు ఎవరూ కారణం కాదని, ఒంటరి జీవితంతో విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు రాసి ఉన్న లేఖను పోలీసులు గుర్తించారు. 'సహచరణం' కథల సంపుటి ఆమెకు మంచి పేరు తెచ్చింది. గత ప్రభుత్వం ఆమెను సాహిత్య అకాడమీ సభ్యురాలుగా నియమించింది.

UNIVERSITY OF HYDERABAD
(A Central University established by an Act of Parliament)
Prof. C.R. Rao Road, Gachibowli, P.O. Central University, Hyderabad-500 046
ADMISSION ANNOUNCEMENT for MBA (General) PROGRAMME FOR THE ACADEMIC YEAR 2020-21
University of Hyderabad invites bright, aspiring students committed to excellence to apply for admission to MBA (General) PROGRAMME through CAT-2019.
Candidates are required to apply online through University website: http://acad.uohyd.ac.in.
IMPORTANT DATES
Online Application start date 21-08-2019
Last date for submitting the Online Application 15-12-2019
Important Information: The candidates who are applying for MBA programme should have appeared in the CAT-2019. The admissions will be based on the CAT Score of the CAT-2019.
For further details including eligibility criteria, prescribed fee, reservation policy and the MBA Prospectus 2019-20, please refer to the website http://acad.uohyd.ac.in or http://www.uohyd.ac.in
23-08-2019 Sd/- DEVESH NIGAM, Controller of Examinations

ఈనాడు పెళ్లిపందిరి.నెట్
శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు
పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారా.....
www.eenadupellipandiri.net లో ఉచితంగా రిజిస్టర్ చేసుకోండి.
గమనిక : రిజిస్ట్రేషన్ కోసం ID Proof తప్పనిసరి.
040-49051234, 8008928686, 8008938686

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

వివాహ శుభ సమయంలో కొత్త జంట మెచ్చే
పెళ్లి కానుక ఈనాడు లో ప్రకటన
వివరాలకు మీ సమీపంలోని 'ఈనాడు' కార్యాలయాన్ని సంప్రదించండి

TG

వధువు కావలెను

Kapu, 28, 6', ME (BITS), MNC, 20L PA ★ 29, 5'11", MBBS, DM (Neuro) 5 Cr ★ 27, 5'8", BE (IIT), ME (IIT) MNC 20L PA ★ 28, 6', BE, MS, Ph.D, 180K, 20 Cr ✆ 9989019945 (A)

క్షత్రియ సూర్యవంశరాజులు, 37 సం॥లు, 6'.2", Advocate, వెల్ సెటిల్డ్‌గల అందమైన వరుడికి వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర॥ ✆ 98480 59159, 98487 35139. (G)

కమ్మ, 29, 5'11", B.Tech, Sr. SWE, MNC 45 Lakhs PA వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9618483383. (A)

కాపు 27, 5'9", B.Tech, MBA, IIT, Sr. SWE, IBM 15 Lakhs PA వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9866158793. (A)

Kamma: 27, 5'11", BE (IIT), MS $ 200K, Apple 15 Cr ★ 25, 5'8", BE (IIT) 40 Lakhs PA 10Cr. (VIP) Ph: 8143538383. (A)

Reddy/ MBBS/ MS/ DM/ Indias No 1 Rank Boy/ Very Smart/ 30/ 5'9"/ 30Cr Property ★ Cont K.C.Reddy Mar Bureau- Hyd - Ph 9849321309 (A)

Reddy/ B.Th/ Job Hyd/ 18L/ Yr/ 34/5'11"/ 13L/ Yr (Rents) 30Cr (Prop) His Share Cont K.C Reddy - Mar- Bureau - Hyd. Ph: 9849321309/ 9347807015 (A)

Reddy/ B.Th/ MS/ H1/ USA/ V.S Mart/ 26/6' 120K/ 30Cr ★ 28/5'11"/ 127K/ 50Cr - Property/ Cont K.C Reddy - Mar- Bureau- Hyd - Ph: 9849321309/ 9347807015 (A)

క్రిస్టియన్ మాల/ 27, 5'9" B.Tech (IIT), MBA (IIM), SWE, అందమైన వరునికి తగిన వధువు కావలెను. ✆ 8919759359 (A).

SC హిందూమాల, 29, 5'7" M.Tech, (NIIT), Govt ఇంజినీర్ (AP జెన్‌కో) అందమైన వరునికి తగిన వధువు కావలెను. ✆ 9390380026 (A).

విశ్వబ్రాహ్మణ, B.Tech, Govt A.E (AP జెన్‌కో) 72,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి వధువు కావలెను. ✆ 8886512010 (A).

కమ్మ M.Tech, C.Govt సైంటిస్ట్ (DRDL), 70,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A).

గౌడ B.Tech, Govt A.E (ఇరిగేషన్ Dept), 72,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A).

మాదిగ, M.Tech, C.Govt A.E (NTPC), 80,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8886512010 (A).

పద్మశాలి/ B.Tech/ Govt. AE (R&B)/ 65000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

మాల/ B.Tech (IIT) Govt. A.E.E. (R&B)/ 14 Lakhs P.A/ 5'8" ఎత్తు/ 27 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9542179041 (A)

యాదవ/ B.Tech (IT)/ C.Govt. Jr. ఇంజనీర్ (BEL)/ 60,000/- PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9515755529 (A)

కుమ్మరి/ M.Tech/ Govt. A.E.E. (R&B)/ 10 Lakhs. P.A/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9908209244 (A)

పద్మశాలి/ B.Tech, MBA/ C.Govt. డిప్యూటి మేనేజర్ (రైల్వే)/ 16 Lakhs P.A/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9985395014 (A)

SC మాదిగ/ M.Tech (EEE)/ Govt. బ్యాంక్ మేనేజర్ (SBI)/ 75000/- PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8008653628 (A)

పద్మశాలి 34/ 5'5" / M.Sc., ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేయు వరునకు తగిన వధువు కావలెను. Direct Contact: 99496 33147 & 9100148806 (వాట్సాప్). (E)

రెడ్డి, 29, 5'10", B.Tech, IIT, SWE, విప్రో, Hyd, నెలకు 1 లక్ష జీతం గల వరుడికి సాంప్రదాయమైన వధువు కావలెను. (అర్జెంట్) ✆ 8978799956 (A)

రెడ్డి 1992/ 6' B.Tech/ MS/ US/ 90K/ 7Cr. ★ 1987/ 6' MBA/ US/ 120K/ Green Card/ 10Cr. నవీన్‌రెడ్డి, M.B. 9505551788/ 9848221166 (A)

రెడ్డి 1988/ 5'11" MBBS/ MD (Emergency Medicine)/ 18L. P.A/ 12Cr. ★ 1995/ 6' B.Tech/ MBA/ బిజినెస్/ V.Rich 8885559579/ 9848221166 (A)

రెడ్డి 1990/ 5'9" B.Tech/ MS/ Canada P.R/ Rental Income 12L. P.M ★ 1989/5'8" B.Tech/ MS/ ఆస్ట్రేలియా P.R./90K. 7893333726/ 9848221166 (A)

రెడ్డి: 30/ 5'6"/ BA/ ఓన్ బిజినెస్ / 1 లక్ష PM ఫెయిర్ గల వరుడికి 1వ, 2వ ఎనీ బీసీ / ఓసి గల వధువు కావలెను. (డైరెక్ట్) సంప్ర: 9100404026 (A)

గౌడ: కట్నప్రసక్తి లేదు. B.Tech/ C.Govt Asst. మేనేజర్/ SBI బ్యాంక్/ 50,000/- PM, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను ✆ 9908222406 (A)

హిందుమాల: కట్నప్రసక్తిలేదు. B.Tech/ Govt Asst. ఇంజనీర్/ పంచాయతీరాజ్ Dept/ 60,000/-PM, 6'ఎత్తు 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను ✆ 9966760501 (A)

హిందుమాదిగ: కట్నప్రసక్తిలేదు. B.Tech/ C.Govt అకౌంటెంట్ ఆఫీసర్/ పోస్టల్ Dept/ 48,000/-PM, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను ✆ 9618007652 (A)

ముదిరాజ్ (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10"/ B.Tech SWE/ CTS 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246555529 (A)

SC మాదిగ కట్నప్రసక్తిలేదు 29/ 5'10" B.Tech Civil Defence C.Govt Job 85 వేలు P/M వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. ✆ 8074766368 (A)

కులపట్టింపులేదు (2nd మ్యారేజ్) 40/ 5'7"/ M.Tech/ బెంగుళూరులో చీఫ్ ఇంజనీర్/ 3L PM ఓన్ ప్రాపర్టీస్ గల పిల్లలులేని వరుడికి వధువుకు కావలెను. అర్జెంట్. వాట్సప్: 9550296562 (నో బ్రోకర్స్) (A)

రజక (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ SWE/ Virtusa 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246333320 (A)

గుంటూరు కమ్మ 40 సం॥లు MBBS, ఎరుపు 5.75 ఎత్తు, స్వంత వ్యాపారం గల వరునికి B.Tech, M.Tech, MBA or M.Sc చదివిన ఎరుపు రంగు గల 29-33 సం॥ల వధువు (F.C) కావలెను. ఉద్యోగం, కట్నం ప్రసక్తి లేదు. తల్లిదండ్రులు ఫోటోతో సంప్రదించండి. BOX No: 964 C/o ఈనాడు, పొత్తూరు, గుంటూరు. (I)

బ్రాహ్మణవైదికి వెలనాడుకొండిణ్యస 5' 9", white unmarried ఉత్తరాషాఢ, 2వ పాదము, 47 సం॥ల, వయసు గల కర్నూలులో సొంత ఇల్లు గల పురోహిత వరునకు చదువుకున్న వధువు (Either Diverse) కావలెను. S.N.B. 94405 77925. (L)

★ యాదవ/ కురుమ/ 30/ 5.10/ MS/ USA. ★ 29/ 5.8/ B.Tech/ 15 Lakh P.A/ Hyd. ★ 32/ MS/ USA/ 1 Crore P.A / విశాఖపట్నం, శ్రీ కృష్ణ ✆ 98493 06274 (I).

ఆర్యవైశ్య: 44, 5'6, MA ప్రైవ. జాబ్ ఏబాదరబంది లేని ఒంటరి వరునికి 1వ, 2వ వధువు కావలెను. (ఇల్లరికం ok). డైరెక్ట్. ✆ 70953 79309.

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటన దారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లక్ష్మీకటాక్షం కోసమే వారి తపన!

'మా ఆవిడకు మహా నగల పిచ్చి.. చస్తున్నాం..' అన్నాడు వామనరావు.

'మీ ఆవిడకు ఒక్క నగల పిచ్చే.. మా ఆవిడకైతే నగలపిచ్చితో పాటు చీరల పిచ్చి' వాపోయాడు గోపి.

ఇలాంటి ఫిర్యాదులు చాలా మంది భర్తల నుంచి తరచూ వింటూ ఉంటాం. కాస్తంత ఆలోచిస్తే ఆ ఇల్లాళ్ల కోరికలు ఎంత సబబో మనకే తెలుస్తుంది.

బంగారం లక్ష్మీస్వరూపం. అసలు ప్రతి ఇల్లాలినీ లక్ష్మీస్వరూపంగా భావించాలి అంటారు త్రిదండి రామానుజ చినజీయరు స్వామివారు.

పెళ్లిలో వరుడు నారాయణుడైతే వధువు సాక్షాత్తు లక్ష్మీదేవి రూపం అనేది మన భారతీయుల విశ్వాసం.

వివాహమై కొత్త కోడలు ఇంట్లో అడుగుపెడితే లక్ష్మి మన కుటుంబంలోకి ప్రవేశించినట్లే.

అంటే కేవలం సంపదే కాదు. సంతానం, ధైర్యం, విద్య, ఆరోగ్యం.. ఇలా అష్టలక్ష్ములు మనల్ని కటాక్షించినట్లే. ఈ ఎరుక మనందరికీ అవసరం. 'నగల పిచ్చి' 'చీరల పిచ్చి' అని లోకువగా అనుకునేవాళ్లు భార్యల అంతరంగాన్ని అంచనా వేయరు. వేయడానికి ప్రయత్నమూ చేయరు.

'ధనం మూలం ఇదం జగత్' అనేది అందరికీ తెలిసినా ఆడవాళ్లు పట్టించుకున్నంతగా మగవాళ్లు పట్టించుకోరు. ఇంటి ఖర్చుల్లోంచి పదోపరకో మిగుల్చుకునో లేదంటే భర్తను పీడించో పిల్లలకోసం ముఖ్యంగా ఆడపిల్లలకోసం ఉంగరమో, గొలుసో చేయించాలనుకునే ఆమె తపనంతా అక్షరాలా కుటుంబం కోసమే. అనవసరపు విషయాలపై డబ్బు మంచినీళ్లలా ఖర్చుపెట్టే భర్తలు- తమ భార్యలు కానే నగలు నట్రా అత్యవసర పరిస్థితుల్లో కుటుంబాన్ని ఆదుకుంటాయని గ్రహించరు. ఇంట్లో నగదు రూపేణా దాచిపెడితే ఏదో చిల్లర మల్లర ఖర్చులకింద పులుసులోపడిపోతాయి. అందుకే నగల రూపంలో దాచిపెట్టాలని ఇంటి ఇల్లాలు ఆరాటపడుతుంటుంది. ఎంత పేదకుటుంబమైనా కనీసం తాళిబొట్టు బంగారంతో చేయించాలనేది ఆనవాయితీగా వస్తున్న ఆచారం. పిల్లల పసితనం నుంచీ పిసరు పిసరుగా కూడబెడితేనే పెళ్లినాటికి నాలుగు నగలో గాజులో అమరుతాయని వారి ఆశ. అదీగాక ఎప్పటికప్పుడు దాని విలువ పెరుగుతూనే ఉంటుంది.

అంతేనా? పెళ్లిళ్లు, పేరంటాలు, పండగలు, పబ్బాల సందర్భాలలో మగపిల్లలు ఎలా ఉన్నా ఎవరూ పట్టించుకోరుగానీ చిన్నఒంటిపేట గొలుసైనా లేకుండా ఆడపిల్లలు బయటకు రావడానికి ఆత్మన్యూనతకు గురవుతారు. మంచి దుస్తులు లేకపోయినా చిన్నచూపునకు గురవుతారు. కనుకే ఇల్లాళ్లు అలకపాన్పులెక్కో, బలవంతపెట్టో భర్తలతో ఇంతో అంతో బంగారం, మంచి బట్టలు కొనిపిస్తారు.

బంగారం ధరించడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని మన పెద్దలు అంటుంటారు. వాటిలో కొన్ని ఇవిగో..

- బంగారానికి అధిష్ఠాన దేవత కుజుడు. కుజుడు అగ్ని గ్రహం. అందుకే ఆయనను అంగారకుడు అంటారు. ఈ కారణంగా దేహంలోని ఉష్ణాంశాన్ని నియంత్రించడంలో పసిడి పాత్ర ఎక్కువ.
- స్నానపానాదుల వేళ బంగారంపై నుంచి దేహం మీదికి జాలువారే నీటివల్ల శరీరానికి మేలు కలుగుతుంది.
- శరీరానికి బంగారు స్పర్శకారణంగా చర్మవ్యాధులతోపాటు, దేహంలో తలెత్తే చిన్న చిన్న ఉపద్రవాలు నివారింపబడతాయి.
- శరీరంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును బంగారు లోహం తన అధీనంలోకి తెచ్చుకుంటుంది.
- ఆయుర్వేదం ప్రకారం వంధ్యత్వాన్ని పోగొట్టి సువర్ణం గర్భోత్పత్తికి సహకరిస్తుంది. అందుకే ఆయుర్వేద ఔషధాలలో ఈ లోహాన్ని విరివిగా వినియోగిస్తారు.

ఇంకా బలానికి, చలువకు, బుద్ధికుశలతకు, కళ్లకు బంగారం మేలుచేస్తుంది. వీర్యవృద్ధికి, ఉత్సాహానికి కూడా ఉపకరిస్తుందట. ఇలా ఎన్నో ప్రయోజనాలున్న సువర్ణాన్ని ఇల్లాళ్లు కోరుకుంటారంటే అందులో మనం తప్పు పట్టేది ఏముంది?

- చంద్రప్రతాప్

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

Chennai Based Telugu Chetty, 30 Years, Hastham, working in Germany seeks SWE bride & willing to work in Germany 9940035483 (A)

విశ్వబ్రాహ్మణ, 28, 5'8", B.Tech, Sr. SWE, 80,000/- PM, వరునికి తగిన వధువు కావలెను. సంప్ర॥ ✆ 9676812525, 9030056547 (A)

చాతాడ శ్రీవైష్ణవ, కుల, కట్నప్రసక్తిలేని, 33, 5'8", Fr, PG, వర్కింగ్ Hyd, 1 లక్ష PM, చాలా వెల్‌సెటిల్డ్ వరునికి అందమైన వధువు కావలెను. చాలా అర్జెంట్. ✆ 9381534569 (A)

Brahmin 6/N, 41 Late Marriage, Asst. Prof. Pvt. College, Khammam, 40K PM, Subset No Bar. Late Marriage, Divorce, Widow, No Children ✆ 9000511659 (A)

కాపు, 28/ 5'9"/ V.Fair/ B.Tech, IIT, MBA, IIM/ Infoys, Hyd/ 25 Lakhs PA/ 10 Cr. వరునికి వధువు కావలెను. సం॥ ఫెయిర్‌లింక్స్ మ్యాట్రిమోని, వైజాగ్. 81061 68806 (D)

Yadava 25/ 5'7" M.Tech/ IIT/ MNC/ Krishna Dist. 9440831748 ★ 30/ 5'10" B.Tech/ UHG/ Warangal 9440759945 ★ 28/ 5'11" B.Tech/ MNC/ Chittoor 9441735157 (A)

55yrs Kamma well settled Job వరుడికి తగిన వధువు కావలెను. No brokers direct Cont: 9154435575 (A)

కమ్మ/ సెకండ్/ 42 సం॥లు, 6'/ Clf: డిగ్రీ/ Well సెటిల్డ్ గల వరుడికి తగిన వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్రదించగలరు. (నో బ్రోకర్స్), Whatsapp: 98481 68589. (G)

కులపట్టింపు లేదు/ డైవర్సీ/ వెలమ/ 35/ 5'8"/ MCA/ ఫెయిర్ లక్షపైగా ఆదాయం గల వరునికి 1వ, 2వ లేట్, డైవర్సీ 34సం॥ లోపు వధువు కావలెను Ph: 8309872665 (A)

Dr. S.Rajesh Reddy 31 Yrs 5'.10" Fair Chitta, Kanya 1st step Dental Surgeon Own Hospital, Own House Vizag. Need Dr. or Engr 25 to 29 Yrs above 5'.4" Ht. Reddy or Kapu Girl. Cont: ✆ 9949763963/ 9885333578. (C)

కమ్మ ప్రత్యేకం/ 34, B.Tech, MS, Ph.D, USA/ 25 to 42, Ind, USA, ఆస్ట్రేలియా, ఇంజనీర్స్, డాక్టర్స్, వరులకు వధువు కావలెను. శారద: 9849413031. (A)

కాపు, డైవర్సీ 34, 5'8", MCA బ్యాంక్ మేనేజర్, (Govt) 50KPM, వెల్‌సెటిల్డ్ వరునికి అందమైన వధువు కావలెను. (కులపట్టింపులేదు) 7396060879/ 9951022798 (A)

★ ★ ★

వరుడు కావలెను

Kapu, 24, 5'4", BE, MBA, 5 Cr ★ 25, 5'5", BE, MNC, 7L PA ★ 26, 5'6", BE, TCS, 5 Cr ★ 28, 5'5", MBBS, MD (Ped) 20 Cr ★ 24, 5'1", BE, MNC, 10 Cr ★ 26, 5'5", MS, 100K ✆ 9989019945 (A)

SC హిందూ మాదిగ 24/ 5'3" B.Tech మెకానికల్ ఇంజనీరింగ్/ AE/ TS GENCO/ Hyd. 80,000/- PM అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8712865419. (A)

Kamma: 27, 5'6", V.Fair, Citizen of USA, Residency Doctor, 50 Cr., Req: Doctor, Engg. from F/W Caste. (VIP) Ph: 8143538383. (A)

బ్రాహ్మణ/ 30 Yrs./ 5'4"/ ఆత్రేయస గోత్రం/ B.Sc, B.Ed/ Pvt. టీచర్/ రిస్పేక్టేబుల్/ ఎని వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ/ Govt., Pvt. జాబ్ & పురోహితం అయినా OK. ✆ 9121408020/ 9121423830. (A)

Reddy/ B.Th/ Most Beautiful/ 25/5'8"/ Rich & Royal Family- SWE- Hyd - ★ Cont. K.C Reddy- Mar- Bureau- Hyd- Ph: 9849321309/ 9347807015 (A)

వైశ్య అమ్మాయి కావలెను. వైశ్య అబ్బాయి, 30, ఎరుపు, 5'6, MA, M.Sc, M.Ed, D.Ed, ప్రైవేట్ లెక్చరర్ 50 వేలు, ఆస్తి 50 ల.✆ 96184 18981. చందూరు, నల్లగొండ.

Reddy 37/ 5'6" Divorced Sr. Software Engg. US Citizen, Family Financially Welloff, Looking for like minded & educated. ✆ 7337462349. (A)

గౌడ్: 32/ 5'10"/ B.టెక్ MS/ H1B ★ 30/ 5'11"/ B.టెక్.MS/ H1B ★ 38/ 5'4"/ B.టెక్ MBA/ వర్క్ పర్మిట్ అబ్బాయిలకు USAలోని H1/ MS/ Opt. అమ్మాయిలు కావలెను. ✆ 8790690309. (A)

SC Madiga Hindu 27, 5'11", B.Tech Asst. Manager in Bank Govt. 55,000 PM Req. Govt./ Pvt. Emp. Bride Ph: 9866258935, kk7424@gmail.com (A)

కుల ప్రసక్తి లేదు/ గౌడ్స్/ 32 Yrs/ వెల్ సెటిల్డ్/ హైదరాబాద్/ ఒంటరి వరుడికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ ✆ 8500551586. (A)

★ ★ ★

వరుడు కావలెను

Reddy/ MBBS/ Res- Doc- USA (Int-Med) Fellowship- Onchology- Most Beautiful & Rich ★ Cont. K.C Reddy Mar- Bureau- Hyd - Ph: 9849321309 (A)

Reddy/ B.Th/ MS/ H1/ Most Beautiful & Rich/ 26/5'4"/ 25Cr - (Her Share) Prop- Hyd ★ Cont K.C Reddy - Mar-Bureau- Hyd- Ph: 9849321309 (A)

SC మాదిగ/ B.Tech (Civil)/ Govt. A.E (ఇరిగేషన్ Dept)/ 70,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724 (A)

బెస్త/ B.Tech/ Govt. Sr. Asst. (రెవెన్యూ Dept)/ 28,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014 (A)

గౌడ/ ఏకైక కుమార్తె/ 2Cr ఆస్తి/ B.Tech BITS/ C.Govt. Asst. ఇంజనీర్ (రైల్వే)/ 36000/- PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల వధువుకు వరుడు కావలెను. ✆ 9908209244 (A)

పద్మశాలి/ B.Sc (Agri)/ Govt. అగ్రికల్చర్ ఆఫీసర్/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9052296834 (A)

క్రిస్టియన్ మాదిగ/ B.Tech/ Govt. బ్యాంక్ P.O. (ఆంధ్రాబ్యాంక్)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9912280929 (A)

రజక/ B.Tech/ C.Govt. బ్యాంక్ P.O (బ్యాంక్ ఆఫ్ బరోడా)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

బ్రాహ్మణ/ 23/ B.Sc/ 3L/ ★ 25/ B.Tech/ SWE/ 4L ★ 27/ B.Tech/ MS/ (US)/ #60K/ ★ 28/ M.Pharm/ 3L/ ★ 26/ MBA/ 4L/ ★ 30/ M.Sc Wkg/ ★ 9494096081 (A)

బ్రాహ్మణ, 25, 5'4", వైట్, B.Tech, SWE, Accenture, 40K వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి వధువుకి వరుడు కావలెను. 0877 2230289, 76610 24441 (D)

కాపు, 24, 5'4", B.Tech, SWE, విప్రో, Hyd నెలకు 50,000/- జీతం గల చాలా అందమైన, ఫెయిర్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8499011133 (A)

కులపట్టింపులేదు, బ్రాహ్మణ, 51Y, 5'4", ఫెయిర్, 2nd మ్యాచ్, MA, BEd, రిటైర్డ్ టీచర్, VRS, 70K (PM), 2 సొంత ఇళ్లు, పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. ✆ 8341648505 (A)

కులపట్టింపులేదు, బ్రాహ్మణ, 27Y, 5'4", 7th (తండ్రి/తల్లి లేట్) సొంత ఇల్లు కలిగిన వధువుకి తగిన వరుడు కావలెను. (1st/2nd మ్యాచ్ OK & పురోహితుడైనా OK) ✆ 8897587959 (A)

రెడ్డి 1993/ 5'4" Fair/ USA ★ 1991/ 5'4" B.Tech/ MS/ US/ 90K/ 50Cr. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో. ✆ 9505551788/ 9848221166 (A)

రెడ్డి 1990/ 5'3" B.Tech/ Govt Job/ AE/ Hyd/ 12 L.P.A ★ 1989/ 5'4" B.Tech/ MBA/ 8L. P.A/ V.Fair/ 30Cr. ✆ 8885559579/ 9848221166 (A)

రెడ్డి (డైవర్సీ) 1990/ 5'4" B.E/ MS/ US/ 95K/ Fair & Rich ★ 1990/ 5'3" B.Tech/ Business/ Fair & Rich ✆ 7893333726/ 9848221166 (A)

యాదవ: 50 లక్షల ఆస్తి, M.Sc/ C.Govt స్టెనోగ్రాఫర్/ డైల్వేస్/ 45,000/-PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను ✆ 8008939651 (A)

రజక: 40 లక్షల ఆస్తి/ B.Tech/ Govt Jr.Asst/ RDO/ 48,000/-PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను ✆ 9618008271 (A)

పద్మశాలి: 35 లక్షల ఆస్తి, B.Tech/ Govt Asst. ఇంజనీర్/ RWS/ 45,000/-PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను ✆ 6309319756 (A)

బ్రాహ్మణ 1991/ 5'5" కృతిక - 2P నక్షత్రం హరితస గోత్రం BSc కంప్యూటర్స్ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8341795460 (A)

రెడ్డి (ఓన్లీడాక్టర్) 23/ 5'5" B.Tech (IIT)/ SWE 10Lakhs P.A. 10Cr ప్రాపర్టీ గల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8019864386 (A)

కమ్మ 23/ 5'6"/ B.Tech/ చదువుకున్న 10Cr ప్రాపర్టీగల సాంప్రదాయ కుటుంబం వధువుకు తగిన ఆస్తిగల వరుడు కావలెను. ✆ 9246964555 (A)

SC మాల 23/ 5'5" ఫెయిర్ B.Tech (NIT) Asst. Ex. Engr (AEE) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ 40,000 PM అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7207041141 అర్జెంట్. (A)

బ్రాహ్మణ 22 సం॥ 5'4"/ Degree/ 28 సం॥ 5'4", Inter గల వధువులకు పురోహితం, జాబ్, బిజినెస్ గల వరుడు కావలెను. శాఖ భేదం లేదు. ✆ 9703254044 (A)

కమ్మ/ లేట్‌మ్యాచ్/ 35/ 5'3"/ Software డెవలపర్ కంపెనీ/ 3L PM, ఓన్ అపార్ట్‌మెంట్స్ చాలా ఆస్తిగల అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు కులప్రసక్తిలేని వరుడు కావలెను. ✆ 8341758118 (A)

విశ్వబ్రాహ్మణ 24/ 5'5" B.Tech/ SWE/ Infosys 40,000/- PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246151501 (A)

రెడ్డి (Now/ Kurnool) 1988 B.Tech, U.S.A. 100K గల వధువుకు U.S.A.లో గల వరుడు కావలెను. సం॥ 98496 91316/ 98490 19207. (L)

బ్రాహ్మణ, 22, 5'1", ఇంటర్ ★ 25, 5'3", 8th ★ 28, 5'2", 10th కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పూజారి అయినా OK. శాఖ బేధం లేదు. వాట్సప్: 8712244110 (A)

ఆర్యవైశ్య, 24, 5'3', 10th ★ 27, 5'2", 9th ★ 31, 5'4", ఇంటర్ వధువులకు వరులు కావలెను. మొదటి, రెండవ, వైశ్య సంబంధాలకై సంప్ర॥ ✆ 7288942198 (A)

చౌదరి, లేట్‌మ్యారేజ్, 29 Y, 5'4", ఎయిర్‌ఫోర్స్ జాబ్, Only one Daughter, 16 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9121540854 (A)

ముదిరాజ్, కులప్రసక్తిలేని, 31, 5'5", Fr, MBA, వర్కింగ్ Hyd, 50,000/- PM, చాలా వెల్‌సెటిల్డ్, అందమైన సాంప్రదాయ కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 9705844329 (అర్జెంట్) (A)

Vishwabrahmin, 26, 5'4", B.Tech, SWE, 7 Lakhs PA, Rich seeks suitable Groom, Send Photo & Biodata to Whatsapp ✆ 9160065919 (A)

బ్రాహ్మణ, 30, 5'3", ఇంటర్ ★ 34, 5'3", 10th ★ 39, 5'2", ఇంటర్. పేద వధువులకు వరులు కావలెను. అన్ని శాఖలకు ప్రత్యేకం. వాట్సప్: 8374994855 (A)

కాపు, 26/ 5'5"/ V.Fair/ B.Tech/ Infosys, Hyd/ 10 Lakhs PA/ 5Cr. వధువుకు వరుడు కావలెను. సం॥ ఫెయిర్‌లింక్స్ మ్యాట్రిమోని, హైదరాబాద్. 93955 66115 (D)

కమ్మ, 24/ 5'5"/ V.Fair/ B.Tech/ Infosys, Hyd/ 9 Lakhs PA/ 5 Cr. వధువుకు వరుడు కావలెను. సం॥ ఫెయిర్‌లింక్స్ మ్యాట్రిమోని, విజయవాడ. 92999 92602 (D)

రెడ్డి, 24/ 5'5"/ V.Fair/ M.Tech/ IBM, B'lore/ 8 Lakhs PA/ 5 Cr. వధువుకు తగిన వరుడు కావలెను. ఫెయిర్‌లింక్స్ మ్యాట్రిమోని, నెల్లూరు. 93944 66117 (D)

క్షత్రియ, 25/ 5'5"/ V.Fair/ B.Tech, MBA/ MNC, B'lore/ 10 Lakhs PA/ 5 Cr. వధువుకు వరుడు కావలెను. సం॥ ఫెయిర్‌లింక్స్ మ్యాట్రిమోని, తిరుపతి. 92999 92601 (D)

Yadava 23/ 5'7" M.Tech/ Oracle/ Hyd. 9440831748 ★ 22/ 5'4" B.Tech/ Amazon/ Guntur 9440759945 ★ 25/ 5'4" B.Tech/ MBA/ IIM/ ICICI/ Vizag 9441735157 (A)

క్రిస్టియన్ మాల 31 Y. 5'5" B.Tech, S/W జాబ్ 13సం॥ P.A అందమైన వధువుకి S/W జాబ్ చేస్తున్న తగిన వరుడు కావలెను. ✆ 6306731858/ 8499001654 (A)

హిందూ మాల Hyd 34/ 5' ఫెయిర్ స్లిమ్/ M.Sc (బయోటెక్) జాబ్ AS HOD in Pharma 30K P.M కు తగిన వరుడు కావలెను. ✆ 8688091321 (A)

SC Hindu Mala Fair Girl 27 5'5" B.Tech MBA Govt Officer IOCL Madurai 7 Lakhs P.A Seeks Govt Officer 8919394072 (A)

SC మాల హిందు, M.Tech, 25 Yrs, 5'4", Infosys, SWE Hyd, 40K, చాలా అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. 9705960270. (A)

42 Yrs, Govt. Emp., 60000/- PM, అందమైన సాంప్రదాయ వధువుకు తగిన (FC/ BC only) వరుడు కావలెను. Ph: 9666498650. (A)

బ్రాహ్మణ్స్, 24, 5'4", డిగ్రీ/ 26, 5'4", డిగ్రీ, అందమైన వధువులకు వరుడు కావలెను. పురోహితము/ జాబ్, B.Tech, బిజినెస్: 8978691424/ 040: 40035518. (A)

చౌదరి, కుల, ఆస్తి పట్టింపు లేదు, 30, విడో, B.Sc, 5'5", ఫెయిర్, సొంత బిజినెస్, 26 కోట్ల ఆస్తి గల వధువుకు, 1వ, 2వ, వరుడు కావలెను. వాట్సప్: 9603873679. (A)

చౌదరి, విడో, 40, 5'3" పర్‌ఫెయిర్, సొంత బిజినెస్, PM 3 Lacs, 20

గవర్నర్ రబ్బర్ స్టాంప్ కాదని నిరూపించా

ఆ కుటుంబంలో అంతా కరడుగట్టిన కమ్యూనిస్టులే ఆయన మాత్రం కాషాయ జెండా పట్టారు.. డాక్టర్ కావాలనుకొని రాజకీయాల్లోకొచ్చారు... ఇక రాజకీయ జీవితం ముగిసిపోయినట్లే అనుకుంటున్న తరుణంలో మహారాష్ట్రలాంటి పెద్ద రాష్ట్రానికి గవర్నర్ అయ్యారు. దేశంలో ఏ గవర్నరూ చేయంది చేశారు..
ఈ నెలాఖరుతో పదవీకాలం ముగుస్తున్న చెన్నమనేని విద్యాసాగర్ రావు అంతరంగ ఆవిష్కరణ హాయ్‌కి ప్రత్యేకం!

● మీ అన్నలు ఎర్రజెండా ఎత్తితే మీరేమో కాషాయం వైపు వచ్చారు. ఒకే ఇంట్లో ఇంత వైవిధ్యం ఎలా?

చిన్నప్పటి నుంచే నాకు ఆరెస్సెస్‌తో పరిచయమైంది. అందుకే భాజపా వైపు వచ్చా! మా అన్నలు అప్పుడున్న రాజకీయ పరిస్థితుల ప్రభావంతో కమ్యూనిజం వైపు మొగ్గు చూపారు. కానీ ఎన్నడూ నన్ను వాళ్లు ప్రభావితం చేయలేదు. మా పెద్దన్న చెన్నమనేని రాజేశ్వర్‌రావుకు నాకు 22 ఏళ్ల తేడా. వయసులో చాలా చిన్నవాడిని అయినా ఒక్కసారి మినహా ఏ రోజూ నా ఆలోచన విధానాల్ని ఆయన ప్రశ్నించలేదు. చదువుకునేప్పుడు కూడా ఆయనింట్లో ఉంటూనే ఏబీవీపీ కార్యక్రమాలకు వెళ్లేవాడిని. ఆయనేమీ అనేవారు కాదు. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు చేసినప్పుడు మాత్రం... జన్‌సంఘ్‌కు రాజీనామా చేస్తే జైలు నుంచి విడుస్తారట... చేస్తావా అంటూ అడిగారు. నేను నో చెప్పా! అలాగే సిద్ధాంతపరంగా వేర్వేరు పార్టీల నుంచి నాయకులుగా ఎదిగాం. 1985లో అన్న సిరిసిల్ల నుంచి నేను మెట్‌పల్లి నుంచి ఒకేసారి ఎమ్మెల్యేలం అయ్యాం. వేర్వేరు పార్టీలకు అసెంబ్లీలో శాసనసభ పక్ష నేతలుగానూ ఉన్నాం. ఇద్దరు సోదరులు ఇలా ఉండటం దేశంలో అదే మొదటిసారి.

● చిన్నప్పటి నుంచే రాజకీయాల్లోకి రావాలనుకున్నారా?

మాది మధ్య తరగతి కుటుంబం. ఎనిమిది మంది అక్కలు. నలుగురు అన్నదమ్ములం. అప్పట్లో నిజాం వ్యతిరేక పోరాటం ఉద్ధృతంగా సాగుతోంది. కుటుంబం ఆర్థికంగా కొంత ఇబ్బందుల్లో ఉండేది. నేను డాక్టర్ కావాలని నాతో పాటు మా అమ్మ కోరుకుంది. నాన్న మరణం తర్వాత నా చదువు ఒడిదొడుకులకు లోనైంది. నాందేడ్‌లో పీపీసీ (డిగ్రీ తొలి ఏడాదికి సమానమైన ప్రొఫెషనల్ కోర్సు, ప్రిమెడికల్‌కు సమానం) ఏడాది చదివిన తర్వాత.... కుదరక- ఊరొచ్చి రెండేళ్లు వ్యవసాయం చేశా. అలా డాక్టర్ కావాలన్న ఆశలకు బ్రేక్ పడింది. మా అన్న (ప్రముఖ ఆర్థికవేత్త) సీహెచ్. హన్మంతరావు చొరవతో నాందేడ్‌లో డిగ్రీ పూర్తిచేశా. ఆ తర్వాత ఓయూలో లా చదివా. అక్కడే కీలక రాజకీయ ప్రస్థానం మలుపులు తిరగటం మొదలైంది.

● మలుపులంటే...?

లా కళాశాల విద్యార్థి సంఘ నాయకుడిగా గెలిచా. ఓయూ విద్యార్థి సంఘ అధ్యక్ష పదవికి పోటీచేయడానికి సిద్ధమయ్యా. ఇంతలో ఎన్నికలు రద్దయ్యాయి. ఆ రోజుల్లో ఏబీవీపీ ఒకవైపు! కాంగ్రెస్, కమ్యూనిస్టులు సహా మిగతా సంఘాలన్నీ మరోవైపు! ఘర్షణ వాతావరణం ఉండేది. ఎమ్మెల్యే క్వార్టర్స్ దగ్గర నాపై దాడి జరిగింది. చనిపోయాననుకొని వెళ్ళిపోయారు. కొన ఊపిరితో ఉన్న నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. చాలారోజులు స్పృహలో లేను. మా అన్న సీహెచ్ రాజేశ్వరరావు అప్పుడు బాగా ఏడ్చారు. లా పూర్తయ్యాక కరీంనగర్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలెట్టా! జన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడిగా అటల్‌బిహారి వాజ్‌పేయిని కరీంనగర్‌కు తీసుకెళ్లా.

● నేటి నాయకులు, ఇప్పటి అసెంబ్లీలను చూస్తే మీకేమనిపిస్తుంది?

గతంతో పోలిస్తే రాజకీయాలు పతనమయ్యాయని అనుకోను. పాతవాళ్లే కాదు.. నేటి తరం యువనేతలూ చట్టసభల్లో వివిధ అంశాలపై బాగా మాట్లాడుతున్నారు. మంచి చర్చలు జరుగుతున్నాయి. ఉన్నత విద్యావంతులు ఇప్పుడే ఎక్కువ. ఇక గొడవలు అప్పుడూ ఉన్నాయి. పుచ్చలపల్లి సుందరయ్య గారు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో టేబుల్ మీద కూర్చుని నిరసన తెలిపిన ఘటనలున్నాయి. పార్టీల మధ్య వైరం ఆనాడూ ఉండేది. ఇప్పుడూ ఉంది. పరిస్థితులకు అనుగుణంగా జరుగుతుంటాయంతే!

● ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న మీరు గవర్నర్ అవుతానని అనుకున్నారా?

లేదు. ఎన్నికలు ముగిసిన కొన్నాళ్లకే రాజ్‌నాథ్ సింగ్ నుంచి ఫోన్ వచ్చింది. నా వివరాలు మెయిల్ చేయమన్నారు. ఇవాళ ఆదివారం... ఎవ్వరూ లేరు... రేపు చేస్తాలే అని చెప్పా! కానీ సాయంత్రం కల్లా అందుబాటులో ఉన్న సమాచారంతో నా పోస్టింగ్ ప్రకటించారు. రాజకీయాల్లో నేను చేయాలనుకున్నవి గవర్నర్‌గా ఈ ఐదేళ్లలో చేసి చూపించా! గవర్నర్ అంటే రబ్బర్ ముద్రని అనుకుంటారంతా! కానీ తలచుకుంటే ఆ రబ్బర్‌తోనూ ముద్ర వేయొచ్చని నిరూపించా! అదే నాకు గొప్ప సంతృప్తి!

● అసలు ఏం చేయాలనుకున్నారు? ఏం ముద్ర వేశారు?

ఆదివాసీలన్నా, అంబేడ్కర్ అన్నా నా మనసుకు చాలా దగ్గరైనవారు. అంబేడ్కర్ రచనలు, వ్యక్తిత్వంపై ఆయన చెప్పిన మాటలు నన్ను చాలా కదిలించాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో మొట్టమొదట త్యాగాలు చేసింది ఆదివాసీలే! ఆర్టికల్ 371(2) మహారాష్ట్రకు ప్రత్యేకం! దీని ఆధారంగా... బడ్జెట్‌లో కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసే అవకాశం గవర్నర్‌కుంది.

ఆదివాసీ సబ్‌ప్లాన్‌లోని నిధులపై రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం గవర్నర్ నేరుగా నోటిఫికేషన్ విడుదల చేయొచ్చు. అలా చేయాలంటే మామూలు పరిస్థితుల్లోనైతే ఇంటికెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి. దానికి సిద్ధపడే నేను రంగంలోకి దిగా! మహారాష్ట్రలో ఆరువేల కోట్ల రూపాయల సబ్‌ప్లాన్ ఉంది. అందులో 5శాతం నేరుగా గ్రామాలకు ఇద్దామన్నాను. రాష్ట్రపతి ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించి ఆదేశాలిచ్చా! చాలా ఆదివాసీ గ్రామపంచాయతీలకు లక్షల రూపాయలు చేరాయి. ఇలా మొత్తంగా గిరిజన గ్రామాలకు ఇప్పటివరకు దాదాపు రూ.1000 కోట్ల నిధులు నేరుగా వెళ్లాయి. ఈ డబ్బులెక్కడి నుంచి వస్తున్నాయో వారికి అర్థం కాలేదు. వాళ్లలో ఓ రకమైన సంభ్రమాశ్చర్యం! అంతేకాదు.... అటవీ ఉత్పత్తులపై వారికే పూర్తి అధికారాలు కట్టబెట్టాం. గవర్నర్‌గా నేను ఓ మూడు గ్రామాల్ని దత్తత తీసుకున్నా.

● దీనికి రాజకీయంగా అభ్యంతరం వ్యక్తంకాలేదా?

సహజంగానే అభ్యంతరాలు వచ్చాయి. కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు నా దగ్గరకు వచ్చి అడిగారు. నేరుగా గవర్నరే పంచాయతీలకు డబ్బులివ్వటమేంటన్నారు! నేను నిబంధనలు వివరించా! అయినా వద్దనుకుంటే రాజ్యాంగ సవరణ చేయండన్నా! దీన్ని వ్యతిరేకించలేమని ఎమ్మెల్యేలు గుర్తించారు.

అప్పుడు ఓ మంత్రికి సలహా ఇచ్చా! దీనిపై అభ్యంతరం వ్యక్తంజేసేబదులు... వెళ్లిన ప్రతిచోటా కారులో కొబ్బరికాయలు పెట్టుకొని వెళ్లి పనులు ప్రారంభించండి. మీకే పేరు వస్తుందిగదా... అని చెప్పా! సీఎం కూడా వారికి నచ్చజెప్పటంతో అంతా అలాగే చేశారు. దేశ చరిత్రలో గవర్నర్ తన అధికారాలు ఉపయోగించుకొని ఆదివాసీలకు నేరుగా అభివృద్ధి నిధులు కేటాయించటం; అక్కడి ఉత్పత్తులపై వారికే అధికారమివ్వటం ఇదే ప్రథమం. నేను చేసిన పనులు మరో వంద సంవత్సరాలైనా చెరిగిపోవు.

● మీకు బాగా బాధ కలిగించిన ఘటన?

నా ఎన్నికల ప్రచారానికి వచ్చిన సినీనటి సౌందర్య హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడం చాలా బాధ కలిగించింది. సౌందర్యను రాజకీయాల్లోకి తీసుకురావాలనుకున్నా. ఆమె మా ఇంటికి వచ్చినప్పుడు.. నా శ్రీమతి వినోద ఆమెను రాజకీయాల్లోకి రావద్దని కోరింది. సౌందర్య కూడా సరేనంది. కానీ కర్ణాటక వెళ్లిన తర్వాత అనంత్‌కుమార్ ఆమెను భాజపాలో చేర్పించారు. విద్యాసాగర్‌రావు కోరినప్పుడు పార్టీలో చేరలేదన్న భావనతో తను... ఎన్నికల్లో నా తరపున ప్రచారానికి వస్తానన్నారు. అలా వస్తూ అనుకోని ప్రమాదానికి గురయ్యారు.

● మీ పిల్లలు రాజకీయాల్లోకి వస్తారా?

లేదు. నాకూ నా భార్యకూ ఆ ఆలోచన లేదు. నా పిల్లలకు కూడా లేదు. కూతురు ఇంజినీరు. అమెరికాలో స్థిరపడింది. పెద్దవాడూ అంతే! చిన్నవాడు ఇక్కడే డాక్టర్‌గా చేసుకుంటున్నాడు. రాజకీయాలపై వారికి ఆసక్తి లేదు.

● ఖాళీ సమయాల్లో ఏం చేస్తుంటారు?

రచనలు. వ్యాసాలు, కథలు రాస్తుంటా. పుస్తకాలు చదువుతా. దేశ సంస్కృతీ సంప్రదాయలు తెలుసుకుంటా. ఈ జీవితమంతా తాత్కాలికమని నమ్ముతా! పుట్టినరోజులు చేసుకోను. 75 దాటా!

● అలా కన్పించట్లేదు... ఏంటి ఆరోగ్య రహస్యం?

పెద్ద కారణం ఏమీ లేదు. రోజూ 2-3 కిలోమీటర్లు వాకింగ్, స్వల్పంగా యోగా చేస్తాను. అన్నింటిమీదా స్వీయ నియంత్రణ పాటిస్తా! తిండి నుంచి ప్రతీదీ మితంగా ఉంటా! దేనికీ టెన్షన్ పడను! తమిళనాడులో జయలలిత చనిపోయినప్పుడు కూడా ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్న రాజకీయ సందర్భంలోనూ నేను కూల్‌గా ఉన్నా! తెలంగాణ బిల్లు పాసయ్యే ముందు పార్లమెంటులో సందిగ్ధత ఏర్పడ్డప్పుడు ఒక్కసారే కాస్త ఉద్వేగానికి లోనయ్యాను.

● గవర్నర్‌గా పదవీకాలం ముగిశాక ....?

వ్యవసాయం చేస్తా. అదే నాకిష్టమైంది.

– **సుతారపు సోమశేఖర్,** ఈనాడు, హైదరాబాద్
చిత్రాలు : రాజమౌళి

మా అన్నయ్య రాజేశ్వరరావు కమ్యూనిస్టుగా ఉన్నా అన్నింటినీ సమదృష్టితో విశ్లేషించేవారు. అన్నింటిలోని మంచిని చూసేవారు. హిందూయిజంలోని ప్రగతిశీలతను కూడా విశ్లేషించేవారు. తర్వాతి కాలంలో ఆయనకు వివేకానందుడిపై ఆసక్తి పెరిగింది. మా ఆరెస్సెస్ గురువు సముద్రాల నాగభూషణం గురించి కూడా తన స్వీయ చరిత్రలో చాలా గొప్పగా రాశారు.

చినజీయర్‌స్వామిని ఓసారి కలిసినప్పుడు.. 'నీ తల్లిని నువ్వు ప్రేమించు. ఇతరుల తల్లుల్ని గౌరవించు' అన్న ఆయన సూక్తి బాగా నచ్చింది. ఆయన పేరుతో నాలుగు ఆశ్రమాలు కట్టించా. అవి కోట్ల ఆస్తులైనా వాటిపై హక్కుల్ని మేం ఉంచుకోలేదు. జీయర్ స్వామికి అప్పగించాం. నైపుణ్య అభివృద్ధిపై యువతకు అందులో శిక్షణ ఇస్తున్నారు.

స్వీయ నియంత్రణ భారతీయ తత్వం గొప్పదనం. దాన్ని పాటిస్తాను.

మరో రాష్ట్ర గవర్నర్ కూడా నన్ను చూసి ఈ పనులు చేద్దామనుకున్నారు. తట్టాబుట్టా సర్దుకొని ఇంటికి వెళ్లిపోవటానికి మానసికంగా సిద్ధమైతేనే ఈ పని చేయండని చెప్పా! తను చివరకు వెనక్కి తగ్గారు.

జయ సైగ చేశారు....

తమిళనాడు గవర్నర్‌గా ఆస్పత్రిలో జయను చూసి వచ్చాను. నేను వెళ్లినప్పుడు బొటనవేలు పైకెత్తి... బాగున్నానన్నట్లు సైగ చేసింది. అదే విషయం బయటికొచ్చి చెప్పా! కానీ తర్వాత కొద్దిరోజులకు చనిపోయారు.

• • •

జయ చనిపోయాక సీఎం కావాలనుకుంటున్న వారిద్దరూ నా వద్దకు వచ్చారు. కొద్దిమందే తమ వెంట ఉన్నా... అటువైపు వారంతా కూడా నా వాళ్లే అన్నట్లు చెప్పేవారు. అప్పుడు వాళ్లకు – 'నా పెన్ను నాది... నీ పెన్ను మనది'... అదే సోషలిజం అని కాళోజీ చెప్పిన ఉదాహరణ వినిపించా! మొత్తానికి రాష్ట్రం రావణకాష్ఠం కాకుండా కాపాడగలిగాం!

ఒకటి ఒంటిపై... మరొకటి దండెంపై...

వెండితెరపైకి కథానాయకుడు ఎప్పుడు ఎటువైపు నుంచి దూసుకొస్తాడో తెలియదు. సంపూర్ణేష్ బాబు కూడా ఎవ్వరూ ఊహించని రీతిలో సామాజిక మాధ్యమాల నుంచి వెండితెరపైకి దూసుకొచ్చాడు. తొలి సినిమాకి ముందే బర్నింగ్ స్టార్ అనే గుర్తింపుని తెచ్చుకున్నాడు. 'హృదయకాలేయం'తో కథానాయకుడిగా నవ్వుల్ని పంచిన సంపూ, ప్రస్తుతం 'కొబ్బరిమట్ట' చిత్రంతో సందడి చేస్తున్నారు. ఆయన వ్యక్తిగత, సినిమా ప్రయాణం గురించి 'హాయ్'తో చెప్పిన విషయాలివీ...

● కథానాయకుడు కావాలని ముందు నుంచీ ఉండేదా?

నటుడిగా ఒక్కసారైనా నన్ను నేను తెరపై చూసుకోవాలనే ఆశ తప్ప మరోటి ఉండేది కాదు. చిన్నప్పట్నుంచి నాటకాలంటే పిచ్చి. హైదరాబాద్‌కి వస్తే తప్పనిసరిగా రవీంద్రభారతికి వెళ్లేవాణ్ని. అక్కడ నాటకాల్ని ఎంతగా ఆస్వాదించేవాణ్నో. ప్రతి నటుడు వందశాతం మనసు పెట్టి నటిస్తుంటే కళ్లార్పకుండా చూసేవాణ్ని. ఆ నాటకాల పిచ్చి క్రమంగా సినిమాల్లో నటించాలనే కోరికని పెంచింది. 'హృదయకాలేయం'కి ముందే కొన్ని సినిమాల్లో నటించా. వాటిలో నేనున్నాననే విషయం నాకు తప్ప మరొకరికి తెలియదు. 'మహాత్మ'లో ఆరు సెకన్లపాటు కనిపిస్తా. నేనెంతసేపు తెరపై కనిపిస్తానని లెక్కపెట్టుకొని మరీ సంతోషించిన సినిమా అది.

● 'హృదయకాలేయం' అవకాశం ఎలా వచ్చింది?

ఒక చెత్త హీరో కావాలి, ఎక్కడ దొరుకుతాడా? అని సాయిరాజేష్ వెదుకుతున్నారు. అనుకోకుండా ఆయన ప్రసాద్ ల్యాబ్‌లో నన్ను చూశారు. విచిత్రమైన స్టైల్‌తో కనిపించిన నన్ను చూసి ఇతనే నేను వెదుకుతున్న హీరో అనుకున్నారట. ఆయనకి నాకూ తెలిసిన మరో స్నేహితుడు నన్ను సాయిరాజేష్‌కి పరిచయం చేశారు. అలా అప్పుడే 'హృదయకాలేయం' కోసం నన్ను ఎంపిక చేసుకొన్నారు.

● సంపూర్ణేష్ బాబు పేరు మీ ఆలోచనేనా?

'హృదయకాలేయం' దర్శకుడు, 'కొబ్బరిమట్ట' నిర్మాత అయిన సాయిరాజేష్ నిర్ణయించిన పేరు అది. నా అసలు పేరు నరసింహాచారి. 'హృదయకాలేయం' సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి ముందు పేరులో బాబు వచ్చేలా ఏదో ఒకటి కావాలని చాలా ఆలోచించారు ఆయన. సంపూర్ణేష్ బాగుంటుంది, ఇప్పట్నుంచి నీ పేరిదే గుర్తుపెట్టుకో అన్నారు. అప్పట్నుంచి సంపూగా మారిపోయా.

● సినిమా పరిశ్రమలోకి రాకముందు ఏం చేసేవాళ్లు?

సిద్దిపేట దగ్గర మిట్టపల్లి మా ఊరు. బంగారు ఆభరణాలు తయారు చేసే కుటుంబం మాది. సిద్దిపేటలో నాకొక వర్క్‌షాప్ ఉంది. నేను సినిమా రంగంలోకి రావడంతో 2013 నుంచి మా అన్నయ్య చూసుకొంటున్నాడు ఆ షాప్‌ని. ఆభరణాలు తయారు చేయడంలో నాకు మంచి పేరుంది. ఇప్పటికీ నా కస్టమర్లు కలుస్తూనే ఉంటారు. ఫలానా ఆభరణం నువ్వే తయారు చేసిచ్చావని మా పిల్లలకి చెబుతుంటే... నమ్మడం లేదని అంటుంటారు వాళ్లు. అప్పటి పిల్లలే ఇప్పుడు పెద్దయ్యారు కాబట్టి.. వాళ్లకి నేను సంపూర్ణేష్ బాబుగానే తెలుసు. అందుకే వాళ్ల ఒంటిపైన నగల్ని నేను తయారు చేశానంటే తొందరగా నమ్మరు.

● చిత్రీకరణలు లేకపోతే మీ రోజువారీ వ్యాపకం ఎలా ఉంటుంది?

ఇప్పటికీ నేను మా సొంతూరు మిట్టపల్లిలోనే ఉంటా. సిద్దిపేటకు ఐదు కిలోమీటర్ల దూరం మా ఊరు. ఏవైనా పనులుంటే సిద్దిపేటకు వెళ్లి వస్తుంటా. ఇక పనులేమీ లేవంటే ఇంట్లోనే కూర్చుని సినిమాల్లోని సంభాషణల్ని రాసుకొని, వాటిని నాదైన శైలిలో ప్రాక్టీస్ చేస్తుంటా. ఇంకా సమయముంటే ఊళ్లో స్నేహితుల్ని కలుస్తా.

● తొలి పారితోషికం అదే

"నేనందుకొన్న తొలి పారితోషికం అంటే 'బందిపోటు' సినిమాకే. అల్లరి నరేష్ అన్న పిలిచి రూ.3 లక్షలు చేతిలో పెట్టారు. అంత డబ్బుని అందుకోవడం నా జీవితంలో అదే తొలిసారి. అల్లరి నరేష్ అన్న, ఆర్యన్ రాజేష్ అన్న, వాళ్ల సంస్థకి చెందిన రాయుడుగారు నన్ను చాలా బాగా చూసుకునేవారు. రాజమండ్రిలో చిత్రీకరణ తర్వాత నన్ను విమానంలో హైదరాబాద్‌కి పంపించారు. తొలి విమాన ప్రయాణం అది. ఆ టికెట్టు ఇప్పటికీ భద్రంగా దాచుకొన్నా. గురువుగారు మోహన్‌బాబు సంస్థలో చేసిన 'సింగం123' గొప్ప అనుభూతినిచ్చింది. నేను మోహన్‌బాబుకి పెద్ద అభిమానిని. ఆయన్ని కలవడమే పెద్ద విషయం అనుకుంటే, ఆయనతో కలిసి భోజనం చేశా".

● అలాంటిచోట ఏం చెప్పుకొంటాం?

"కథానాయకుడయ్యాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నా. నా స్నేహితులు, నా గురించి తెలిసినవాళ్లు తప్ప నా సమస్యని ఎవరూ అర్థం చేసుకోరు. ఏమైనా చెబుదామనుకొనేలోపే 'కథానాయకుడివి, నీకేంటి?' అంటారు.

● ఏడాదికొకటే డ్రెస్...!

"మా నాన్న నా చిన్నప్పుడే చనిపోయారు. అప్పట్నుంచి అంతా అమ్మే మాకు. పేదరికంతో చాలా సమస్యలు ఎదుర్కొన్నాం. ఏడాదికి ఒక డ్రెస్ కొనుక్కునేవాణ్ని. ఒక డ్రెస్ దండెం మీద ఉంటే, మరొకటి ఒంటిమీద ఉండేది. అమ్మతో పాటు, మా చెల్లెళ్లు బీడీలు చుట్టి ఉపాధి పొందేవారు. మా అన్నయ్య పని చేయడం మొదలుపెట్టాక మాకు సమస్యలు తగ్గాయి. మాలాంటి కుటుంబం నుంచే వచ్చింది నా భార్య ఉమారాణి. మధ్య తరగతి కష్టాలు తెలిసిన అమ్మాయే కాబట్టి తనూ ఇంట్లో పరిస్థితులకి తగ్గట్టుగా నడుచుకొంటుంది. మాకు ఇద్దరు అమ్మాయిలు. ఒకరు 8వ తరగతి మరొకరు 6 చదువుతున్నారు. వాళ్లకి సినిమా రంగం గురించి ఏమీ తెలియదు. స్కూల్లో మా నాన్న నరసింహాచారి అనే చెబుతారు తప్ప సంపూర్ణేష్‌బాబు అని చెప్పరు. మరీ పనిగట్టుకొని అడిగితేనే వాళ్లు 'సంపూ అమ్మాయిలం' అని చెబుతారు (నవ్వుతూ).

– **నర్సిమ్ ఎర్రకోట, ఫొటో: మధు**

ఈనాడు సినిమా

సమంత

బుల్లెట్ల లెక్కల్లో బిజీ బిజీ

సెట్లో సందడి

రాస్కోరా సాంబా... అంటూ తన సినిమాల్లో పంచ్‌ల మీద పంచ్‌లు వినిపిస్తుంటారు హరీష్ శంకర్. అందుకే ఆయన సినిమా అనగానే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాలు ఏర్పడుతుంటాయి. అందుకు తగ్గట్టుగానే 'వాల్మీకి' రూపొందుతోందని ఇటీవల విడుదలైన టీజర్‌తో స్పష్టమైంది. 'నాలుగు బుల్లెట్లు సంపాదిత్తే రెండు కాల్చుకోవాలే.. రెండు దాచుకోవాలే' అంటూ వరుణ్‌తేజ్ చెప్పిన సంభాషణ ఆకట్టుకుంది. రాస్కుందాం సాంబా అంటూ మరోసారి హరీష్ శంకర్ పంచ్‌ల కోసం సిద్ధమైపోయారు ప్రేక్షకులు. ఆ సందడంతా ఒకెత్తైతే.. ఇందులో వరుణ్‌తేజ్ గెటప్పు మరో ఎత్తు. ఆయన ఇదివరకెప్పుడూ కనిపించనంత కొత్తగా కనిపిస్తున్నారు. ఆ హైటు... మీసకట్టు ఇప్పటికే సూపర్‌హిట్టు అనిపించుకొంది. 'మన సినిమా రూటు కూడా మీ మీసకట్టులాగే... సూపర్‌హిట్టువైపే' అంటూ వరుణ్‌తేజ్‌కి దిశానిర్దేశం చేస్తున్నట్టున్నారు హరీష్‌శంకర్. వచ్చే నెల 13న వీళ్ల బుల్లెట్ల లెక్కలు తేలిపోనున్నాయి.

వరుణ్‌తేజ్, హరీష్ శంకర్

వెంకటేష్, రాశిఖన్నా

మామ... భామ

వెంకీ మామ'గా త్వరలోనే సందడి చేయబోతున్నారు వెంకటేష్. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటోంది. ఆ సెట్‌లో దృశ్యమే ఇది. షాట్ గ్యాప్‌లో వెంకటేష్‌తో కలిసి ఇలా ఓ ఫొటో తీయించుకొని, దాన్ని 'ఒక అభిమాని ముచ్చట' అంటూ సామాజిక మాధ్యమాల్లో ఈ చిత్రాన్ని పంచుకొంది. వెంకటేష్‌తో కలిసి ఎవరు పనిచేసినా ఆయనకి అభిమానిగా మారిపోవల్సిందే. అగ్ర కథానాయకుడైనా ఆయన సెట్‌లో ఎంతో క్రమ శిక్షణతో వ్యవహరిస్తూ చుట్టూ ఉన్నవాళ్లలో స్ఫూర్తిని నింపుతుంటారు. ఇక వ్యక్తిగతంగా అయితే ఆయన ఆలోచనలు మరింతగా నచ్చుతాయి. అలా వెంకీకి రాశిఖన్నా అభిమానిగా మారిపోయింది. ఆ అభిమానం ఈ ఫొటోలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చిత్రంలో వెంకీ సరసన పాయల్‌రాజ్‌పుత్ నటిస్తుండగా, నాగచైతన్య సరసన రాశిఖన్నా ఆడిపాడుతోంది.

పంచ్ డైలాగ్

గల్లీలో సిక్స్ ఎవడైనా కొడతాడు. స్టేడియంలో కొట్టేవాడికే ఓ రేంజ్ ఉంటుంది.

చిత్రం: సాహో

– పంపిన వారు: రవి, ఏలూరు

తారల లోలాకులు! తళుకుల కులుకులు!!

కీర్తి సురేష్

పూజా హెగ్డే

అనుపమ పరమేశ్వరన్

నిధి అగర్వాల్

రెజీనా

నభా నటేష్

కాజల్

ఎరుపు లోలాకు కులికెను కులికెను... ముక్కు బుల్లాకు మెరిసెను మెరిసెను...

– ఇలా రచయిత కలం అందాన్ని వర్ణించాలన్నా... ఆ పాటని కథానాయకుడు అంతే అందంగా పాడుకుంటూ ప్రేమని కురిపించాలన్నా.. కథానాయిక తెరపైన నఖశిఖ పర్యంతం ప్రత్యేకంగా కనిపించాల్సిందే. నుదుటిన బొట్టు, కళ్లకి కాటుక, ముక్కు పుడక, చెవికమ్మలు, మెడలోని హారాలు, చేతి గాజులు, నడుము సింగారించిన వడ్డాణం, కాళ్ల పట్టీలు... ఇలా ప్రతిదీ అతివ అందాన్ని రెట్టింపు చేసేదే. ఆ అందం కథానాయకుడిని ఆకర్షించిందంటే చాలు... ఎక్కడి నుంచి వర్ణించడం మొదలుపెడతాడో ఊహించలేం. అందుకే తెరపైన భామలు తమ నీలాల కళ్లకి కాటుక దిద్దడం మొదలుపెట్టి, కాలి గోర్ల వరకు అందానికి మెరుగులు అద్దుతూనే ఉంటారు. తెరపైన కనిపించడంలోనే కాదండోయ్... తెర వెనక కూడా కథానాయికలు ప్రత్యేకంగా ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. బయట కుర్రాళ్లు కూడా వాళ్ల అందం గురించి కవిత్వం రాసుకునేలా అన్నమాట! ఇక్కడ వీళ్లు సింగారించుకొన్న చెవి కమ్మల్ని చూస్తే ఎవ్వరైనా కాసేపు ఆగిపోవల్సిందే, వీళ్ల బుట్టలో పడిపోవల్సిందే. ప్రపంచవ్యాప్తంగా నడుస్తున్న లాంగ్ ఇయర్ రింగ్స్ ట్రెండ్‌ని మన భామలు ఇలా ఒడిసిపట్టుకున్నారు. రకరకాల డిజైన్లతో కూడిన పొడవాటి కమ్మల్ని ధరిస్తూ అదరగొడుతున్నారు. ఇటీవల వేడుకలకి హాజరైన ఈ ముద్దుగుమ్మలు తమ చెవి కమ్మలతోనే ఎక్కువగా ఆకర్షించడం విశేషం. వీళ్లు వేదికలపై ముచ్చట్లు చెబుతూ హొయలుపోతుంటే... వీళ్ల చెవుల కమ్మలు కులుకుతూ అల్లరి చేస్తుంటాయి. ఈ పొడవాటి చెవి కమ్మలకి చాలా ప్రత్యేకతలే ఉన్నాయి. ఏ డ్రెస్‌కైనా ఇవి సెట్ అవుతాయని ఫ్యాషన్ నిపుణులు చెబుతున్నారు. పలు చిత్రాలకి ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేసిన ప్రముఖ స్టైలిస్ట్ శ్రీ మాట్లాడుతూ "కథానాయికలు ఇదివరకు చెవికి చిన్న కమ్మలు, మెడలో రెండు మూడు రకాల దండలు వేసుకొనేవాళ్లు. అప్పుడు అది ఫ్యాషన్. ఇప్పుడు మాత్రం కొత్త ట్రెండ్ నడుస్తోంది. అందులో భాగమే లాంగ్ ఇయర్ రింగ్స్. ఇవి ధరిస్తే మెడలో హారాల అవసరం ఉండదు. అవే ప్రత్యేకమైన లుక్‌తో, అందాన్ని ఇనుమడింపజేస్తుంటాయి. వెస్ట్రన్, ఇండో వెస్ట్రన్, ట్రెడిషన్... ఇలా ప్రతి డ్రెస్‌కీ ఈ కమ్మలు సెట్ అవుతాయి. రింగ్స్ ఎంత పెద్దగా వెడితే అంత ఫ్యాషన్ అన్నమాట. వీటి ఖరీదు కూడా ఎక్కువేం కాదు. రూ.300 నుంచి మొదలవుతుంది. సినిమాల్లోనే కాకుండా, బయట కూడా కథానాయికలు ఈ తరహా కమ్మల్ని ధరించడానికి ఆసక్తి చూపుతుంటార"ని చెప్పారు.

పవన్ మెప్పు పొందింది

అవినాష్, పవన్‌కల్యాణ్

కొత్తదనం నిండిన మా సినిమా ట్రైలర్‌ని చూసి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మెచ్చుకున్నారన్నారు అవినాష్ కోకటి. ఆయన తెరకెక్కించిన చిత్రం 'నీకోసం'. అరవింద్‌రెడ్డి, సుభాంగి పంత్, అజిత్ రాధారామ్, దీక్షితా పార్వతి ప్రధాన పాత్రధారులు. అల్లూరమ్మ (భారతి) నిర్మాత. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. పవన్‌కల్యాణ్‌ని కలిసింది చిత్రబృందం. కొత్తతరానికి స్ఫూర్తి నిచ్చేలా 'నీకోసం' విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించి నట్టు చిత్రవర్గాలు తెలిపాయి. దర్శకుడు మాట్లాడుతూ "కాన్సెప్ట్ ప్రధానమైన చిత్రమిది. కథ, కథ నాల పరంగా ఆశ్చర్యకరమైన విషయాలు ఉంటాయి. ట్రైలర్ చూసినవాళ్లు మెచ్చుకుంటున్నారు. పవన్ మెప్పు కూడా పొందడం ఆనందంగా ఉంది" అన్నారు.

కథ ఎంపికతోనే సగం విజయం సాధించాం

కె.ఎస్.రామారావు, ఐశ్వర్య, భీమనేని శ్రీనివాసరావు

"సినిమాకి మూలం కథే. ఒక మంచి కథని ఎంచుకోవడం లోనే మేం సగం విజయం సాధించాం" అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ఆయన తెరకెక్కించిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. ఐశ్వర్య రాజేష్, రాజేంద్రప్రసాద్, కార్తీక్‌రాజు, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రధారులు. కె.ఎ.వల్లభ నిర్మాత. కె.ఎస్.రామారావు సమర్పించారు. ఇటీవలే విడుదలైందీ చిత్రం. చిత్రబృందం హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించింది. భీమనేని మాట్లాడుతూ "ఈ చిత్రం నా కెరీర్‌లో ఒక మైలు రాయి. క్రియేటివ్ కమర్షియల్స్ సంస్థలో మంచి సినిమాలే రూపొందుతాయని ఈ చిత్రం మరోమారు నిరూపించింది" అన్నారు. "సమాజానికి ఉపయోగపడే 'కౌసల్య కృష్ణమూర్తి'లాంటి సినిమాలకి ప్రోత్సాహం అవసరం. చూసినవాళ్లు 'శంకరాభరణం', 'మాతృదేవోభవ' లాంటి గొప్ప చిత్రం అంటున్నారు. వాణిజ్య పరంగానూ మంచి ఫలితాన్నిచ్చింది. ఇకపై మా సంస్థ నుంచి ఇలాంటి మంచి చిత్రాలే వస్తాయ"న్నారు కె.ఎస్.రామారావు. కార్యక్రమంలో ఐశ్వర్యారాజేష్‌తో పాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

స్కార్లెట్ జాన్సన్

బ్లాక్ విడో.. సంపాదన అదరహో!

'బ్లాక్ విడో' భామ స్కార్లెట్ జాన్సన్ జోరు ఏమాత్రం తగ్గడంలేదు. సంపాదనలో ఆమెను మించిన నటీమణులు ఇంకెవరూ లేరు. వరుసగా రెండేళ్లూ ఆదాయంలో ఆమెదే ఫస్ట్ ర్యాంక్. ప్రపంచంలోనే అత్యధికంగా సంపాదిస్తున్న నటీ నటుల జాబితాను ఫోర్బ్స్ ఏటా విడుదల చేస్తుంది. తాజాగా ప్రకటించిన నటీమణుల జాబితాలో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. గతేడాదీ ఆమెది అదే స్థానం. వీటితో పాటు మరెన్నో ఘనతలు ఆమె సొంతం చేసుకుంది.

- 'అవెంజర్స్' సిరీస్‌లో బ్లాక్ విడో పాత్రతో గుర్తింపు తెచ్చుకుంది స్కార్లెట్. 'అవెంజర్స్' ద్వారా ఆమెకు భారీ పారితోషికం అందుతోంది. 2018 జూన్ నుంచి 2019 జూన్ మధ్య ఆమె మొత్తం సంపాదన 56 మిలియన్ డాలర్లు కాగా, అందులో 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' పారితోషికమే 35 మిలియన్ డాలర్లని ఫోర్బ్స్ తెలిపింది. గతేడాది ఆమె ఆదాయం 40.5 మిలియన్ డాలర్లు. అంటే గతేడాది కన్నా ఇప్పుడు 15.5 మిలియన్ డాలర్లు ఎక్కువ.
- బ్లాక్ విడో పాత్రకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఆ పాత్రనే ప్రధానంగా చేసుకుని మార్వెల్ సంస్థ 'బ్లాక్ విడో' చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. స్కార్లెట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదలవుతుంది. దీనికి కూడా ఆమెకు మిలియన్ల కొద్దీ పారితోషికం అందుతోందట.
- ప్రపంచంలోనే అత్యధికంగా ఆర్జిస్తున్న వంద మంది సెలబ్రిటీలతో ఫోర్బ్స్ విడుదల చేసే జాబితాలోనూ ఎన్నో సార్లు చోటు దక్కించుకుంది స్కార్లెట్. 2006, 2014, 15, 18, 19 సంవత్సరాల్లో ఆమె పేరు ఆ జాబితాలో ఉంది.
- హాలీవుడ్ ప్రముఖులకు గౌరవ సూచకంగా అందించే హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్‌ను కూడా అందుకుంది.
- ప్లేబోయ్, ఎఫ్‌హెచ్‌ఎమ్ లాంటి ప్రముఖ మ్యాగజీన్లు ప్రపంచ అందగత్తెల జాబితాలో స్కార్లెట్‌ను చేర్చాయి. ఎన్నో మ్యాగజీన్ల కవర్ పేజీల మీద ఆమె దర్శనమిచ్చింది. వ్యానిటీ ఫెయిర్ మ్యాగజీన్ కవర్ పేజీ కోసం నగ్నంగా పోజిచ్చి సంచలనం రేపింది. న్యూయార్క్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఆమె మైనపు విగ్రహాన్ని 2015లో ఏర్పాటు చేశారు.

కొత్తతరం వినోదం

దిగంగన, లక్ష్

లక్ష్, దిగంగన సూర్యవంశీ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. రమేశ్ కడుముల దర్శకుడు. పద్మావతి చదలవాడ నిర్మాత. పద్మావతి చదలవాడ సమర్పిస్తున్నారు. రవిప్రకాష్, రవి వర్మ, నోయెల్ సేన్, చిత్రం శ్రీను తదితరులు ముఖ్యపాత్రధారులు. శనివారం లాంఛనంగా చిత్రాన్ని ప్రారంభించారు. "వైవిధ్యమైన కథతో రూపొందుతున్న చిత్రమిది. 'బిచ్చగాడు', 'డి 16', 'టిక్ టిక్ టిక్' లాంటి కొత్త రకమైన చిత్రాలు మా సంస్థ నుంచి వచ్చాయి. అందుకు దీటుగా కొత్తతరం వినోదంతో ఈ చిత్రం రూపొందుతోంది. శేఖర్ చంద్ర సంగీతం, రామకృష్ణ కెమెరా పనితనం ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయ"ని తెలిపింది చిత్రబృందం.

వసుంధర

చేతికి అందంగా... ఆరోగ్యానికి అండగా!

కొత్తగా

ఇదో బ్రేస్‌లెట్. ఇది చేతికి చక్కగా అమరిపోయి... ఆరోగ్య విషయాలు తెలియజేస్తుంది. దీనిపేరు అవ. ఇది మహిళల రుతుచక్రం, సంతాన సాఫల్యత, గర్భధారణ, ఇతర ఆరోగ్య విషయాలు తెలియజేస్తుంది. గుండె కొట్టుకునే వేగాన్ని ట్రాక్ చేసి చెబుతుంది. ఇది ఫోన్‌లోని యాప్‌తో అనుసంధానమై ఉంటుంది. గర్భధారణ సమయంలో ప్రతి వారం ఎటువంటి మార్పులు కలుగుతాయి... శారీరక శ్రమ, నిద్ర, ఒత్తిడి... వంటి వాటిని తెలియజేస్తుంది. ఈ సాధనం కొన్ని పారామీటర్ల ఆధారంగా సమాచారం సేకరించి మనకు అందిస్తుందని తెలియజేస్తున్నారు దీని తయారీదారులు. ఇది ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది.

అందానికి నల్లమట్టి వాడతారట

మన దేశంలో చర్మ రక్షణకు స్త్రీలు పసుపు వాడుతారు. మరి ఇతర దేశాల్లో... తెలుసుకోవాలనుకుంటున్నారా... ఇది చదివేయండి మరి.

❖ థాయ్‌లాండ్‌లో చాలామంది మహిళలు చర్మ సౌందర్యం కోసం ఎక్కువగా నిమ్మగడ్డిని ఉపయోగిస్తారు. ఆ గడ్డి కాడలను వేడి నీళ్లల్లో వేసి మరిగించి... ఆ ఆవిరిని ముఖానికి పడతారట. నిమ్మగడ్డిలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు చర్మాన్ని శుభ్రపరిచి ఇన్‌ఫెక్షన్లకు దూరంగా ఉంచుతాయి.

❖ డెన్మార్క్, ఫిన్‌లాండ్, నార్వే వంటి దేశాల్లో అందానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. పోషకాహారం తీసుకుంటూ వ్యాయామాలు చేస్తారు. సంతోషకరమైన జీవన శైలిని అనుసరిస్తారు. వీటన్నింటితో చర్మం తాజాగా, ఆరోగ్యంగా ఉంటుందని నమ్ముతారు.

❖ మృతసముద్రంలోని నల్లమట్టిని ఇజ్రాయిల్ దేశవాసులు చర్మ సంరక్షణకు వినియోగిస్తారు. అందులో ఉన్న ఖనిజలవణాలు చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. మహిళలు తమ శరీరానికి నల్లమట్టి రాసుకొని సముద్ర జలంలో స్నానం చేస్తారట. మరికొందరు ఆ మట్టిని ఇంటికి తెచ్చుకొని వినియోగిస్తారట.

❖ బియ్యం కడిగిన నీటిని మన ఇళ్లల్లో చాలామటుకూ పడేస్తాం. చైనాలో మాత్రం ఆ నీటిని జుట్టు, చర్మ సంరక్షణకు వాడతారు. రైస్ వాటర్‌లో విటమిన్లు, ఖనిజ లవణాలు, అమినో ఆమ్లాలు ఉంటాయి. ఈ నీటితో ముఖం కడిగితే కాంతిమంతంగా కనిపిస్తుంది.

❖ మన దేశంలోలానే ఇండోనేషియా మహిళలు సైతం తమ చర్మ సౌందర్యం కోసం పసుపును ఎంచుకుంటారు. ఇది అక్కడ సంప్రదాయంగా వస్తోంది.

అవునా!

❖ స్వీడన్ లాంటి దేశాల్లో చలికాలం వస్తే ఎంత చల్లగా ఉంటుందో చెప్పనవసరం లేదు. తమ చర్మం తేమగా ఉండేందుకు ఆవిరిస్నానాన్ని ఎంచుకుంటారు. దీనివల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుందని నమ్ముతారు.

❖ నైజీరియాలో బ్లాక్ సోప్, షియా బటర్ వంటివాటిని చర్మ సౌందర్యానికి ఉపయోగిస్తారు.

మంచి మనమున పెంచుమమ్మా!

● గొంతెమ్మ కోర్కెలకు లొంగొద్దు



పెద్దవాళ్లు తమను పట్టించుకోవాలని, తాము కోరినవి తీర్చాలని కోరుకోవటం పిల్లల నైజం. అవసరమున్నా లేకపోయినా... తెలిసో తెలియకో ఎన్నెన్నో అడుగుతుంటారు. పిల్లలు ముచ్చటపడుతున్నారనో, మరే కారణంతోనో మనలో చాలామంది ఇష్టం లేకపోయినా, కాస్త ఖర్చు ఎక్కువైనా తీర్చడానికే ప్రయత్నిస్తుంటారు. ఒక్కరే సంతానమున్న ఇంట్లో ఇలాంటి ధోరణి మరింత ఎక్కువ. పిల్లలు సంతృప్తి పడటం అటుంచితే... గొంతెమ్మ కోరికల విషయంలో జాగ్రత్త అవసరం. ఏది అవసరం? ఏది అనవసరం? అనేవి పిల్లలకు అర్థమయ్యేలా చెప్పటం మంచిది. అనవసరమైతే నచ్చజెప్పి ఒప్పించడం మేలు. లేకపోతే ప్రతిదానికీ మారాం చేయటం, పెద్దల మాటను పెడ చెవిన పెట్టటం వంటివి అలవడతాయి. ఇవి క్రమంగా పెద్దల పట్ల నిర్లక్ష్యం, అగౌరవానికి దారితీస్తాయి. ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్నప్పుడు చెల్లినో, తమ్ముడినో పట్టించుకోకపోతే తల్లిదండ్రుల మనసు చివుక్కుమనటం నిజమే. అలాగని తోబుట్టువులను కచ్చితంగా పట్టించుకోవాల్సిందేనని పట్టుబట్టడం మాత్రం తగదు. దీంతో మంచి కన్నా చెడు జరిగే అవకాశమే ఎక్కువ. అందువల్ల ఇతరత్రా మార్గాలతో పిల్లల మనసు గెలవడానికి ప్రయత్నించాలి. వీలైనప్పుడల్లా కుటుంబమంతా కలిసి బయటకు వెళ్లొచ్చు. ఒకరితో మరొకరు చనువుగా మెలగటానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. నిజానికి చిన్నప్పుడు తోబుట్టువుల మధ్య 'వైరం' ఉండడం సహజమే. అది రాన్రానూ పోతుంది. పిల్లలు ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి అవసరాలను మరొకరు కనిపెట్టుకోవడం అలవడుతుంది. ఒకసారి మీ పిల్లల చిన్ననాటి రోజులను గుర్తుతెచ్చుకొని చూడండి. చెల్లి, తమ్ముళ్ల విషయంలో అప్పటి ప్రవర్తనకూ ఇప్పటి ప్రవర్తనకూ గల తేడా మనకు ఇట్టే అర్థమైపోతుంది. ఒకప్పుడు ప్రతిదానికీ పేచీ పడినవాళ్లే ఇప్పుడు ఎంత కలిసిమెలిసి ఉంటున్నారనేది తెలుస్తుంది. కాబట్టి ఈ విషయాన్ని పదే పదే చెప్పాల్సిన పని లేదు.

మానవత్వం పరిమళించే మనసులు... మంచితనం గుబాళించే మనుషులున్న చోటే శాంతి, సౌఖ్యం వెల్లివిరుస్తాయి. సాటి మనిషి మీద నమ్మకం, గౌరవం పెంపొందుతాయి. మరిలాంటి గుణాలకు పునాది ఎక్కడ పడుతుందో తెలుసా? మన ఇంట్లోనే. అదీ చిన్న వయసులోనే. బాల్యం నుంచే పిల్లలకు మంచీ మర్యాదా అలవడేలా పెంచితే ప్రపంచం శాంతిధామంగా మారుతుందనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు!

రమ్య ఒక్కతే సంతానం. తల్లిదండ్రుల గారాలపట్టి. ఏదైనా బొమ్మ నచ్చితే వెంటనే కొనివ్వాల్సిందే. లేకపోతే మారాం చేస్తుంది. గట్టిగట్టిగా అరుస్తుంది. ఏడుస్తుంది. కొనిచ్చే వరకూ దుకాణంలోంచి రానేరాదు. ఏదో చిన్నతనం... పెద్దయ్యాక అదే సర్దుకుంటుందని తల్లిదండ్రులు అంతగా పట్టించుకునేవారు కాదు. పది మంది ముందు రాద్ధాంతమెందుకు? కుమార్తె సంతోషంగా ఉండటం కన్నా కావాల్సిందేముంది? అని వెంటనే కొనిచ్చేవారు. రమ్య దీన్నే అలుసుగా తీసుకుంది. పెద్దవుతున్నా మారలేదు. మొండితనమూ పెరిగింది. డిమాండ్ చేసి... ఆ మాటకొస్తే తల్లిదండ్రులను 'బెదిరించి' మరీ కావాల్సినవి తెప్పించుకోవటం ఆరంభించింది. ఉపాధ్యాయులను గానీ బంధువులను గానీ లెక్కచేయలేని స్థితికి చేరుకుంది. వారికి ఏమాత్రం మర్యాద ఇచ్చేది కాదు. గౌరవం అసలే లేదు. బడి నుంచి బంధువుల నుంచి రమ్య మీద ఫిర్యాదులు రావటం తలనొప్పిగా మారింది. అప్పటికి గానీ తల్లిదండ్రులకు తాము చేసిన పొరబాటు అర్థం కాలేదు. తమ మితిమీరిన గారాబం మొదటికే మోసం తెచ్చిపెట్టిందని అవగతమైంది. ఇలాంటి ఉదంతాలను చాలామంది తేలికగా తీసుకోవచ్చు గానీ తమ దాకా వస్తే గానీ తెలియదు ఇదెంత ప్రమాదకరమైన ప్రవర్తనో. పరిస్థితి ఇంతవరకూ రాకుండా ముందు నుంచే పెద్దల పట్ల గౌరవం చూపేలా మర్యాద, మన్ననలను నేర్పించటం ఎంతైనా అవసరం.

● క్షమాగుణం నేర్పించాలి

ఏదైనా తప్పు చేసినప్పుడు క్షమాపణ కోరడం... ఎదుటివాళ్లు తప్పుచేస్తే వారిని క్షమించడం ఎంత అవసరమో చిన్నప్పట్నుంచే నేర్పించాలి. ఎదుటివారికి మర్యాద ఇవ్వకపోతే మనకు మర్యాద దక్కదనే విషయాన్ని విడమరచి చెప్పాలి. చాలాసార్లు పిల్లలు చిన్న చిన్న విషయాలకే మనసు నొచ్చుకుంటుంటారు. తోబుట్టువుల మీదా అలుగుతుంటారు. ఇది శ్రుతి మించితే ద్వేష భావానికి దారితీస్తుంది. ఇలాంటి ధోరణి ఇంటికే పరిమితం కాకపోవచ్చు. బడిలోనూ అలాగే ప్రవర్తిస్తుండొచ్చు. అదే క్షమాగుణం గొప్పతనాన్ని అర్థం చేసుకోగలిగితే మనస్పర్థలేవీ తలెత్తకుండా, మర్యాదగా నడచుకునేలా చూసుకోవచ్చు. ఇంటా బయటా ప్రశాంత వాతావరణం నెలకొంటుంది.

● కారణమేంటో గుర్తించాలి

'సహవాస దోషేణ గుణాః భవంతి' అంటారు. చెడు తిరుగుళ్లు తిరిగే, చెడు మాటలు మాట్లాడే పిల్లలతో చేసే స్నేహం వారి మనసును చెడగొట్టొచ్చు. అప్పటివరకూ మంచిగా నడుచుకున్న పిల్లలు ఉన్నట్టుండి మారిపోవచ్చు. అందువల్ల ఎప్పుడైనా అమర్యాదకరంగా ప్రవర్తిస్తుంటే, ఎవరినైనా తిడుతుంటే కారణమేంటో గుర్తించే ప్రయత్నం చేయాలి. ఎవరితో స్నేహం చేస్తున్నారో ఓ కంట కనిపెట్టాలి. చెడ్డవారి సహవాసం చేస్తున్నట్టు గమనిస్తే తగదని వారించాలి. పెద్దవాళ్లను, తోటివారిని తిట్టడం, పరుషంగా మాట్లాడటం... వారి మనసును నొప్పించడం తగదని తెలుసుకునేలా చేయాలి. ఎవరైనా తమను తిడితే ఎలా బాధపడతారో ఇతరులూ అంతేనని గుర్తించేలా చేయాలి. నీతికథల వంటివి ఇందుకు బాగా ఉపయోగపడతాయి.

● మంచి క్రమశిక్షణ అవసరం

జీవితంలో ఎదగాలంటే, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలంటే తోటివారితో సంబంధాలు అతి ముఖ్యమని, ఇందుకు మర్యాదగా నడచుకోవటం అత్యవసరమని పిల్లలకు ముందు నుంచే నేర్పించే ప్రయత్నం చేయాలి. మర్యాద అనేది బలవంతాన ఆశించేది కాదు. ఇచ్చి పుచ్చుకోవడంతోనే దక్కుతుంది. మంచి క్రమశిక్షణతోనే అలవడుతుంది. దీనికి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులే మార్గదర్శకులు కావాలి. వీలైనప్పుడల్లా పిల్లలను తాత, బామ్మ, నాన్నమ్మలతో గడిపేలా చూసుకోవటం మేలు. పెద్దవాళ్లయితే పిల్లలకు ఓపికతో, ప్రేమతో చాలా విషయాలు నేర్పిస్తారు. ఇతరుల పట్ల ప్రేమగా ఉండడం, ఇతరులతో పంచుకోవడం వంటి గుణాలను తమకు తామే అలవరచుకుంటారు. ఇది మంచి నడవడికి బాటలు వేస్తుంది.

పేదింటి విద్యార్థిని... పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తూ...

యంగ్ టాలెంట్

పవర్‌లిఫ్టింగ్... ఆమెకది పరిచయం లేని ఆట. ఎంతో శ్రమిస్తే కానీ నెగ్గడం కష్టం... అదీ చదువుకుంటూ సాధన చేయాలంటే ఇంకా కష్టం. అందులో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని శ్రీలక్ష్మి. వచ్చే నెలలో కెనడాలో జరగనున్న కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననుంది.

శ్రీలక్ష్మిది చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలంలోని ఓ మారుమూల పల్లె. తండ్రి సామాన్య రైతు. తల్లి గృహిణి. నిరుపేద కుటుంబం. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ పెరిగిన ఆమె ఏదో ఒక రోజు వాళ్లు గర్వపడేలా చేయాలనే లక్ష్యంతో చదివేది. పదో తరగతిలో ప్రతిభ చూపడంతో 2015లో ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం లభించింది. చదువే ధ్యాసగా క్యాంపస్‌లో అడుగుపెట్టిన తనకు అక్కడి సౌకర్యాలు ఆటలపై ఆమెకున్న ఆసక్తిని మరింత పెంచాయి. అప్పటికే ఆమెకు డిస్కస్ త్రోలో ప్రావీణ్యం ఉంది. దేహ దారుఢ్యం మెరుగుపరుచుకోవాలని వెయిట్ లిఫ్టింగ్ సాధన చేయాలనుకుంది. ఇందుకు క్యాంపస్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ బాల గోవింద తివారీ సహాయం తీసుకుంది. ఆయన సూచనతో వరుసగా మూడునాలుగు నెలలు సాధన చేసింది. మొదటి సారి జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. క్రమంగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది.

బరువులు ఎత్తగలవా అన్నారు...

'వెయిట్ లిఫ్టింగ్ అంటే బరువులతో కూడుకున్నది. ఎంతో శ్రమించాలి. ఆడపిల్లవు. అంత బరువులెత్తగలవా' అని ఆమెను నిరాశపరిచిన వారూ చాలామందే. 'ఆడవాళ్లమే తొమ్మిది నెలల పాటు కడుపులో బిడ్డను మోయగలుగుతున్నాం... బరువులు ఎత్తలేమా!' అని వారికి సమాధానం ఇచ్చేదట శ్రీలక్ష్మి. పోటీల్లో పాల్గొనే క్రమంలో కొన్నిసార్లు పరీక్షలు రాయలేకపోయేది. అయినా చదువును, పవర్‌లిఫ్టింగ్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగింది. బరువులు ఎత్తే సమయంలో ఒళ్లు నొప్పులూ బాధించేవి. వాటిని తట్టుకుంటూ సాధన చేసింది. ఇప్పటివరకూ రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న శ్రీలక్ష్మి మొత్తం 28 పతకాలు సాధిస్తే... అందులో తొమ్మిది జాతీయస్థాయిలో అందుకున్నవే. కిందటేడాది రాంచీలో జరిగిన జాతీయస్థాయి స్ట్రాంగ్ విమెన్ పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది హాంకాంగ్‌లో జరిగిన ఆసియా స్థాయి పోటీలకు ఎంపికైనా వీసా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాల్గొనలేకపోయింది. తాజాగా సెప్టెంబర్‌లో కెనడాలో జరగబోయే కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ జూనియర్స్ 43 కేజీల విభాగంలో భారతదేశం తరపున ఎంపికైంది. 'అమ్మానాన్న, కోచ్ సహకారంతో ఇంత దూరం రాగలిగా. విదేశాల్లో పాల్గొనాలంటే లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరైనా ఆర్థికంగా సహాయం చేస్తే మరింత రాణిస్తాన'ని అంటోంది శ్రీలక్ష్మి.

– పత్రెం కిరణ్‌కుమార్, ఈనాడు డిజిటల్, కడప

చదువుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా... వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్నా... ఏవయినా ప్రయోగాలు చేస్తున్న అమ్మాయిలు మీరయితే... మీ గురించి మాకు రాసి పంపండి. మీ ప్రతిభను మేం ఫొటోతో సహా ప్రచురిస్తాం.

మా ఈమెయిల్ ఐడీ : vasundhara@eenadu.net

నాకు ఇరవైఅయిదు సంవత్సరాలు. నేనో సంస్థలో చేరబోతున్నా. యాక్సెసరీల విషయంలో నేనెలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.... ఇప్పటివరకూ నేను ఫంకీ నగలకే ప్రాధాన్యం ఇచ్చా. నా స్నేహితులు అవి మానేసి... కాస్త హుందాగా ఉండేవి ఎంచుకోవాలని సూచిస్తున్నారు. నిజమేనా? – ప్రియ, హైదరాబాద్

ఉద్యోగానికి ఫంకీ నగలు.. వేసుకోవచ్చా?

మీ స్నేహితులు చెప్పినదాంట్లో వాస్తవం లేకపోలేదు. పని వాతావరణంలో దుస్తులే కాదు, వాటికి జతచేసుకునే యాక్సెసరీలూ... హుందాగా, ఆకట్టుకునేలా ఉండాలి. ముందు వాచీల నుంచి మొదలుపెడదాం. మీకు వాచీలు పెట్టుకునే అలవాటు ఉంటే... స్టీల్ స్ట్రాప్ ఉన్న రకాన్ని ప్రయత్నించండి. ఏ సందర్భానికైనా నప్పుతుంది. మెడలోకి రోజువారీ అయితే... సన్నని గొలుసు, దానికి చిన్న పెండెంట్ ఉండేలా చూసుకోవాలి. ఇది ఎలాంటి దుస్తుల మీదకైనా నప్పుతుంది. పండగలు, పూజల్లాంటి సమయాల్లో మాత్రం... అదనంగా చిన్న నెక్లెస్, ముత్యాల గొలుసు వంటివి వేసుకోవచ్చు. మరీ అతిగా వేసుకోకపోవడమే మంచిది. జీన్స్, స్కర్ట్స్ లాంటి పాశ్చాత్య వస్త్రశ్రేణి మీదకు స్టడ్స్, హూప్స్ బాగుంటాయి. సంప్రదాయ దుస్తులయితే హ్యాంగింగ్స్ పెట్టుకున్నా బాగానే ఉంటుంది. ముఖ్యంగా ముత్యాలు, రాళ్లున్నవి ఎంచుకుంటే ఆ అందమే వేరు. చేతినిండా గాజులు అనేవి ప్రత్యేక సందర్భాలకు మాత్రమే నప్పుతాయి తప్ప రోజూ కాదు. ఓ చేతికి బ్రేస్‌లెట్ లేదా ఒకే గాజు వేసుకోవడం ఉత్తమం. యాక్సెసరీలు ఎంత తక్కువ ఉంటే అంత బాగుంటుందని గుర్తుంచుకోండి.

డియర్ వసుంధర

నిహారికారెడ్డి
డిజైనర్

బంగారం వెండి

24న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,680	3,600
వెండి (గ్రా)	49.20	48.20

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	39,760	39,120	39,800	39,070	37,800	37,400	39,760	39,100	39,560	38,680
ఆర్నమెంట్	37,220	36,320	36,860	36,180	34,960	34,550	36,800	36,000	36,800	35,980
వెండి(కిలో)	46,045	45,070	46,200	45,300	44,800	43,800	46,000	45,300	46,000	45,500

ఎప్పుడైనా... మెట్లెక్కితే మంచిదే

వ్యాయామం చేసే సమయం ఉండదు కొందరికి. బయటకు వెళ్లి వ్యాయామం చేయాలంటే... బద్ధకించేవారు మరికొందరు. ఇలాంటివారు కుదిరినప్పుడల్లా మెట్లెక్కి దిగి చూడండి. అదీ ఓ ప్రణాళికతో. దానివల్ల కలిగే లాభాలు అన్నీ ఇన్నీ కావని చెబుతున్నారు ఫిట్‌నెస్ నిపుణులు.

ఓ పది మెట్లు ఉన్నాయనుకోండి. ఓసారి ఎక్కి దిగండి. అంటే... ఒక వరుస పూర్తయినట్లు. ఇలా కనీసం పదిసార్లు చేయాలి. అలవాటు అయ్యాక ముప్పైసార్లు చేయొచ్చు. తరువాత ఒక మెట్టు వదిలేసి రెండోదానిపై కాలుపెట్టాలి. ఐదుమెట్లు ఎక్కుతారన్న మాట. పదినుంచి ముప్పైసార్లు ఇలా చేసేందుకు ప్రయత్నించాలి. నేలమీద నిల్చుంటారుకదా... అక్కడినుంచి ఒక మెట్టుపై ఎగిరి మళ్లీ కిందకు ఎగిరినట్లే దిగాలి. ఇదీ ముప్పైసార్లు చేసేందుకు ప్రయత్నించాలి. కుదిరితే బైక్ టైరును చేతుల్లోకి తీసుకుని రెండుచేతులతో పైకెత్తి మెట్లెక్కి దిగాలి. ఇంకా చురుగ్గా చేయాలంటే... పరిగెడుతున్నట్లుగానూ మెట్లెక్కొచ్చు. మోకాళ్లనొప్పులున్నవారు... మెట్లెక్కాలనుకున్నప్పుడు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

లాభాలు:

❖ నడక, జాగింగ్‌తో పోలిస్తే... దీనివల్ల ఎక్కువ కెలొరీలు కరుగుతాయి. శరీర కండరాలన్నింటికీ వ్యాయామం అందించినవాళ్లవుతారు. ఈ వ్యాయామం చేశాక అలసట దూరమై... చురుగ్గా మారతారు.

❖ గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఎక్కువ ప్రాణవాయువు తీసుకుంటాం కాబట్టి... గుండె, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి.

❖ బాగా ఒత్తిడిగా ఉన్నవారు కాసేపు ఇలా మెట్లెక్కి దిగొచ్చు. దీనివల్ల ఎండార్ఫిన్లు విడుదలై... ఆ సమస్య అదుపులోకి వస్తుంది. మానసిక సాంత్వనా అందుతుంది.

❖ బరువు తగ్గడంతోపాటు నడుముభాగమూ తీరైన ఆకృతిని సంతరించుకుంటుంది. గాయాలయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

❖ ఇలా మెట్లెక్కడం వల్ల ఎముకలూ దృఢంగా మారతాయి కాబట్టి... భవిష్యత్తులో ఆస్టియోపొరోసిస్ వచ్చే అవకాశం చాలామటుకూ తగ్గుతుంది.

❖ ఈ వ్యాయామాన్ని ఇంట్లోనే చేస్తారు కాబట్టి... వీలున్నప్పుడల్లా చేయొచ్చు. పాదాలకు బూట్లు వేసుకుంటే సౌకర్యంగా ఉంటుంది.

సెలవు మీకోసమే

ఆదివారం లేదా సెలవు వస్తే చాలు... బోలెడు పనులు పెట్టుకుని నానా కంగారు పడుతుంటారు చాలామంది మహిళలు. అదే పద్దంటారు నిపుణులు. సెలవురోజున కాస్తయినా విశ్రాంతి తీసుకోవాలని చెబుతున్నారు. అదెలాగో తెలుసుకోండి మరి.

● సెలవురోజున కనీసం అరగంట స్వీయ సంరక్షణకు కేటాయించడం వల్ల రాబోయే వారమంతా ఉత్సాహంగా గడుస్తుందట. ఆ అరగంటసేపు నిద్రపోండి లేదా వ్యాయామం చేయండి. ముందురోజు వరకూ మీరు పడిన పనిఒత్తిడి చేత్తో తీసేసినట్లు పోతుంది.

● ఆదివారం ఉద్యోగానికి వెళ్లక్కర్లేదు కాబట్టి... రకరకాల పదార్థాలు చేసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తారు కొందరు. ఇది మంచిదే కానీ... ప్రతివారం అవసరంలేదుగా! నెల్లో ఒక వారం నచ్చినట్లుగా వండుకునేలా చూసుకోవాలి. మిగిలిన వారంతాల్లో... రోజూ వంటకు ఎలా ప్రణాళిక వేసుకుంటారో అదే అనుసరిస్తే చాలు. కొంత సమయం మిగులుతుంది. కుదిరితే బద్ధకించకుండా ముందురోజే కూరగాయలు తరిగి పెట్టుకోవడం, కొన్ని పదార్థాలు అందుబాటులో ఉంచుకోవడం మంచిది.

● దుస్తులు ఉతకడం, ఇల్లు సర్దడం అన్నీ మిగిలిన రోజుల్లోనే అయిపోవాలి కానీ... ఆదివారం కాదంటారు కెరీర్‌రంగ నిపుణులు. దానివల్ల తెలియకుండానే రోజు గడిచిపోతుంది.. అప్పుడే సెలవు అయిపోయిందా అనీ అనిస్తుంది. వీలైనంతవరకూ సెలవురోజునా పొద్దున్నే లేవాలి. ఎప్పటిలానే ఇంటిపనులు చేసుకోవడానికి ప్రయత్నించాలి.

● రాబోయేవారంలో మీరు చేయాలనుకుంటున్న పనుల గురించీ ఓ సారి ఆలోచించుకోండి. ఏవి ఎప్పుడు చేయాలో రాసి పెట్టుకుంటే మిగిలిన రోజుల్లోనూ సమయం మీ చేతుల్లోనే ఉంటుంది.

బ్రెడ్డు కొమ్మన మిఠాయి పొట్లం!

ఉదయాన్నే పాలల్లో నంజుకు తింటే బ్రేక్‌ఫాస్ట్ అయిపోతుంది. సాయంత్రానికి రెండుగా కోసి.. మెండుగా కూరగాయ ముక్కలు దట్టిస్తే.. అల్పాహారం రెడీ! ముసురుపట్టిన వేళ బజ్జీల్లా.. అత్యవసర సమయాల్లో ఉప్మాలా.. వేడుకల్లో డబల్ కా మీఠాలా.. ఎన్నో రూపాలు!! ప్రయత్నించాలే గానీ పాతిక రూపాయల బ్రెడ్‌తో కొత్త రకం రుచులెన్నో ఆస్వాదించవచ్చు. హాట్ హాట్ స్నాక్సే కాదు.. ఈ టేస్టీ టేస్టీ స్వీట్లూ ట్రై చేసి చూడండి..

షాహి టుకడా

కావాల్సినవి: బ్రెడ్‌స్లైసులు- 5, యాలకులు- రెండు, పాలు- మూడు కప్పులు, జీడిపప్పులు- ఐదు, పిస్తా పప్పులు- పది, బాదం పప్పులు- పది, నెయ్యి- అరకప్పు, పంచదార- అరకప్పు, కుంకుమపువ్వు- చిటికెడు,

తయారీ: పాన్‌లో కొద్దిగా నీళ్లు తీసుకుని అందులో పంచదార వేసి అది చిక్కగా అయ్యేంతవరకూ మరిగించుకోవాలి. కుంకుమపువ్వు వేసుకుని ఆ పంచదార పాకాన్ని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు నాన్‌స్టిక్ పాన్‌లో పాలు పోసుకుని అవి నాలుగోవంతుకు వచ్చేంతవరకూ మధ్యమధ్యలో గరిటెతో తిప్పుతూ తక్కువమంటపైన మరిగించుకోవాలి. చివరిగా యాలకులపొడి, మనం ముందుగా మరిగించుకున్న పంచదార పాకంలో నాలుగోవంతు సిరప్ వేసి కలుపుకోవాలి. ఇప్పుడు బ్రెడ్ ముక్కలని క్రాస్‌గా అంటే త్రికోణాకృతిలోకి వచ్చేటట్టుగా కత్తిరించుకోవాలి. వీటిని నేతిలో కరకరలాడేలా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇలా వేయించిన స్లైసులని పంచదార పాకంలో ఒక నిమిషం పాటు ముంచి తీయాలి. ప్లేట్‌లో ఈ స్లైసులని ఉంచి పైనుంచి మరిగించి పెట్టుకున్న పాలను పోసి...ఆపైన సన్నగా తరిగిన బాదం, పిస్తా పలుకులని చల్లుకోవాలి.

బ్రెడ్ చమ్‌చమ్

కావాల్సినవి: అంచులు తీసేసిన బ్రెడ్‌స్లైసులు- 6, పాలు- కప్పు, పంచదార- పావుకప్పు, కొబ్బరికోరు- పావుకప్పు, కోవా- పావుకప్పు, పంచదారపొడి- చెంచా, నెయ్యి- అరచెంచా, టూటీఫ్రూటీలు- రెండు చెంచాలు, నీళ్లు- అరకప్పు

తయారీ: ముందుగా బ్రెడ్‌స్లైసులని చిన్నముక్కలుగా చేత్తో చిదుముకోవాలి. మందపాటి పాన్‌లో పాలు పోసుకుని మరిగించుకోవాలి. మంట తగ్గించుకుని బ్రెడ్‌ముక్కలని వేసుకుని పాలల్లో బ్రెడ్ బాగా కలిసేటట్టుగా గరిటెతో కలుపుకోవాలి. ఎక్కడా ఉండ కట్టకుండా కలుపుకోవాలి. ఇందులో రెండు చెంచాల కొబ్బరికోరు వేసుకుని మళ్లీ నిమిషం పాటు కలుపుకోవాలి. తర్వాత రెండు చెంచాల నెయ్యి వేస్తే ఈ మిశ్రమం గిన్నె అంచులని వదిలేసి దగ్గరకు వస్తుంది. స్టౌ కట్టేసి చల్లార్చుకోవాలి. అరచేతులకు నెయ్యి రాసుకుని ఈ మిశ్రమాన్ని పొడవాటి రోల్స్ మాదిరిగా ఒత్తుకోవాలి. ఒక గిన్నెలో పంచదార, అరకప్పు నీళ్ల వేసి మరిగిన తర్వాత ఈ బ్రెడ్‌రోల్స్‌ని వేసుకుని ఐదారు నిమిషాలపాటు ఉడికించుకుని స్టౌ కట్టేయాలి. ఈలోపు అవి పాకం పీల్చుకుంటాయి.

ఒక పాత్రలో కోవా, పంచదార తీసుకుని బాగా కలిపి పెట్టుకోవాలి. అరచేతులకు నెయ్యి రాసుకుని... కోవాని చమ్‌చమ్‌లో ఫిల్లింగ్ చేసుకునేందుకు వీలుగా సన్నగా పొడవుగా రోల్స్‌లా ఒత్తుకోవాలి. ఇప్పుడు బ్రెడ్‌రోల్స్‌ని కొబ్బరిపొడిలో దొర్లించి చాకుతో మధ్యలోకి కోయాలి. ఇందులో జాగ్రత్తగా కోవారోల్స్‌ని ఉంచి పైపైన టూటీఫ్రూటీలతో అలంకరించుకుంటే బ్రెడ్ చమ్‌చమ్ సిద్ధమవుతుంది.

హల్వా

కావాల్సినవి: బ్రెడ్‌స్లైసులు- 18, పాలు- 5 కప్పులు, పంచదార- రెండు కప్పులు, కుంకుమపువ్వు- చిటికెడు, యాలకులపొడి- అరచెంచా, వేయించిన బాదం పలుకులు- చెంచాన్నర, నూనె- తగినంత, ఎండు ద్రాక్షలు- 20, పిస్తా, జీడిపప్పు పలుకులు- చెంచా, నెయ్యి- రెండు చెంచాలు

తయారీ: కడాయిలో తగినంత నూనె తీసుకుని ఆ నూనెలో బ్రెడ్‌స్లైసులని ఎర్రరంగులోకి వచ్చేంతవరకూ వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. మరొక కడాయిలో నెయ్యివేసి వేడెక్కాక అందులో ఎండుద్రాక్షలని వేసి వేయించుకోవాలి. మరొక కడాయిలో పాలుపోసి మరిగించుకుని పంచదార, యాలకులపొడి, కుంకుమపువ్వు వేసి బాగా కలపాలి. బాగా కలిపిన తర్వాత డీప్‌ఫ్రై చేసిన బ్రెడ్‌స్లైసులు కూడా పాలల్లో వేసి కలుపుకోవాలి. పాలుబాగా చిక్కబడిన తర్వాత జీడిపప్పులు, పిస్తాలు, ఎండుద్రాక్షలు, బాదం పప్పులు వేసుకుంటే హల్వా రెడీ.

బ్రెడ్‌తో గులాబ్‌జామూన్

కావాల్సినవి: పంచదార- కప్పు, నీళ్లు- కప్పు, యాలకులపొడి- అరచెంచా, నిమ్మరసం- చెంచా, బ్రెడ్‌స్లైసులు- ఆరు, పాలపొడి- రెండుచెంచాలు, క్రీం- చెంచా, గోరువెచ్చని పాలు- నాలుగు చెంచాలు, నెయ్యి- వేయించడానికి సరిపడేంత

తయారీ: ఒక పాన్‌లో కప్పు పంచదారకి కప్పు మంచినీళ్లు తీసుకొని చిక్కని పంచదార పాకం తయారుచేసుకోవాలి. ఇందులో యాలకులపొడి, నిమ్మరసం కలుపుకొంటే పాకం తయారీ పూర్తవుతుంది. ఇప్పుడు మిక్సీలో బ్రెడ్ ముక్కలని వేసి మెత్తగా పొడిచేసుకోవాలి. ఇందులోనే రెండు చెంచాలపాలపొడి, చెంచా క్రీం కూడా వేసి ఎక్కడా ముక్కల్లేకుండా మెత్తగా పొడి చేసుకోవాలి. దీనిలో గోరువెచ్చని పాలని కొద్దికొద్దిగా కలుపుతూ... బ్రెడ్‌ని పిండిలా చేసుకోవాలి. చేతికి నెయ్యి రాసుకుని ఈ పిండిని చిన్నచిన్న ఉండల్లా చేసుకుని నేతిలో లేదా నూనెలో వేయించుకోవాలి. జామూన్లు వేడివేడిగా ఉండగానే పంచదార పాకంలో వేసుకోవాలి. ఒక నిమిషంపాటు మంటమీద ఉంచి పొయ్యికట్టేయాలి. రెండు గంటల తర్వాత జామూన్లు పాకంలో నాని పెద్దగా అవుతాయి.

ఐదు నిమిషాల్లో...

నూనెలో లేదా నేతిలో వేయించిన బ్రెడ్‌ముక్కలని పంచదార పాకంలో వేసి ఎండు కొబ్బరిపొడిలో దొర్లిస్తే.. కోకోనట్ టోస్ట్ సిద్ధమవుతుంది. పిల్లలు ఇష్టంగా తినే వంటకం ఇది.

రస్‌మలై

కావాల్సినవి: చిక్కని ఫుల్‌క్రీం మిల్క్- నాలుగు కప్పులు, కండెన్స్‌డ్ మిల్క్ లేదా మిల్క్‌మెయిడ్- కప్పు, కుంకుమపువ్వు కలిపిన పాలు- రెండు చెంచాలు, యాలకులపొడి- అరచెంచా, సన్నగా తరిగిన పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు- ఐదు చెంచాలు, బ్రెడ్ స్లైసులు- ఐదు, పంచదార- అరకప్పు

తయారీ: మందపాటి పాత్రలో ముందుగా పాలని కాచుకోవాలి. పాలు మరిగిన తర్వాత అందులోనే మిల్క్‌మెయిడ్ వేసి కలుపుకోవాలి. మంట తగ్గించి... పొంగు వచ్చినప్పుడల్లా గరిటెతో పాలపై ఉండే మీగడని గిన్నెలోనే ఒక వారగా చేర్చుతూ ఉండాలి. దీన్నే రబ్డీ అంటారు. ఇలా నాలుగైదుసార్లు చేసిన తర్వాత... కుంకుమపువ్వు కలిపిన పాలు, యాలకులపొడి వేసుకుని చివరిగా మనం పక్కకుచేర్చి ఉంచిన రబ్డీని తిరిగి పాలల్లో కలుపుకొని రెండు గంటలపాటు ఫ్రిజ్‌లో ఉంచుకోవాలి. కుకీస్ కటర్‌తో కానీ అంచులు పదునుగా ఉండే మూతతో కానీ బ్రెడ్‌స్లైసులని గుండ్రంగా కత్తిరించి పెట్టుకోవాలి. వీటిని రబ్డీలో వేసి వడ్డించుకోవాలి. పైన బాదం, పిస్తా పలుకులతో అలంకరించుకుని తింటే భలే రుచిగా ఉంటుంది.

పక్కాలోకల్

వెదురు కంద

వెదురుకంద అనగానే ఇదేదో మైదాన ప్రాంతాల్లో దొరికే కందలాంటిది అనుకునేరు. కాదండోయ్! చినుకుకాలంలో మాత్రమే దొరికే ప్రత్యేకమైన గిరిజన ఆహారమే ఈ వెదురుకంద. వెదురు కలపగానే ఎక్కువ మందికి తెలుసు. కానీ లేత వెదురుతో నోరూరించే కూరను సైతం తయారు చేయవచ్చు. అది కూడా ఏడాదిలో కొద్ది రోజులు మాత్రమే! గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వెదురు సాగు ఉంటుంది. వాటి నుంచి తీసిన సహజ సిద్ధమైన ఆహార పదార్థమే ఈ వెదురు కంద. ఏటా జూన్ నుంచి ఆగస్టు వరకు వెదురు కంద తీస్తుంటారు. ఈ మూడు నెలల్లో పడిన వర్షాలకు వెదురు మొక్క చిగురిస్తుంది. దాని నుంచి పొట్ట (కంద భాగం) బయటకు వస్తుంది. ఈ పొట్ట భాగాన్ని తొలగిస్తారు. తొలగించిన పొట్టను శుభ్రం చేసి ముక్కలుగా కూరకు అనుకూలంగా తరుగుతారు. ఇది ఎటువంటి ఎరువులు, పురుగు మందుల ప్రభావం లేని సహజ సిద్ధమైన ఆహారం.

కలిపి వండితే అద్భుతమే...

వెదురు కందను బఠానీ లేదా మునగ ఆకులు కలిపి వండితే 'ఆహా' ఆ రుచే వేరు. కొండ ప్రాంతాల్లో ఎక్కువగా లభ్యమయ్యే వెదురు కందను కొన్ని సందర్భాల్లో గిరిజనులు పల్లపు ప్రాంత గ్రామాలకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అరుదుగా దొరికే వెదురు కందకు డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. గిరిజనులు మాత్రం మూడు నెలలు పాటు ఇదే కూరగాయను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట, బామిని, కొత్తూరు, మెళియాపుట్టి, పలాస, మందస, పాతపట్నం తదితర గిరిజన ప్రాంత మండలాలతో పాటు సరిహద్దు రాష్ట్రమైన ఒడిశా ప్రాంతంలోనూ వెదురుకంద లభ్యమవుతుంది.

వెదురుకంద కూర

కావాల్సినవి: వెదురుకంద తరుగు- కప్పు, బఠానీలు- అరకప్పు, టమాటా- ఒకటి, ఉప్పు- రుచికి తగినంత, కారం- చెంచా, పసుపు- కొద్దిగా, ఉల్లిపాయ- ఒకటి, నూనె- తగినంత, అల్లంవెల్లుల్లి పేస్ట్- అరచెంచా, ఆవాలు, జీలకర్ర- కొద్దిగా

తయారీ: ముందుగా కంద, బఠానీలను విడివిడిగా నీళ్లలో ఉడికించి పెట్టుకోవాలి. తర్వాత కడాయిలో ఆవాలు, జీలకర్ర వేసి అవి వేగాక... అందులో ఉల్లిపాయముక్కలు వేసి వేయించుకోవాలి. అవి కూడా వేగాక టమాటా ముక్కలు వేసి మూతపెట్టేయాలి. అవి మగ్గాక ఉప్పు, కారం, పసుపు వేసి... ఒక నిమిషం పాటు వేయించుకుని అల్లంవెల్లుల్లి ముద్ద వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించుకోవాలి. అందులో ఉడికించిన వెదురుకంద, బఠానీలు వేసి మెత్తగా ఉడికిన తర్వాత దింపుకోవాలి.

– సూరకాసుల వెంకటరమణ, న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పోషకాలమ్!

జుట్టు పెరగాలంటే.. మునగ చారు!

ఈ మధ్య మునగాకులోని పోషకాల గురించి ఎక్కువగా వింటున్నాను. నా జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే మునగాకుతో ఎటువంటి వంటకాలు చేసుకోవచ్చో చెబుతారా?

- ఎం. ఆకాంక్ష, కూకట్‌పల్లి

దక్షిణాదిలో ఆషాఢం మొదలుకుని శీతాకాలం ముగిసేంతవరకూ మునగాకుతో వివిధ రకాల వంటకాలు చేసుకుంటూ ఉంటారు. కూర, పప్పు మాత్రమే కాకుండా... కొంతమంది మునగాకుతో నిల్వపచ్చడి కూడా చేసుకుంటారు. ఇక పోషకాల విషయానికి వస్తే మునక్కాయలో కంటే ఆకులోనే పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా మునగలోని కెరొటినాయిడ్స్ పోషకాలు రోగనిరోధకశక్తిని పెంచి... ఒత్తిడిని తగ్గించి వెంట్రుకలు రాలిపోకుండా చూస్తాయి.

మునగాకులో విటమిన్ ఎ క్యారెట్‌లో కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది. పాలలో కంటే క్యాల్షియం నాలుగు రెట్లు అధికంగా ఉంటుంది. ఒక గుడ్డులో ఉండేన్ని ప్రొటీన్లు ఉంటాయి. ప్రొటీన్లు, క్యాల్షియం, విటమిన్ ఎ అధికంగా ఉండే ఈ ఆహారం... చర్మం ఆరోగ్యంగా ఉండటానికి, కంటిచూపు మెరుగవడానికీ, వెంట్రుకలు బలంగా, ఒత్తుగా ఎదగడానికీ సాయపడుతుంది.

మునగాకు చారు

కావాల్సినవి: మునగాకు- 50గ్రా, నీళ్లు- 100 ఎమ్.ఎల్, చింతపండు- నిమ్మకాయంత, వెల్లుల్లిరెబ్బలు- రెండు, చారుపొడి- చెంచా, టమాటా- ఒకటి, పంచదార- కొద్దిగా, ఉప్పు- రుచికి తగినంత, **తాలింపు కోసం:** ఆవాలు, మెంతులు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, కరివేపాకు

తయారీ: మునగాకుని శుభ్రంచేసి కచ్చాపచ్చాగా దంచి మరుగుతున్న నీటిలో వేసుకోవాలి. ఐదు నిమిషాల తర్వాత వడకట్టుకోవాలి. ఒక పాత్రలో 100 ఎమ్.ఎల్ నీటిని మరిగించుకుని అందులో చింతపండు, వెల్లుల్లి, పంచదార, ఉప్పు, చారుపొడి, సన్నగా తరిగిన టమాటా ముక్కలు వేసి మరిగించుకోవాలి. ఆవాలు జీలకర్రతో తాలింపు వేసుకుని అందులో చింతపండు రసం, మునగాకు రసం వేసి రెండు నిమిషాల తర్వాత దింపుకోవాలి.

డాక్టర్ పెద్ది రమాదేవి, ఆయుర్వేద నిపుణులు

మాటల యుద్ధంలో మహాయోధుడు



సందర్భం ఏదైనా.. ఘట్టం ఏదైనా.. స్వపక్షంపై ఈగ వాలకుండా కాపాడుకోవడంలో కాకలు తీరిన యోధుడు. పత్రికా సమావేశాలైనా, పార్లమెంటు సమావేశాలైనా.. కీలక ప్రకటన చేసినా.. ఎవరికీ చిక్కకుండా, ఎక్కడా దొరక్కుండా.. అత్యంత రాజనీతిజ్ఞతతో తను చెప్పాల్సింది కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం ఆయన నైజం. లాహోర్ నుంచి దిల్లీకి వలస వచ్చిన జైట్లీ కుటుంబం దేశానికి ఓ అద్భుత నేతను అందించింది.

అరుణ్‌జైట్లీ.. అత్యయిక పరిస్థితి వేళ భరతమాత వేదనల నుంచి ఉద్భవించిన ధ్రువతార. ఈ దేశానికి ఎమర్జెన్సీ ద్వారా పరిచయమైన విద్యార్థి నేత.

దేశంలోని అత్యున్నత న్యాయవాదుల్లో జైట్లీది ముందువరస. తన వాగ్ధాటితో ఎదుటి పక్షానికి మాట పెగలకుండా చేయడం ఆయన ప్రత్యేకత.

విపక్షంలో ఉంటే.. అధికార పక్షాన్ని తన వాదనా పటిమతో ఇరుకునపెట్టి, శరపరంపరగా విమర్శలతో తలంటుపోసే నేర్పరి. అధికార పక్షంలో ఉంటే.. విపక్షాల విమర్శల బాణాల్ని తిప్పికొడుతూ.. ప్రత్యర్థుల్ని గుక్కతిప్పుకోనివ్వని మాటల మాంత్రికుడు.

విద్యాభ్యాసం

1952 డిసెంబర్ 28న మహరాజా కిషన్‌జైట్లీ, రత్నప్రభ దంపతులకు జన్మించారు. తండ్రి న్యాయవాది. జైట్లీ బాల్యమంతా దిల్లీ నారాయణవిహార్‌లో గడిచింది. తల్లి సామాజిక సేవకురాలు. జైట్లీకి ఇద్దరు అక్కలు. దిల్లీ సెయింట్ జేవియర్ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయింది. శ్రీరామచంద్ర కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో వాణిజ్యశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు. దిల్లీ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో డిగ్రీ చేశారు. కెరీర్‌కు బీజం పడిందక్కడే. కళాశాలలోనే విభిన్న భాషల్లో చర్చల్లో పాల్గొనేవారు. జమ్మూ-కశ్మీర్ మాజీ ఆర్థికమంత్రి గిరిధారిలాల్ డోగ్రా కుమార్తె సంగీతాడోగ్రాను 1982, మే 24న పెళ్లాడారు. ఈ దంపతులకు కుమారుడు రోహన్, కుమార్తె సోనాలి ఉన్నారు. వీరిద్దరూ న్యాయవాదులే.

విద్యార్థి నేత..

దిల్లీ యూనివర్సిటీలో ఉన్నప్పుడే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నేతగా వర్సిటీ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో కాంగ్రెస్‌కు గట్టి పట్టున్న రోజుల్లో 1974లో వర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఏబీవీపీ అభ్యర్థిగా ఆయన సాధించిన గెలుపు.. ఆనాడు దేశ విద్యార్థి రాజకీయాలపై గణనీయ ముద్ర వేసింది.

అత్యయిక పరిస్థితిలో..

1973లో రాజ్‌నారాయణ్, జయప్రకాష్ నారాయణ్‌లు ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో ప్రముఖ నేతగా పేరొందారు. విద్యార్థి, యువత సంస్థకు జాతీయ కమిటీ కన్వీనర్‌గా జైట్లీని జయప్రకాష్ నియమించారు. 1975-77 నాటి అత్యయిక పరిస్థితిని వ్యతిరేకిస్తూ జైట్లీ యువనేతగా గళమెత్తారు. 1975 జూన్ 26న అరెస్టు చేసేందుకు యత్నించగా తప్పించుకున్నారు. ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా అరెస్టయ్యారు. ముందుజాగ్రత్తగా జైట్లీని అంబాలా జైలులో నిర్బంధించారు. తర్వాత దిల్లీ తిహార్ జైలులో 19 నెలలు పాటు ఉంచారు. ఆ సమయంలో వేర్వేరు నేపథ్యాల నుంచి వచ్చిన నేతలతో పరిచయాల్ని, పరిజ్ఞానాన్ని పెంచుకున్నారు. జైలు నుంచి బయటికొచ్చాక జనసంఘ్‌లో చేరారు. 1977లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జనతా పార్టీ ప్రచారం కోసం ఏర్పాటు చేసిన లోక్‌తాంత్రిక్ యువమోర్చాకు కన్వీనర్‌గా ఉన్న జైట్లీ దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. తర్వాత ఏబీవీపీ దిల్లీ శాఖ అధ్యక్షుడిగా, జాతీయ కార్యదర్శిగా నియామకమయ్యారు.

భాజపా రాజకీయాల్లో..

1980ల్లో భాజపాలో చేరారు. యువమోర్చా జాతీయ అధ్యక్షుడయ్యారు. భాజపా దిల్లీ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1991లో భాజపా జాతీయ కార్యనిర్వాహక మండలి సభ్యుడయ్యారు. 1999 నుంచి భాజపా అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2002లో భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. 2003లో కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి, 2004లో భాజపా ఓటమితో తిరిగి పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. దిల్లీ క్రికెట్ సంఘానికి అధ్యక్షుడిగా సేవలందించిన జైట్లీ, 2009లో బీసీసీఐ ఉపాధ్యక్షుడయ్యారు. పలుమార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన జైట్లీ.. 2014లో అమృత్‌సర్ లోక్‌సభ స్థానంలో ఓటమి చవిచూశారు.

ఒకేసారి ఆర్థిక, రక్షణ మంత్రిగా..

1999 అక్టోబర్ 13న వాజ్‌పేయీ సర్కారులో సమాచార, ప్రసారశాఖ సహాయమంత్రి (స్వతంత్ర హోదా)గా పనిచేశారు. తొలిసారిగా ఏర్పాటు చేసిన పెట్టుబడుల ఉపసంహరణ శాఖకు స్వతంత్ర హోదాలో సహాయ మంత్రిగానూ బాధ్యతలు చేపట్టారు. 2000 జులైలో న్యాయ, కంపెనీ వ్యవహారాల శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2000 నవంబర్‌లో కేబినెట్ మంత్రిగా పదోన్నతి లభించింది. నౌకాయానశాఖను అదనపు బాధ్యతలు చేపట్టిన జైట్లీ.. ఓడరేవుల ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టిసారించారు. 2014 నుంచి 2019 వరకు ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. మోదీ తొలి ప్రభుత్వంలో 2014-16 వరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రిగా, 2014, 2017లలో రక్షణ మంత్రిగా పని చేశారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒకేసారి రక్షణ, ఆర్థిక మంత్రిత్వ శాఖల్ని చేపట్టడం జైట్లీకే సాధ్యమైంది. కేంద్ర ఆర్థిక మంత్రిగా ఆదాయ వెల్లడి పథకాన్ని ప్రకటించారు. పెద్దనోట్ల రద్దు నిర్ణయమూ ఆయన హయాంలో వెలువడిందే. జీఎస్‌టీ అమలును ప్రారంభించారు.

నేతగా ఎదిగిన న్యాయ దిగ్గజం

దేశంలోని దిగ్గజ న్యాయవాదుల్లో ఒకరిగా పేరొందిన అరుణ్ జైట్లీ.. న్యాయస్థానం నుంచి వృత్తి జీవితాన్ని మొదలుపెట్టి రాజకీయ నేతగా చట్టసభకు ప్రస్థానం సాగించారు. 1990లో 37 ఏళ్ల వయసులోనే దిల్లీ హైకోర్టులో సీనియర్ అడ్వొకేట్ హోదా లభించింది. అంతకు ఏడాది ముందు అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ)గా నియమితులయ్యారు. ఏఎస్‌జీగా అప్పట్లో దేశంలో సంచలనం సృష్టించిన బోఫోర్స్ కేసును చేపట్టారు. దేశంలో చరిత్రాత్మక తీర్పులు వెలువడిన ఎన్నో ముఖ్యమైన కేసుల్ని వాదించారు. ఆయన క్లయింట్లలో శరద్‌యాదవ్, మాధవరావు సింధియా, ఎల్‌కే అడ్వాణీ, బిర్లా కుటుంబం తదితరులే కాకుండా బహళజాతి కార్పొరేట్ సంస్థలు ఉన్నాయి. న్యాయ తదితర అంశాలపై పుస్తకాలు వెలువరించారు. రాజ్యసభలో విపక్షనేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత న్యాయవాద వృత్తికి దూరమయ్యారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు గవర్నర్ల బోర్డులో సభ్యుడిగానూ వ్యవహరించారు.

గుజరాత్ అల్లర్ల కేసులో మోదీకి, వివాదాస్పద సోహ్రాబుద్దీన్, ఇస్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ల కేసుల్లో అమిత్‌షాకు న్యాయసేవలు అందించారు. కేంద్రం చేపట్టే న్యాయ నియామకాల్లో జైట్లీ ముద్ర సుస్పష్టం. న్యాయ మంత్రిగా పలు ఎన్నికలు, న్యాయ సంస్కరణలు చేపట్టారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు పథకాన్ని అమలు చేశారు. కోర్టుల కంప్యూటరీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. కేసులు త్వరగా పరిష్కారమయ్యేందుకు వీలుకల్పిస్తూ పలు చట్టాల్లో సవరణలు తీసుకొచ్చారు.

ప్రతిఫలం ఆశించని రాజకీయ రుషి!

మోదీ.. జైట్లీ వీడని బంధం!

ఈనాడు, దిల్లీ: సమకాలీన రాజకీయాల్లో పని చేయడమే తప్ప ప్రతిఫలం ఆశించని నిర్వికారి ఎవరంటే.. మొదట వినిపించే పేరు అరుణ్ జైట్లీదే. స్వయంశక్తితో కావాల్సినంత ఆర్జించుకొని దిల్లీ సంపన్న వర్గాల్లో ఒకరిగా పేరొందిన ఆయన రాజకీయాలను కేవలం రాజకీయాలుగానే పరిగణించారు. అందులోని మిగతా కోణాల్లోకి వెళ్లలేదు. అందుకే ప్రధాని మోదీకి ఆయనంటే అపార గౌరవం. మోదీ తొలి ప్రభుత్వంలో పేరుకు రాజ్‌నాథ్‌సింగ్ రెండో స్థానంలో ఉన్నా, ఆ హోదాను పూర్తిగా అనుభవించింది మాత్రం జైట్లీయే. ఎదుటివారి నుంచి ఏదీ ఆశించకపోవడం, రాజకీయ కక్ష సాధింపు ఆలోచనలు లేకపోవడం, అహానికి దూరంగా ఉండటం జైట్లీ వ్యక్తిత్వానికి వన్నె తెచ్చాయి.

మోదీ ఆధారపడింది ఆయనపైనే...

ప్రభుత్వపరంగా ప్రధాని మోదీ ఎక్కువగా ఆధారపడింది జైట్లీ మీదే. అందుకే ఆర్థికమంత్రిగా ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ప్రధాని తీసుకున్న ప్రతి విధాన నిర్ణయాన్నీ జైట్లీ గట్టిగా సమర్థించారు. పెద్దనోట్ల రద్దు సమయంలో మోదీపై ఎన్ని విమర్శలొచ్చినా.. జైట్లీ తన మేధోసంపత్తి, ప్రాసంగిక నైపుణ్యంతో ప్రత్యర్థులపై పైచేయి సాధించగలిగారు. భాజపాపై పూర్తిస్థాయి పట్టు సాధించినా, ఏనాడూ పార్టీ అధ్యక్ష పదవిని కోరుకోలేదు. ఏ విజయానికీ క్రెడిట్ తీసుకునేవారు కాదు. భాజపాలో అత్యధిక ప్రజా సంబంధాలున్న నేతల్లో ప్రమోద్ మహాజన్ తర్వాతి స్థానం జైట్లీదే.

మోదీకి కష్టాల్లో అండగా..

ప్రధాని నరేంద్ర మోదీకి అరుణ్ జైట్లీ మంచి మిత్రుడే కాదు, మార్గదర్శి కూడా. అన్ని వేళలా అండగా నిలిచిన నమ్మకస్థుడు. అందుకే ఆయనను 'విలువైన వజ్రం' అని ఓ సందర్భంలో మోదీ అభివర్ణించారు కూడా. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉన్న మోదీని భాజపా ప్రధాన కార్యదర్శిగా నియమించినప్పుడు ఆయన జైట్లీ నివాసంలోనే ఉండేవారు. ఆయనను గుజరాత్ ముఖ్యమంత్రిని చేయడంలోనూ, అల్లర్ల సమయంలో గద్దె దిగాలన్న డిమాండ్లు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవడంలోనూ జైట్లీ పాత్ర ఉంది. అల్లర్ల సందర్భంగా నమోదైన కేసుల్లో మోదీ, అమిత్ షాలను గట్టెక్కించడంలో ఆయనది కీలకపాత్ర. రాజకీయ గురువు అడ్వాణీని కాదని ప్రధాని పదవికి మోదీకే మద్దతు పలికారు. ప్రధాని పదవి చేపట్టిన మోదీకి దిల్లీ రాజకీయాల గుట్టుమట్లను చెప్పింది కూడా జైట్లీయే. అందుకే సుబ్రహ్మణ్య స్వామి, అరుణ్ శౌరీలను కాదని ఆయనకు ఆర్థిక, కీలకమైన రక్షణ శాఖలను ఇచ్చి మోదీ కృతజ్ఞత చూపారు. అమృత్‌సర్ నుంచి లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయినా, రాజ్యసభకు పంపి మరీ మంత్రిని చేశారు.

ముఖ్యమంత్రి అయ్యే అవకాశమొచ్చినా..

న్యాయవాద వృత్తి, రాజకీయాలు.. రెండింటిలోనూ జైట్లీ విజయం సాధించారు. దేశంలోని గొప్ప న్యాయవాదుల్లో ఒకరిగా నిలిచారు. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటూ వచ్చిన జైట్లీ.. ఒకానొక దశలో దిల్లీ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టే అవకాశమొచ్చినా తీసుకోవడానికి ఇష్టపడలేదు. ఆయన వద్దన్న తర్వాతే ఆ పదవి సుష్మాస్వరాజ్‌కు దక్కిందని భాజపా నేతలు చెబుతుంటారు.

సిబ్బంది కూడా జైట్లీ ఇంటి మనుషులే

దిల్లీ: న్యాయవాదిగా పేరు గడించిన జైట్లీ సిబ్బందిని సొంత మనుషుల్లా చూసుకున్నారు. గుమస్తాలు, ఇతర ఉద్యోగుల పిల్లల చదువులకు సాయం చేయడంతో పాటు, తన ఇంట్లోనేవారి పెళ్లిళ్లను చేయించారు. తాత గారి ఊరైన అమృత్‌సర్ అంటే ఆయనకు ఎంతో ఇష్టం. బజార్లలో తిరుగుతూ చిరుతిళ్లు తినడం, టీ తాగడం అంటే మరీ ఇష్టం. జైట్లీ సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఎఫ్.ఎం. రేడియోలు వచ్చాయని ఆయన వద్ద ప్రత్యేక అధికారిగా పనిచేసిన దీపాంకర్ ముఖర్జీ గుర్తు చేసుకున్నారు.

అమెరికా-చైనా సుంకాల పోరు

పరస్పరం పన్నుల పెంపు

వాషింగ్టన్: అమెరికా-చైనాల మధ్య వాణిజ్య పోరు మరింత ముదిరింది. తాజాగా శుక్రవారం పరస్పర దిగుమతులపై సుంకాలు పెంచుకున్నాయి. 75 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై ప్రస్తుత సుంకాన్ని మరో 10% పెంచుతున్నట్టు చైనా ప్రకటించింది. ఆ వెంటనే ట్రంప్ శ్వేతసౌధంలో విలేకరులతో మాట్లాడారు. "అక్టోబరు 1 నుంచి 250 బిలియన్ డాలర్ల విలువైన చైనా దిగుమతులపై ఇప్పుడున్న 25% సుంకాన్ని 30% చేస్తున్నాం. అంతేకాదు. 300 బిలియన్ డాలర్ల ఇతర ఉత్పత్తులపై ప్రస్తుతమున్న 10% సుంకం సెప్టెంబరు 1 నుంచి 15% అవుతుంది. మా గత పాలకుల అలసత్వం కారణంగా చైనా చాలా ఏళ్లు మేధో హక్కుల ఉల్లంఘనకు పాల్పడింది. ఫలితంగా ఏటా వందల బిలియన్ డాలర్లు నష్టపోతున్నాం. ఇక చూస్తూ ఊరుకోను. రెండు దేశాల మధ్య పారదర్శకమైన వాణిజ్య విధానాన్ని సాధించాలంటే... కొన్ని చర్యలు తప్పవు. మా ఉత్పత్తులపై చైనా సుంకాలను పెంచకుండా ఉండాల్సింది" అని ఆయన పేర్కొన్నారు.

అమెజాన్ కార్చిచ్చులపై బ్రెజిల్ యుద్ధం

పోర్టో వెలో: బ్రెజిల్ దేశంలోని అమెజాన్ అడవుల్లో చెలరేగిన మంటలు శనివారం మరింతగా విస్తరించాయి. కొత్తగా వందల చోట్ల ఈ మంటలు కనిపించాయని అధికార వర్గాలు తెలిపాయి. గురు, శుక్రవారాల్లో 1,663 ప్రదేశాల్లో కార్చిచ్చు వ్యాపించగా, మరుసటి రోజునే దుండగులు వందల ప్రాంతాల్లో నిప్పు పెట్టారు. నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ పరిస్థితిలో మార్పురాలేదు. దీంతో బ్రెజిల్ మంత్రివర్గం శుక్రవారం రాత్రి అత్యవసరంగా సమావేశమైంది. మంటలను అదుపులోకి తెచ్చేందుకూ; అడవుల్లో నేరపూరిత కార్యకలాపాలను నియంత్రించేందుకు సైనిక దళాలను అనుమతిస్తూ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో ఉత్తర్వులిచ్చారు. ఆ వెంటనే 44,000 బ్రూపుల సైన్యం రంగంలోకి దిగింది. కార్చిచ్చులను ఆర్పివేసేందుకు పలు చర్యలు తీసుకుంటోంది. పొరుగు దేశాలైన పరాగ్వే, బొలీవియాలు సూపర్ ట్యాంకర్ విమానాలతో తమ అడవుల్లో మంటలను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు వ్యతిరేకంగా బ్రెజిల్ ప్రభుత్వం చేపడుతున్న విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు నిరసనకారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సందేహాల నడుమ జి-7 సదస్సు

- ఫ్రాన్స్ మద్యంపై భారీగా పన్ను విధిస్తామన్న ట్రంప్
- వాణిజ్యపోరు వద్దని వారించిన మెక్రాన్!

బియరిట్జ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌ల విందు భేటీ

బియరిట్జ్: పుట్టెడు అనుమానాలు, భేదాభిప్రాయాల నడుమ 'జి-7 సదస్సు'కు ఫ్రాన్స్ ఆతిథ్యమిస్తోంది. బియరిట్జ్ నగరంలో ఈనెల 24 నుంచి 26 వరకూ సదస్సు జరుగనుంది. ఆదివారం ఉదయం అధికారికంగా సమావేశం ప్రారంభమవుతుంది. ఈ కూటమిలో అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. సదస్సులో- ఇరాన్ సంక్షోభం, చైనాతో అమెరికా వాణిజ్య పోరు, బ్రెగ్జిట్, భూతాపం వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది. అమెరికాకు, మిగతా దేశాలకు మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొనడంతో... ఈ సదస్సును 'జి-6+1'గా విమర్శకులు అభివర్ణించారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం ఫ్రాన్స్‌కు బయల్దేరుతూ- "మా టెక్ సంస్థలపై ఫ్రాన్స్ కొత్త పన్ను విధించడం తగదు. దాన్ని ఉపసంహరించుకోకుంటే ఫ్రెంచ్ వైన్‌పై ఊహించలేనంత పన్ను విధిస్తా'మని హెచ్చరించారు. అయితే ఆయనను చల్లబరిచేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ 'ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ట్రంప్ వచ్చీ రావడంతోనే విందు ఏర్పాటుచేసి, ఆయనతో మంతనాలు సాగించారు. అంతకుముందు మెక్రాన్ మీడియాతో మాట్లాడుతూ..."వాణిజ్య పోరు ఏ దేశానికీ మంచిది కాదు. కలిసికట్టుగా పనిచేసి మరింత అభివృద్ధి, ఉద్యోగ కల్పన దిశగా ముందుకు సాగుదామని జి-7 భాగస్వామ్య దేశాలను కోరతా" అని చెప్పారు.

ప్రత్యేక అతిథిగా మోదీ

ఫ్రాన్స్‌లో జరుగుతున్న జి-7 సదస్సులో భారత ప్రధాని మోదీ ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొంటారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా మోదీతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేకంగా భేటీ కానున్నట్టు సమాచారం. భారత్‌లో అమెరికా వస్తువులపై సుంకాలు తగ్గించాలని, తమ వాణిజ్యానికి ద్వారాలు తెరవాలని ట్రంప్ కోరనున్నట్టు అధికారులు తెలిపారు.

★ అమెజాన్ అడవులు ధ్వంసమవుతుండటాన్ని జి-7 నేతల దృష్టికి తెచ్చేందుకు పర్యావరణవేత్తలు ఆందోళనలు చేపట్టారు. సదస్సు జరిగే బియరిట్జ్‌లో 13,000 మంది భద్రతా సిబ్బంది మోహరించి ఉండటంతో... సమీపంలోని హెండయ్‌లో నిరసనలు వ్యక్తం చేశారు. అమెజాన్‌ను కాపాడాలని, పర్యావరణ వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు.

అంతరిక్షంలో తొలి నేరం!

వాషింగ్టన్: అంతరిక్షంలో జరిగిన మొదటి నేరాన్ని అమెరికా రోదసి సంస్థ నాసా శోధిస్తోంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉండగా మహిళా వ్యోమగామి ఆన్ మెక్‌క్లెయిన్ తన మాజీ భర్త బ్యాంకు ఖాతాలోకి అక్రమంగా చొరబడినట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు సాగిస్తోంది. ఖాతాలోకి ప్రవేశించిన మాట నిజమేనని మెక్‌క్లెయిన్ అంగీకరించారు. అయితే ఎలాంటి తప్పూ చేయలేదని చెప్పారు.

మెక్‌క్లెయిన్ ఆ తర్వాత భూమికి తిరిగొచ్చారు. తన బ్యాంకు ఖాతాలోకి ఆమె అక్రమంగా ప్రవేశించినట్లు మాజీ భర్త సమ్మర్ వోర్డెన్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నాసాలోని ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయ అధికారులు దీనిపై ఇద్దరితోనూ మాట్లాడారు. కుటుంబ ఆర్థిక వనరులు సక్రమంగానే ఉన్నాయా అన్నది పరిశీలించేందుకే తాను ఆ ఖాతాను తెరిచి చూసినట్లు మెక్‌క్లెయిన్ చెబుతున్నారు. తమ కుమారుడి బాగోగులను చూసుకోవడానికి సరిపడా డబ్బు వోర్డెన్ ఖాతాలో ఉందా అన్నది నిర్ధరించుకోవడమే దీని ఉద్దేశమని తెలిపారు. వోర్డెన్.. వైమానిక దళంలో ఇంటెలిజెన్స్ అధికారిగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ 2014లో పెళ్లి చేసుకున్నారు. 2018లో మెక్ క్లెయిన్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పీఓకేలో పాక్ పాత్రికేయుల వాహనాల నిలిపివేత

ఇస్లామాబాద్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో నియంత్రణ రేఖ వైపుగా వెళ్లడానికి యత్నించిన పాత్రికేయులను పీఓకే పోలీసులు నిరోధించారు. 'పాకిస్థాన్ ఫెడరల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్'కు చెందిన 400 మంది పాత్రికేయులు నియంత్రణ రేఖ దిశగా వాహనాల్లో వెడుతుండగా ఏడు కిలోమీటర్ల ముందే నిలిపివేశారు. కశ్మీరీల కోసం ముజఫరాబాద్ నుంచి తాము లారీలలో దుస్తులు, మందులు తీసుకెళుతున్నట్లు పాత్రికేయ ప్రతినిధి ఒకరు చెప్పారు.

మధుర మహోత్సవం

ఉత్తర్‌ప్రదేశ్: శ్రీకృష్ణ భగవానుడి జన్మక్షేత్రమైన మథురలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం అంబరాన్నంటాయి. యావత్ నగరం శోభాయమానం అయింది. విద్యుత్తు దీపాల కాంతుల్లో దేదీప్యమానంగా అలంకరించిన ఆలయం నేత్రపర్వం చేసింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పులకించారు.

ఉట్టి కొట్టిన బాలీవుడ్ బాద్‌షా

మహారాష్ట్ర: బాలీవుడ్ స్టార్ హీరోలు షారుఖ్ ఖాన్, ఆయుష్మాన్ ఖురానా కృష్ణాష్టమి వేడుకల్లో సందడి చేశారు. ముంబయిలో అభిమానుల సమక్షంలో.. తన నివాసం వద్ద షారుఖ్ ఉట్టి కొట్టారు. ఓ సినిమా ప్రచారంలో భాగంగా గుజరాత్‌లోని బరోడా వెళ్లిన ఆయుష్మాన్, ఆ చిత్రంలోని ఓ పాటకు స్టెప్పులు వేసి ఉట్టి కొట్టారు. కృష్ణుడి వేషంలో ఉన్న తన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో ఉంచారు.

ఈ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఇంత అమానుషమా!

హరియాణా: రైలు ప్రమాదంలో కాళ్లు తెగిపడిన ఓ అభాగ్యుడి పట్ల ఫరీదాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అమానుషంగా ప్రవర్తించారు. అతను బాధతో విలవిలలాడుతుంటే.. జాలిగుండె లేని సిబ్బంది విరిగిన కాళ్లనే అతనికి తలగడలా పెట్టారు. ప్రదీప్ ఫరీదాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగి. ఇంటి నుంచి కార్యాలయానికి వెళుతూ.. రైలు పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న రైలు అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను రెండు కాళ్లు కోల్పోయారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తే సిబ్బంది కనీస మానవత్వం కూడా చూపలేదు.

ఫోన్, నెట్ లేకుండా 20 రోజులు..

జమ్మూ-కశ్మీర్: మొబైల్, అంతర్జాల సేవలు నిలిచిపోవడంతో 20 రోజులుగా తమ సంబంధీకులతో మాట్లాడలేక కశ్మీర్ వాసులు ఆవేదన చెందుతున్నారు. బంధువులకు ఉత్తరాలు పంపుతున్నా సరైన రవాణా సౌకర్యాలు లేక తపాలా సిబ్బంది వాటిని చేరవేయలేకపోతున్నారు.

జైట్లీ మృతిపై ప్రముఖుల సంతాపం

దిల్లీ: మాజీ ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మృతి పట్ల పలువురు ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. జైట్లీతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

"అరుణ్‌జైట్లీ మరణం దేశ ప్రజలకు తీరని లోటు. ఎంతో కష్టమైన బాధ్యతలను కూడా సునాయాసంగా, విజయవంతంగా నిర్వహించేవారు. చేపట్టే ప్రతి పనిని ఎంతో నిష్టతో పూర్తి చేసే విశేష లక్షణాలున్న వ్యక్తి. దేశ అభివృద్ధి కోసం ఆయన ఎంతో కృషి చేశారు."

– రామ్‌నాథ్ కోవింద్, భారత రాష్ట్రపతి

"జైట్లీ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణం దేశానికి కోలుకోలేని నష్టం. అత్యంత ఆత్మీయుడైన సహచరుడిని, మిత్రుడిని కోల్పోయాను. న్యాయకోవిదుడు, పరిపాలనాదక్షుడు. కేంద్ర మంత్రిగా కీలకమైన శాఖలను సమర్థంగా నిర్వహించారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారం అందుకున్నారు. విప్లవాత్మకమైన జీఎస్‌టీ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు విపక్షాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు ఎంతో కష్టపడ్డారు.

– ఎం.వెంకయ్యనాయుడు, భారత ఉపరాష్ట్రపతి

"ముఖ్య నేతను కోల్పోయాం. విశేషమైన అనుభవం, సామర్థ్యాలతో పేదల సంక్షేమం కోసం ప్రధాని మోదీ దార్శనికతను కార్యాచరణలో పెట్టడంలో జైట్లీ తనదైన ముద్ర వేశారు. ఆయన మరణం వ్యక్తిగతంగా ఎంతో నష్టం. కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లుగా ఉంది. ఆయన చాలా కాలంగా నాకు మద్దతు ఇస్తూ మార్గదర్శనం చేస్తున్నారు."

– అమిత్‌షా, భాజపా అధ్యక్షుడు

"అనేక ముఖ్య సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు పార్టీ జైట్లీ పై ఆధారపడేది. నేను పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జైట్లీని పార్టీ వ్యూహ బృందంలోకి తీసుకున్నాం. ఆయన అతి తక్కువ సమయంలోనే అతి ముఖ్యమైన నాయకుడిగా ఎదిగారు. మృదుభాషి, భోజన ప్రియుడు. అనేక రెస్టారెంట్లలో దొరికే ఆహారం గురించి నాకు సిఫార్సు చేసేవారు. ఒక దీపావళి నాడు ఆయన తన కుటుంబంతో కలసి మా ఇంటికి భోజనానికి వచ్చారు. కోలుకొని ఆసుపత్రి నుంచి ఇంటికి వస్తారని ఆశించాం"

– అడ్వాణీ, భాజపా అగ్రనేత

జైట్లీ మరణం ఆవేదనకు గురి చేసింది. సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా, మంత్రిగా ప్రజలకు సేవ చేశారు. ఆయన సేవలు చిరస్మరణీయం.

– సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు

గొప్పవక్త, న్యాయవాది, సమర్థ పాలనాదక్షుడు, ఉత్తమ పార్లమెంటేరియన్‌ను దేశం కోల్పోయింది.

– మన్మోహన్ సింగ్, మాజీ ప్రధాని

"దేశం ఒక గొప్ప న్యాయవాదిని, నాయకుడిని కోల్పోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా"

– జస్టిస్ రంజన్ గొగొయి, సుప్రీంకోర్టు ప్రధాన న్యా

సంస్కరణాభిలాషి

అరుణ్ జైట్లీ అస్తమించినప్పటికీ.. ఆయన వదలిన సంస్కరణల ముద్రలు మాత్రం భారత్‌లో ఉదయిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా జీఎస్‌టీ అమలును చెప్పుకోవాలి. ఒకే దేశం.. ఒకే పన్ను కోసం మోదీ 1.0 ప్రభుత్వం తలపెట్టిన కార్యాన్ని నెత్తికెత్తుకుంది ఈయనే. బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బకాయిల ప్రక్షాళనకావించిన జైట్లీ తన హయాంలో పలు విజయాలను తన ఖాతాలో వేసుకున్నారు. అదే సమయంలో వృద్ధి మందగమనం రూపంలో అతిపెద్ద వైఫల్యాన్నీ మూటగట్టుకున్నారు. ఆయన పరమపదించిన తరుణంలో ఆర్థిక మంత్రిగా జైట్లీ చేపట్టిన కొన్ని ప్రధాన సంస్కరణలను స్మరించుకుందాం.

ఈనాడు బిజినెస్ వారాంతం



ఈనాడు వాణిజ్య విభాగం

రెండేళ్ల కిందట.. అది జీఎస్‌టీ మండలి 23వ సమావేశం. భాజపా, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కూర్చుని ఉన్నారు. అయితే సమావేశం కాస్తా పక్కదారి పట్టింది. అటు నుంచి.. ఇటు నుంచి వాగ్బాణాలు వెళ్లాయి. చివరకు ఎటువంటి ఏకాభిప్రాయం లేకుండా సమావేశం ముగుస్తుందేమో అనుకున్నారు. అపుడే జైట్లీ గట్టిగా.. మర్యాద పూర్వకంగా 'రాజకీయాలు బయట చేసుకోండి.. లోపల కాదు' అంటూ స్వరం పెంచి చెప్పారు. దీంతో ఇరు వర్గాలు వెనక్కి తగ్గాయి. ఇదంతా ఎందుకంటే.. మోదీ ప్రభుత్వంలో చేపట్టిన పలు సంస్కరణల అమలులో ఆయనది ఎంత కీలక పాత్ర అని చెప్పడానికే. ముఖ్యంగా జీఎస్‌టీ అమలు ఆయన రాజకీయ జీవితంలోనే గొప్ప విజయంగా చెప్పవచ్చు. ఇలాంటివి మరికొన్ని కూడా ఆర్థిక మంత్రిగా ఉన్న హయాంలోనే చేపట్టారు.

మోదీ ఓ వైపు సంస్కరణలను తీసుకురావాలని తలపోయడం ఒక ఎత్తైతే వాటిని.. పార్లమెంటులో ఆమోదింపజేసేలా జైట్లీ చేయడం మరో ఎత్తని చెప్పవచ్చు. ఎందుకంటే రాజ్యసభలో ఎన్‌డీఏకు సరైన మెజారిటీ లేదు. అయినప్పటికీ.. జీఎస్‌టీ, దివాలా బిల్లులను నెగ్గుకొచ్చేలా చేశారు. ముఖ్యంగా జీఎస్‌టీ విషయంలో అందరి మధ్య సయోధ్య కుదరడానికి జైట్లీనే కారణం. ఎందుకంటే తమ ద్రవ్యశక్తులను వదలుకోవడానికి రాష్ట్రాలు అంత సులభంగా ఒప్పుకోవని అందరికీ తెలుసు. అందుకేగా.. 17 ఏళ్ల పాటు జీఎస్‌టీ కోసం వేచిచూడాల్సి వచ్చింది. ఇదే తరహా పరిస్థితుల్లో ప్రణబ్ ముఖర్జీ, చిదంబరంలు ఏకాభిప్రాయాన్ని సాధించడంలో విఫలమైన చోటే జైట్లీ నెగ్గుకురావడం విశేషం. 'ఇతరుల అభిప్రాయాలకు ఆయన చాలా విలువ ఇస్తారు. కూర్చుని చెప్పేదంతా వింటారు. పూర్తి సమావేశం అంతా ఉంటారు. ఎపుడూ సంయమనాన్ని కోల్పోర'ని అప్పట్లో ఒక రాష్ట్ర ఆర్థిక మంత్రి జీఎస్‌టీ సమావేశాల సందర్భంగా పేర్కొన్నారంటే.. జైట్లీ కార్యదక్షతను అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో గీత దాటే వారిని అదుపులో ఉంచడమూ జైట్లీకి తెలుసంటారు. ఒకానొక సమయంలో ఒక రాష్ట్ర ఆర్థిక మంత్రి బాగా విసిగించారు. దీంతో కొంచెం స్వరం పెంచి.. 'కేంద్రమేమీ జీఎస్‌టీ కోసం వెంపర్లాడడం లేదు. అది(జీఎస్‌టీ) దేశానికి మంచిది. ఒక వేళ మీకు(రాష్ట్రాలకు) భారీ స్థాయిలో సమస్యలుంటే.. మరో 5-10 ఏళ్లు వాయిదా వేద్దామ'ని అనడంతో.. ఇక అందరూ మౌనం వహించక తప్పలేదు.

అయితే కొన్ని సార్లు ఆయన కింద పనిచేసే అధికారుల విషయంలో గట్టిగా లేకపోవడం వల్ల కొన్ని అంశాలు ఈయన దృష్టికి రాకపోవడం. . తదనంతరం తీవ్ర పరిణామాలు చోటు చేసుకోవడం వంటివి జరిగాయి. ఉదాహరణకు రైతుల ఆందోళనలను చెప్పుకోవచ్చు. ఎందుకంటే ప్రభుత్వం గద్దెనెక్కక ముందే ఈ సమస్య ఉంది. ఈ నేపథ్యంలో జైట్లీ బృందంలోని ఆర్థికవేత్తలు ఈ విషయంలో సరైన సలహాలను ఇచ్చి ఉండే బాగుండేదని కొంత మంది అభిప్రాయపడుతుంటారు.

జైట్లీ హయాంలో కొన్ని సంస్కరణలు

జీఎస్‌టీ

వస్తువులు, సేవల పన్ను(జీఎస్‌టీ) విషయంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడం అరుణ్ జైట్లీ అతి పెద్ద విజయం. దేశం మొత్తాన్ని ఒకే పన్ను కిందకు తీసుకురావడానికి ఉభయ సభల్లో బిల్లు ఆమోదంలోనూ మోదీకి మంచి చేయూతనిచ్చారు. ఆ తర్వాత తన అధ్యక్షతన జరిగిన లెక్కకు మించిన జీఎస్‌టీ మండలి సమావేశాల్లో శ్లాబుల నుంచి పలు అంశాల్లో సవరణలు చేసే విషయంలో, వాటిపై అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరించి.. అందరికీ సానుకూలంగా ఉండే నిర్ణయాలు తీసుకోవడం సఫలం అయ్యారు.

దివాలా స్మృతి

బ్యాంకింగ్ వ్యవస్థలో దివాలా కోసం ఉన్న పలు వ్యవస్థలన్నిటినీ ఒకే చట్టం కిందకు తీసుకొచ్చారు. సంక్లిష్టతలను తగ్గించారు. మొండి బకాయిల వసూలును సరళతరం చేశారు. ఇటీవల దీనికి మరికొన్ని సవరణలూ చేపట్టి.. కంపెనీలకు మరింత వెసులుబాటు కల్పించారు. మొత్తం మీద జైట్లీ హయాంలో వచ్చిన ఈ బిల్లు ప్రారంభం నుంచి అమలు వరకూ ఆయన కీలక పాత్ర పోషించారు.

జన్‌ధన్

బ్యాంకింగ్ సేవలను మూలమూల్లోకీ విస్తరించడమే ధ్యేయంగా చేపట్టిన ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన ద్వారా పల్లెసీమల్లో అత్యధికంగా ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఇక ఆధార్ ఆధారంగా 55 సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు నేరుగా నగదు బదిలీ చేశారు. దీని వల్ల రూ.లక్ష కోట్ల వరకు ప్రజాధనం పక్కదార్లు పట్టకుండా కాపాడినట్లు తెలుస్తోంది.

సీఎండీ పోస్టు విభజన

ఆర్థిక వ్యవస్థలో మార్పులను ముందుగానే ఊహించిన జైట్లీ.. పీజే నాయక్ కమిటీ సిఫారసులను అమలు చేశారు. బ్యాంకు బోర్డుల్లో పలు సంస్కరణలు చేపట్టారు. సీఎండీ పోస్టును విభజించడంతో పాటు.. డైరెక్టర్లు, బ్యాంకు అధిపతుల నియామకం కోసం బ్యాంక్ బోర్డ్స్ బ్యూరో(బీబీబీ)ను ఏర్పాటు చేశారు. ఆర్‌బీఐకి తోడుగా కొత్త నియంత్రణ సంస్థల వైపు కూడా ఆయన మొగ్గుచూపారు.

ద్రవ్యలోటు

జైట్లీ హయాంలో ద్రవ్యలోటు నియంత్రణలోనే ఉంది. అయితే లక్ష్యమైన 3 శాతాన్ని ఎపుడూ చేరలేదు. మధ్యంతర బడ్జెట్‌లో మాత్రం 3.4 శాతానికి చేర్చగలిగారు. ప్రధాని నిర్దేశించిన ద్రవ్యోల్బణ లక్ష్యాలను సాధించగలిగారు. ఆయన పగ్గాలు చేపట్టిన సమయంలో ద్రవ్యోల్బణం 7.72 శాతంగా ఉండగా.. అనారోగ్యం కారణంగా తాత్కాలికంగా పక్కకు తప్పుకునే సమయానికి 2.92 శాతానికి చేరింది.

విజయవంతమైన అంశాలను పక్కనపెడితే ఎన్‌బీఎఫ్‌సీల మొండి బకాయిలను ఒక దారికి తీసుకువచ్చే కార్యక్రమాన్ని అసంపూర్తిగానే వదిలి వెళ్లారు. వైఫల్యాల విషయానికొస్తే వృద్ధిని పరుగులు తీయించలేకపోయారు. మందగమనానికి అడ్డుకట్టవేయలేకపోయారు. ఒక దశలో 8% పైన నమోదైన వృద్ధి ప్రస్తుతం 7% దిగువకు చేరుకుంది. అయితే ఈ మందగమనాన్ని జైట్లీకే అంటగట్టలేం. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, అంతర్జాతీయ మందగమనం, అధిక కమొడిటీ, ముడి చమురు ధరలు కూడా మందగమనానికి కారణాలుగా పనిచేశాయి.

విజయాలు

- జీఎస్‌టీ, దివాలా బిల్లు వంటి సంస్కరణల అమలు
- ద్రవ్యోల్బణం 7.7% నుంచి 2.9%కి పరిమితం
- ద్రవ్య నియంత్రణ చర్యలు
- బ్యాంకుల్లో మొండి బకాయిల ప్రక్షాళన
- జన్‌ధన్ ఖాతాలు • స్థిరాస్తి బిల్లు
- సంక్షేమ పథకాలకు ఆధార్ ఆధారిత ప్రత్యక్ష నగదు బదిలీ
- నాయక్ కమిటీ సిఫారసుల అమలు

జైట్లీ బడ్జెట్లు..

మే 2014న తిరుగులేని మెజారిటీతో ఎన్‌డీఏ గద్దెనెక్కిన తర్వాత జులై 10, 2014న అరుణ్ జైట్లీ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత నాలుగేళ్ల పాటు పూర్తి స్థాయి బడ్జెట్లు ప్రవేశపెట్టారు.

నోట్ల రద్దు, జీఎస్‌టీ.. ఈ రెండూ భారత వ్యాపార వర్గాలను ఇబ్బంది పెట్టిన మాట వాస్తవం. అటు చిన్న కంపెనీల నుంచి ఇటు పెద్ద కంపెనీల వరకూ ఒత్తిడికి లోనయ్యాయి. అయితే జైట్లీ తన బడ్జెట్లలో సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు ఊరటనిచ్చారు. కార్పొరేట్ పన్ను కోతల విషయంలో పెద్ద కంపెనీల మాత్రం కాస్త వేచిచూసేలా చేశారు. ఇక.. భారత్‌లో సులువుగా వ్యాపారాన్ని నిర్వహించుకోవడానికి పలు సంస్కరణలూ ఆయన చేపట్టారు. ఆయా బడ్జెట్లలో వ్యాపార వర్గాలను ఆయన ఎలా చూసుకున్నారంటే..

- ఆయన తొలి బడ్జెట్(2014)లోనే బీమా, రక్షణ రంగాల్లో విదేశీ పెట్టుబడుల పరిమితిని 26 శాతం నుంచి 49 శాతానికి పెంచారు.
- 2015-16 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును దశలవారీగా(నాలుగేళ్లలో) 30 శాతం నుంచి 25 శాతానికి పరిమితం చేస్తామని ప్రతిపాదించారు. (అమలు చేశారు కూడా.) 2015-16 బడ్జెట్లోనే పన్ను ఎగవేత చర్యలను ప్రవేశపెట్టారు. తదుపరి ఆర్థిక సంవత్సరం దివాలా స్మృతిని తీసుకొస్తామని ప్రకటించారు. ఎస్ఎమ్ఈలకు అవసరమయ్యే రుణాల కోసం రీఫైనాన్స్ ఏజెన్సీ అయిన ముద్రాను ఏర్పాటు చేయడం గొప్ప అడుగు.
- 2016-17 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 29 శాతానికి పరిమితం చేశారు. మార్చి 1, 2016 తర్వాత ఏర్పాటైన తయారీ కంపెనీలు ఎటువంటి లాభాలను ఆర్జించని పక్షంలో 25 శాతం పన్నునూ ఎంచుకునే వీలును కల్పించారు. ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత సరళీకరించారు. బీమా, పింఛను, అసెట్ రీ కన్‌స్ట్రక్షన్ కంపెనీలు(ఏఆర్‌సీలు), స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఎఫ్‌డీఐ పరిమితిని పెంచారు.
- 2017-18లో కార్పొరేట్ పన్నును 25 శాతానికి పరిమితం చేశారు. రూ.50 కోట్లు మించని టర్నోవరున్న దేశీయ కంపెనీలకు దీనిని వర్తింపజేశారు. విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహ కాల బోర్డు(ఎఫ్ఐపీబీ)ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిందీ ఈ బడ్జెట్లోనే.
- 2018-19 బడ్జెట్లో కార్పొరేట్ పన్ను రేటును రూ.250 కోట్ల వరకు ఉన్న కంపెనీలకు పొడిగించారు. దీంతో పెద్ద కంపెనీలకు సైతం ఊరట కలిగింది.

'విలువలకు కట్టుబడిన, దేశానికి నిబద్ధతతో సేవలందించిన గొప్ప వ్యక్తి జైట్లీ. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నాను'

- ఆనంద్ మహీంద్రా, ఛైర్మన్, మహీంద్రా గ్రూపు

'జైట్లీ మంచి వక్త. గొప్ప పార్లమెంటేరియన్, సంస్కరణలను విజయవంతంగా అమల్లోకి తేవడంలో దిట్ట. అన్ని వర్గాల ప్రజలతో కలిసిపోయే మనస్తత్వం ఉన్న మానవతావాది.

- గౌతమ్ అదానీ, ఛైర్మన్, అదానీ గ్రూపు



'దేశం ఓ మంచి రాజకీయ నాయకుడ్ని కోల్పోయింది. విధాన నిర్ణయాల విషయంలో అవసరమైతే విపక్షాలను కూడా ఒప్పించి ఏకతాటికి తేగల సమర్థత ఉన్న నేత.

- సునీల్ భారతీ మిత్తల్, ఛైర్మన్, భారతీ ఎయిర్‌టెల్



'దేశం అత్యుత్తమ నేతల్లో ఒకరిని కోల్పోయింది. జీఎస్‌టీ లాంటి కీలక సంస్కరణల అమలులో ఆయన పోషించిన పాత్రను దేశం ఎప్పటికీ మర్చిపోదు. ఒకేసారి రెండు కీలక మంత్రిత్వశాఖలను నిర్వహించడం ఆయన కార్యదక్షతకు నిదర్శనం.

- దీపక్ పరేఖ్, ఛైర్మన్, హెచ్‌డీఎఫ్‌సీ

'చురుకైన, గొప్ప రాజకీయ నేత జీవితం ఇంత త్వరగా ముగిసిపోవడం నిజంగా విషాదకరం. దేశాభివృద్ధికి ఆయన సేవల అవసరం ఇంకా ఉంది'

- కిరణ్ మజుందార్ షా, ఛైర్‌పర్సన్, బయోకాన్

'పార్టీకే కాదు, దేశానికి కూడా జైట్లీ లేని లోటు పూడ్చలేనిది. రాజకీయ, న్యాయ, ఆర్థిక, విదేశీ వ్యవహారాల్లో ఆయనకున్న అపార అనుభవం రీత్యా ఓ గొప్ప దూరదృష్టి ఉన్న వ్యక్తిగా జైట్లీ కనిపిస్తారు.

- అనిల్ అగర్వాల్, ఛైర్మన్, వేదాంతా

'దేశ రాజకీయాల్లో జైట్లీ ఓ మహనీయ వ్యక్తి. భారత చట్టాలు, చరిత్ర దగ్గర నుంచి దేశానికి సంబంధించి ఎలాంటి విషయాల పైనైనా పార్లమెంటులో జరిగే చర్చల్లో ఆయన ఉపన్యసించే తీరు అద్భుతం.

- ఆశిష్ కుమార్ చౌహాన్, ఎండీ, సీఈఓ, బీఎస్‌ఈ

'గొప్ప పార్లమెంటేరియన్, అద్భుత న్యాయవాది, మంచి నేత, అన్నింటికి మించి గొప్ప మానవతావాది. ఆయన మృతిపై ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఆయన కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను'

- సంజీవ్ మెహతా, ఛైర్మన్, ఎండీ, హెచ్‌యూఎల్

౯, ౯(సి)లను రద్దు చేయాలి

జీఎస్‌టీ వార్షిక రిటర్న్‌లపై

తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్

హైదరాబాద్ (గన్‌ఫౌండ్రీ), న్యూస్‌టుడే: జీఎస్‌టీ వార్షిక రిటర్న్‌లకు సంబంధించి 1, 2, 3లను అమలు చేయకుండా 9, 9(సి)లను దాఖలు చేయడం వల్ల జీఎస్‌టీ చట్టం లక్ష్యం నీరుగారిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది జీఎస్‌టీ వార్షిక రిటర్న్-9, 9(సి)లలో ఉన్న లోపాలను సవరించకుండా దాఖలు చేయడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపింది. అందువల్ల వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. రిటర్న్ దాఖలుకు డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పొడిగించాలని కోరింది. గన్‌ఫౌండ్రీలోని సంఘం కార్యాలయంలో శనివారం తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నగేశ్ రంగి, కార్యదర్శి విఠల్ రామరాజు, కోశాధికారి డి.వసంతకుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. జీఎస్‌టీ వార్షిక రిటర్న్స్‌కు సంబంధించి 1, 2 దాఖలు చేసిన తర్వాతే 3 ఫారం దాఖలు చేయాల్సి ఉండగా 2, 3లు వాడుకలో లేకుండా చేశారని చెప్పారు. దీంతో పన్నులు కట్టిన వారే మళ్లీ మళ్లీ కట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. చిరు వ్యాపారులు, వినియోగదారులకు కూడా తీవ్ర నష్టం చేకూరుతోందన్నారు.

పన్ను ఎగవేసి విదేశాలకు తరలించారు

నరేశ్ గోయెల్‌పై ఈడీ ఆరోపణలు

దిల్లీ: జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయెల్ పలు పన్ను ఎగవేత పథకాలను సృష్టించి తద్వారా వచ్చిన భారీ నిధులను విదేశాలకు తరలించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆరోపించింది. గోయెల్‌కు సంబంధించి ముంబయి, దిల్లీలలో ఉన్న పలు కంపెనీలు, నివాస ప్రాంతాలు, భాగస్వాములకు చెందిన సంస్థల్లో ఈడీ శుక్రవారం సోదాలు నిర్వహించింది. అందులో గోయెల్‌కు చెందిన ముంబయి నివాసం, గ్రూప్ కంపెనీలు, వాటి డైరెక్టర్లు, అధికారులకు చెందిన నివాస, అధికార కార్యాలయాలున్నాయి. 'పలు పత్రాలు, డిజిటల్ సాక్ష్యాలను ఈ సోదాల సందర్భంగా జప్తు చేశాం. ఆయా పత్రాలపై తదుపరి దర్యాప్తు, విశ్లేషణ జరుగుతోంద'ని ఈడీ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం చూస్తే 'గోయెల్ తన విదేశీ, దేశీయ కంపెనీల్లో పన్ను ఎగవేత పథకాలను సృష్టించారు. ఆ తర్వాత మోసపూరిత, అనుమానిత లావాదేవీలు జరిపారు. వాటిని విదేశాలకు తరలించార'ని అందులో తెలిపింది. విదేశాల్లోని పలు కంపెనీలను ఆయన 'పరోక్షం'గా నియంత్రిస్తున్నారని.. అందులో కొన్ని దేశాలు పన్ను విషయంలో స్వర్గధామాలని ఈడీ తెలిపింది. 'ఆయా కంపెనీల్లో అనుమానిత, భారీ చెల్లింపులు కనిపిస్తున్నాయి. వివిధ విమాన లీజు ఒప్పందాలు, విమాన నిర్వహణ ఒప్పందాల పేరిట అవి జరిగాయి. దుబాయ్‌లోని తన సొంత గ్రూప్ కంపెనీ(ఇది ప్రత్యేక విదేశీ విక్రయ ఏజెంట్‌గా కంపెనీ కోసం పనిచేస్తోంది)కి పెంచి చూపిన కమీషన్ రూపంలో భారీ మొత్తాలు విదేశాలకు తరలించార'ని వివరించింది.

విదేశీ బ్యాంకుల్లోని కొన్ని ఖాతాల్లో జమ అయిన భారీ మొత్తాలకు గోయెల్ యజమాని కావొచ్చని దర్యాప్తులో తెలుస్తోందని ఈడీ అంటోంది. మొత్తం మీద ఈ లావాదేవీలన్నీ ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా) కింద వివిధ ఉల్లంఘనలకు పాల్పడినట్లు కూడా కనిపిస్తోందని వివరించింది. కాగా, ప్రస్తుతం దివాలా చట్టం కింద జెట్ ఎయిర్‌వేస్‌కు సంబంధించి పరిష్కార ప్రక్రియ నడుస్తోంది.

ఈక్విటీలు, డెరివేటివ్ లాభాలపై సర్‌ఛార్జీ ఉండదు

దిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు(ఎఫ్‌పీఐ) అటు ఈక్విటీ, ఇటు డెరివేటివ్స్ విభాగాలపై పొందే మూలధన లాభాలపై విధించిన అదనపు సర్‌ఛార్జీని తొలగిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా చేయడం కోసం శుక్రవారం కేంద్రం పలు చర్యలను ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా బడ్జెట్‌లో విదేశీ, దేశీయ ఈక్విటీ మదుపర్లపై విధించిన 'సూపర్ రిచ్' పన్నును ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, శనివారం దీనిపై ఒక అధికారిక ప్రకటనలో స్పష్టతనిచ్చారు.

- డెరివేటివ్స్(ఫ్యూచర్లు, ఆప్షన్లు)ను మూలధన ఆస్తిగా పరిగణించమని.. డెరివేటివ్ బదిలీ ద్వారా వచ్చే ఆదాయాన్ని వ్యాపారాదాయంగా లెక్కవేస్తామని.. కాబట్టి దానిపై దేశీయ మదుపర్లకు సాధారణ పన్ను రేటు వర్తిస్తుందని ఆ అధికారిక ప్రకటన వెల్లడించింది.

ప్రభుత్వం స్పష్టీకరణ

- అయితే ఎఫ్‌పీఐల విషయంలో మాత్రం డెరివేటివ్‌లను మూలధన ఆస్తిగా పరిగణించి.. వాటి బదిలీపై వచ్చే లాభాలను మూలధన లాభాలుగా పరిగణిస్తారని.. కాబట్టి ఆదాయ పన్ను చట్ట నిబంధనల కింద ప్రత్యేక పన్ను రేటు వర్తిస్తుందని కూడా తెలిపింది.
- 'మొత్తం మీద చూస్తే.. ఎఫ్‌పీఐలు చేసే డెరివేటివ్‌ల బదిలీ ద్వారా వచ్చే లాభాలపై ప్రత్యేక పన్ను రేటు వర్తిస్తుంది. అదే సమయంలో సర్‌ఛార్జీ వాటిపై వర్తించద'ని ఆ ప్రకటన తెలిపింది. కానీ.. ఎఫ్‌పీఐలు కాకుండా ఇతరులకైతే డెరివేటివ్‌ల బదిలీ ద్వారా వచ్చే వ్యాపారాదాయంపై సాధారణ పన్నుపై అదనపు సర్‌ఛార్జీనీ కట్టాల్సి ఉంటుందని వివరించారు.

2019-20 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు పన్ను వర్తించే ఆదాయంపై సర్‌ఛార్జీని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచారు. ఇక రూ.5 కోట్లపైబడిన పన్ను వర్తించే ఆదాయంపై సర్‌ఛార్జీని 15 శాతం నుంచి 37 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. మరోవైపు అంకురాలకు ఏంజెల్ పన్ను నుంచి మినహాయింపునివ్వడం, వాహన రంగానికి ప్యాకేజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70,000 కోట్ల తక్షణ మూలధన సహాయం వంటివి శుక్రవారం ప్రకటించిన చర్యల్లో ఉన్న విషయం విదితమే.

24న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	310	గోదావరి	332
చిల్లరగా (ఒక గుడ్డు)	3.70	వరంగల్	313
బెంగళూరు	325	విశాఖపట్నం	361
25వ తేదీకి		చెన్నై	345
విజయవాడ	332	చిత్తూరు	338
		నమక్కల్	340

రేపటి సంచికలో ప్రచురితమవుతుంది

ఛాంపియన్

సరికొత్త చరిత్ర సృష్టించేందుకు.. భారత బ్యాడ్మింటన్ స్వర్ణయుగంలో తనపేరును సువర్ణాక్షరాలతో లిఖించుకునేందుకు.. తెలుగు తేజం పూసర్ల వెంకట సింధు ముందు మరో అవకాశం వచ్చి వాలింది. ఆకలి మీద ఉన్న పులిలా ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో దూసుకెళ్తోన్న ఆమె.. ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీస్‌లో చైనా క్రీడాకారిణి చెన్ యూ ఫీని చిత్తుచేసి ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో వరుసగా మూడోసారి ఫైనల్లో అడుగు పెట్టింది. గత రెండు పర్యాయాల్లో చివరి మెట్టుపై తడబడిన ఆమె.. ఈ సారైనా పసిడి సాధిస్తుందా.. ప్రపంచ ఛాంపియన్‌గా నిలుస్తుందా అన్నది ఆది వారం తేలిపోనుంది. మరోవైపు సెమీస్‌లో ఓడిన భమిడిపాటి సాయిప్రణీత్ కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.

మూడోసారి.. పసిడి గురి

ప్రపంచ బ్యాడ్మింటన్

- హ్యాట్రిక్ ఫైనల్లో సింధు
- నేడు ఒకుహరతో టైటిల్ పోరు
- సాయి ప్రణీత్‌కు కాంస్యమే

బాసెల్ (స్విట్జర్లాండ్)

భారత అగ్రశ్రేణి షట్లర్ పీవీ సింధు మరోసారి అద్భుతం చేసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ అనగానే పతాక స్థాయి ఆటతో చెలరేగిపోయే ఆమె.. టోర్నీలో మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయిన సింధు.. ఆ కసినంతా ఈ టోర్నీలో ప్రదర్శిస్తూ.. ప్రత్యర్థులను చిత్తుచేస్తూ.. పసిడిపోరుకు సిద్ధమైంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో ఐదో సీడ్ సింధు 21-7, 21-14 తేడాతో ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్, ప్రపంచ మూడో ర్యాంకర్ చెన్ యూ ఫీని వరుస గేమ్‌ల్లో చిత్తుచేసింది. కేవలం 40 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్ పోరాటం ముగిసింది. సెమీస్‌లో అతను 13-21, 8-21తో ప్రపంచ నంబర్‌వన్ కెంటొ మొమొట (జపాన్) చేతిలో పరాజయం చవిచూశాడు. ఈ ఓటమితో అతను కాంస్యానికే పరిమితమైనప్పటికీ.. అతను 36 ఏళ్ల తర్వాత ఈ ఛాంపియన్‌షిప్‌లో పతకం నెగ్గిన భారత పురుష షట్లర్‌గా రికార్డులకెక్కాడు. 1983లో ప్రకాశ్ పదుకొనే కాంస్యం గెలిచాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు అదే తొలి పతకం.

అదే జోరు

క్వార్టర్స్‌లో రెండో సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపే)పై పోరాడి గెలిచిన సింధు.. సెమీస్‌లో పూర్తి ఆధిపత్యం చలాయించింది. ఈ మ్యాచ్ ముందు వరకు చెన్‌తో తలపడిన గత ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదింట్లో నెగ్గిన సింధు మరోసారి పైచేయి సాధించింది. తొలి గేమ్‌ను దూకుడుగా ఆరంభించింది. క్రాస్‌కోర్టు షాట్లు, స్మాష్‌లు, సుదీర్ఘ ర్యాలీలు.. ఇలా అన్నిటా ఆమెదే హవా. గేమ్ ఆరంభంలోనే 4-1తో ఆధిక్యం సంపాదించిన సింధు.. ప్రత్యర్థికి పెచ్చరికలు పంపింది. 11-3 ఆధిక్యంతో విరామానికి వెళ్లింది. ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడిన ఆమె 14-4తో గేమ్ విజయం దిశగా పరుగులు పెట్టింది. కేవలం 15 నిమిషాల్లోనే సింధు 21-7తో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్ ఆరంభంలో చెన్ నుంచి సింధుకు ప్రతిఘటన ఎదురైంది. పోటీలో నిలవాలని పోరాడిన చెన్ ప్రయత్నాలను విఫలం చేసిన సింధు ముందంజ వేసింది. మొదట స్కోరు 3-3తో సమమైంది. మ్యాచ్‌లో సింధుకు పోటీ ఎదురైంది ఆ కొద్దిసేపే. ప్రత్యర్థిని పొరపాట్లు చేసేలా ఉసిగొల్పి పాయింట్లు నెగ్గిన ఆమె 10-6తో ఆధిక్యం సాధించింది. నిలకడ కొనసాగించి 18-9తో విజయానికి చేరువైంది. ఆ దశలో చెన్ వరుసగా పాయింట్లు నెగ్గిన కూడా సింధుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా పోయింది. 20-14తో నిలిచిన ఆమె గేమ్ పాయింట్ సాధించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

"ఆనందంగా ఉన్నా. కానీ ఇంకా సంతృప్తి చెందలేదు. ఇంకో మ్యాచ్ ఆడాల్సి ఉంది. కచ్చితంగా స్వర్ణం గెలవడం కోసమే ప్రయత్నిస్తా. కానీ అదంత సులభం కాదు. ఒకుహరతో గత కొంతకాలంగా తలపడుతూనే ఉన్నా. మ్యాచ్ రోజు ఏమైనా జరగొచ్చు. నా ఆటపై దృష్టి పెట్టి అత్యుత్తమ ప్రదర్శన చేస్తా"
– సింధు

ఒత్తిడికి తలొగ్గి

ప్రి క్వార్టర్స్, క్వార్టర్స్‌లో తనకంటే మెరుగైన క్రీడాకారులను ఓడించి సెమీస్ చేరిన ప్రణీత్.. సెమీస్‌లో మాత్రం తడబడ్డాడు. టాప్ సీడ్ మొమొటకు తలొగ్గి ఓటమి పాలయ్యాడు. వరుసగా భారీ మ్యాచ్‌లు ఆడడం వల్ల అలసట చెందిన ప్రణీత్ ప్రత్యర్థి ధాటికి నిలవలేకపోయాడు. వరుస గేమ్‌ల్లో ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. తొలి గేమ్‌ను 5-3 ఆధిక్యంతో ఆరంభించిన ప్రణీత్ ఆ తర్వాత తడబడ్డాడు. మొమొట లయ అందుకోవడంతో ప్రణీత్‌కు ఇబ్బందులు తప్పలేవు. ఓ దశలో 10-15తో వెనకబడ్డ అతను తిరిగి పుంజుకునేలా కనిపించలేదు. అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. 12-18తో ఉన్నపుడు వరుసగా మూడుసార్లు షటిల్‌ను నెట్‌కు కొట్టి గేమ్ కోల్పోయాడు. రెండో గేమ్‌లోనూ అసౌకర్యంగా కనిపించిన అతను పూర్తిస్థాయి ఆటతీరు ప్రదర్శించలేకపోయాడు. పదే పదే షటిల్‌ను నెట్‌కు కొట్టి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కోల్పోయాడు.

స్వర్ణ సంబరం.. ఈసారైనా?

ఫైనల్ సింధు × ఒకుహర (జపాన్)
ఉదయం 11 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఈనాడు క్రీడావిభాగం

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సింధు ప్రస్థానం అసాధారణం. ప్రకాశ్ పదుకొనే కాంస్యం నెగ్గాక మరో పతకం కోసం మూడు దశాబ్దాలు సాగిన నిరీక్షణకు 2013లో తెరదించుతూ కాంస్యం నెగ్గిన ఆమె.. ఆ తర్వాత ఇంకో మూడు పతకాలు కొల్లగొట్టి పౌరా అనిపించింది. ఇప్పటికే ఈ టోర్నీలో సింధు ప్రదర్శన అద్భుతం. కానీ నాలుగు పతకాలు గెలిచినా.. స్వర్ణం సాధించే సత్తా ఉండి కూడా ఆ ముచ్చట తీర్చుకోక పోవడం మాత్రం నిరాశ కలిగించే విషయమే. గత రెండు పర్యాయాలూ ఫైనల్లో గొప్పగా పోరాడినా.. చివరి దశలో తడబడి రజతాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఒకసారి పసిడి చేజారినా.. నిరాశ చెందకుండా మళ్లీ దానికి చేరువగా వెళ్లడం.. మళ్లీ ఎదురు దెబ్బ తగిలినా.. వెరవకుండా మూడో పర్యాయం ఫైనల్ చేరడం చిన్న విషయం కాదు. మరి ఈసారైనా ఆమె పసిడి కల నెరవేర్చుకుంటుందా లేదా అన్నది చూడాలి. ఆదివారం తుదిపోరులో సింధు.. ఒకుహరతో తలపడనుంది. ఇప్పటి వరకు ఆమెతో పోటీపడిన మ్యాచ్‌ల్లో 8-7తో సింధూదే పైచేయి. 2017 ప్రపంచ ఛాంపియన్‌షిప్ తుదిపోరులో సింధు.. ఒకుహర చేతిలోనే ఓడింది. తొలిసారి ఆ ప్రతిష్ఠాత్మక టోర్నీ ఫైనల్ చేరి టైటిల్‌కు అత్యంత చేరువగా వెళ్లిన ఆమెకు నిరాశను మిగిల్చింది జపాన్ స్టార్. మళ్లీ రెండేళ్ల తర్వాత సింధును అడ్డుకోవడానికి ఆమె సిద్ధమవుతోంది. ఈసారి ఒకుహరను మట్టికరిపించి పసిడి కల నెరవేర్చుకోవడమే కాదు.. 2017 పరాజయానికి ప్రతీకారం కూడా తీర్చుకోవాలని చూస్తోంది సింధు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సింధు, ఒకుహర మధ్య జరిగిన రెండు మ్యాచ్‌ల్లో చెరో విజయం సాధించారు. అయితే ప్రపంచ స్థాయి వేదికలపై అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించే సింధు.. ఫైనల్‌కు రాగానే తడబడుతుంది. గత కొన్నేళ్లలో ఆమె ఎన్నోసార్లు తుదిమెట్టుపై బోల్తాపడడం చూశాం. కష్టపడకుండానే తలొంచుతుందా అంటే అదీ కాదు. ప్రాణం పెట్టి పోరాడుతుంది. కానీ ఫలితం మాత్రం ఆమెకు అనుకూలంగా రావడం లేదు. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచేందుకు వచ్చిన మరో అవకాశాన్ని రెండు చేతులారా అందుకొని సగర్వంగా పసిడిని ధరించాలి అంటే ఆమె ఆ ఫైనల్ పోబియాను వీడాల్సిందే. ఆ బలహీనతను అధిగమించి సింధు విశ్వవిజేతగా నిలిస్తే అంతకంటే ఆనందం ఇంకేముంటుంది?

లేథమ్ అజేయ శతకం

లంకతో రెండో టెస్టులో కివీస్ 196/4

కొలంబో: టామ్ లేథమ్ (111 బ్యాటింగ్; 184 బంతుల్లో 10×4) అజేయ సెంచరీ సాధించడంతో శ్రీలంకతో రెండో టెస్టులో న్యూజిలాండ్ ఆధిక్యం దిశగా సాగుతోంది. మూడో రోజు ఆట ఆఖరికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 196 పరుగులు చేసింది. లేథమ్‌తో పాటు వాట్లింగ్ (25) క్రీజులో ఉన్నాడు. విలియమ్సన్ (20), రాస్ టేలర్ (23) విఫలమయ్యారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 144/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక.. 244 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (109; 109 బంతుల్లో 16×4, 2×6) సెంచరీ సాధించాడు. సౌథీ (4/63), బౌల్ట్ (3/75) ప్రత్యర్థిని కట్టడి చేశారు.

మళ్లీ ఐపీఎల్‌కు రాయుడు!

చెన్నై: క్రికెట్లో అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన అంబటి రాయుడు.. మళ్లీ ఐపీఎల్‌లో కనిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు సీజన్లలో చెన్నైకి ప్రాతినిధ్యం వహించిన రాయుడు.. ప్రస్తుతం తమిళనాడు దేశవాళీ లీగ్‌లో ఆడుతున్నాడు. "ప్రపంచకప్ కోసం నాలుగేళ్లు శ్రమించా. రిటైర్మెంట్ నిర్ణయం ఉద్వేగంతో కాదు, నిరాశతో తీసుకున్నది. కష్టపడినా ఫలితం దక్కనప్పుడు అదే భావన కలుగుతుంది. తర్వాత ఆలోచించా. మళ్లీ క్రికెట్ ఆడాలనుకున్నా. ప్రస్తుతం తమిళనాడు సూపర్ లీగ్‌లో ఆడుతున్నా" అని రాయుడు చెప్పాడు.

ఫెదరర్‌తో సుమీత్ ఢీ

న్యూయార్క్: భారత యువ టెన్నిస్ ఆటగాడు సుమీత్ నగాల్‌కు అరుదైన అవకాశం.. స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌తో పోటీపడే ఛాన్స్! సోమవారం ప్రారంభమయ్యే యుఎస్ ఓపెన్లో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో సుమిత్.. ఫెదరర్‌తో ఆడనున్నాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ ఆఖరి రౌండ్లో నగాల్ 5-7, 6-4, 6-3తో జోవో మెనెజెస్ (బ్రెజిల్)ను ఓడించాడు. సుమిత్ ఈ దశాబ్ద కాలంలో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మొయిన్ డ్రాకు అర్హత సాధించిన ఐదో భారత సింగిల్స్ ఆటగాడిగా నిలిచాడు. సోమ్‌దేవ్‌వర్మన్, యుకి బాంబ్రి, సాకేత్ మైనేని, ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఈ అవకాశాన్ని సంపాదించారు.

రూట్ పైనే ఆశలన్నీ..

- ఇంగ్లాండ్ లక్ష్యం 359.. ప్రస్తుతం 156/3
- యాషెస్ మూడో టెస్టు

లీడ్స్: యాషెస్ మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 67 పరుగులకే కుప్పకూలింది ఇంగ్లాండ్. అలాంటి జట్టు ముందు 359 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది ఆసీస్. 15 పరుగులకే 2 వికెట్లు పడ్డాయి. ఇంకేముంది రెండు సెషన్లలో ఆతిథ్య జట్టు కథ ముగించేసి, కంగారూలు మూడో రోజే మ్యాచ్‌ను సొంతం చేసుకుంటారనుకున్నారంతా. కానీ ఇంగ్లిష్ జట్టు అంత తేలిగ్గా లొంగట్లేదు. పట్టుదలతో పోరాడుతోంది. శనివారం రెండు సెషన్లకు పైగా ఆసీస్ బౌలర్లను నిలువరించిన ఇంగ్లాండ్.. ఆట ఆఖరుకు 156/3తో నిలిచింది. ఓపెనర్లు బర్న్స్ (7), రాయ్ (8) ఎంతోసేపు నిలవకున్నా.. డెన్లీ (50)తో కలిసి కెప్టెన్ జో రూట్ (75 బ్యాటింగ్; 189 బంతుల్లో 7×4) గొప్పగా పోరాడాడు. అతడికి తోడుగా స్టోక్స్ (50 బంతుల్లో 2) క్రీజులో ఉన్నాడు. 7 వికెట్లు చేతిలో ఉన్న ఇంగ్లాండ్.. ఇంకా 203 పరుగులు చేయాలి. ఇప్పటికి ఆ జట్టు పరిస్థితి మెరుగ్గానే ఉన్నా.. ఓటమి తప్పించుకోవడం సులువు కాదు. ఆ జట్టు ఆశలన్నీ రూట్ మీదే. రెండు రోజులు ఆట మిగిలున్న నేపథ్యంలో ఫలితం రావడం మాత్రం ఖాయం. అంతకుముందు 171/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. 246 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (80) మేటి ఇన్నింగ్స్ ఆడాడు. సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న ఆసీస్‌కు ఈ మ్యాచ్‌లో 112 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కిన సంగతి తెలిసిందే.

భారత్ పైచేయి

- విజృంభించిన ఇషాంత్
- విండీస్ 222 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 111/3

ఆంటిగ్వా

వెస్టిండీస్‌తో తొలి టెస్టులో భారత్ పైచేయి సాధిస్తోంది. ఇషాంత్‌శర్మ (5/43) విజృంభించడంతో ప్రత్యర్థిని తొలి ఇన్నింగ్స్‌లో 222 పరుగులకు ఆలౌట్ చేసి 75 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. కడపటి వార్తలందే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 42 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (16) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా.. రాహుల్ (38; 85 బంతుల్లో 4×4), పుజారా (25; 53 బంతుల్లో 1×4) పట్టుదలతో ఆడారు. అయితే వీళ్లిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో భారత్ ఇబ్బందుల్లో పడింది. కెప్టెన్ కోహ్లి (20 బ్యాటింగ్), రహానె (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. 7 వికెట్లు చేతిలో ఉన్న టీమ్‌ఇండియా.. 186 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఆఖరి సెషన్లో ఐదు వికెట్లు: వెస్టిండీస్ ఇన్నింగ్స్‌లో ఇషాంత్ బౌలింగే హైలైట్.. రెండో రోజు టీ విరామానికి 82/3తో నిలిచిన ఆ జట్టు ఆట ఆఖరుకు 179/8కి పరిమితం అయిందంటే కారణం లంబూనే. పదునైన పేస్ బౌలింగ్‌తో విండీస్‌ను ఉక్కిరిబిక్కిరి చేసిన ఇషాంత్.. క్రమం తప్పకుండా వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. ఒక దశలో వెస్టిండీస్ 130/4తో ఫర్వాలేదనిపించినా ఇషాంత్ విజృంభణతో కుప్పకూలింది. ముందుగా కుదురుకున్న చేజ్ (48)ను ఔట్ చేసిన ఇషాంత్.. ఆ తర్వాత చక్కటి ఔట్ స్వింగర్‌తో హోప్ (24)ను పెవిలియన్ చేర్చాడు. హెట్‌మయర్ (35), హోల్డర్ (39) నిలవడంతో విండీస్ 174/5తో కోలుకున్నట్లు కనిపించింది. అయితే మెరుపు రిటర్న్ క్యాచ్‌తో హెట్‌మయర్‌ను ఔట్ చేసిన ఇషాంత్.. ఆ తర్వాత రోచ్ (0)ను కూడా పెవిలియన్ పంపడంతో రెండో రోజును విండీస్ 179/8తో ముగించింది. మూడోరోజు ఉదయం కమిన్స్ (43 బంతుల్లో 0) అండతో హోల్డర్ పోరాడాడు. ఈ జోడీ ప్రమాదకరంగా మారుతున్న సమయంలో షమి పదునైన బంతితో హోల్డర్‌ను పెవిలియన్ చేర్చాడు. కమిన్స్‌ను జడేజా బౌల్డ్ చేయడంతో విండీస్ ఇన్నింగ్స్ ముగిసింది. మూడో రోజు ఉదయం కరీబియన్ జట్టు.. 33 పరుగులు జోడించి రెండు వికెట్లు కోల్పోయింది. ఇషాంత్‌తో పాటు షమి (2/48), జడేజా (2/64) రాణించారు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 297; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్రెయిగ్ బ్రాత్‌వైట్ (సి) అండ్ (బి) ఇషాంత్ 14; క్యాంప్‌బెల్ (బి) షమి 23; బ్రూక్స్ (సి) రహానె (బి) జడేజా 11; డారెన్ బ్రావో ఎల్బీ (బి) బుమ్రా 18; చేజ్ (సి) రాహుల్ (బి) ఇషాంత్ 48; హోప్ (సి) పంత్ (బి) ఇషాంత్ 24; హెట్‌మయర్ (సి) అండ్ (బి) ఇషాంత్ 35; హోల్డర్ (సి) పంత్ (బి) షమి 39; రోచ్ (సి) కోహ్లి (బి) ఇషాంత్ 0; కమిన్స్ (బి) జడేజా 0; గాబ్రియల్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం:** (74.2 ఓవర్లలో ఆలౌట్) **222; వికెట్ల పతనం:** 1-36, 2-48, 3-50, 4-88, 5-130, 6-174, 7-179, 8-179, 9-220; **బౌలింగ్:** ఇషాంత్ శర్మ 17-5-43-5; బుమ్రా 18-4-55-1; షమి 17-3-48-2; జడేజా 20.2-4-64-2; విహారి 2-0-7-0

1 టెస్టులో వేగంగా 50 వికెట్లు పడగొట్టిన భారత పేసర్‌గా బుమ్రా (11 మ్యాచ్‌లు) అగ్రస్థానంలో నిలిచాడు. మొత్తం మీద వేగంగా ఈ మైలురాయి దాటిన భారత బౌలర్లలో అతనిది మూడో స్థానం. ఈ జాబితాలో అశ్విన్ (9 మ్యాచ్‌లు) ముందున్నాడు.

పాంథర్స్‌ను పట్టేసిన విశాల్

జైపుర్‌పై టైటాన్స్ విజయం

ప్రొ కబడ్డీలో ఈనాడు

జైపుర్ × బెంగళూరు (రా. 7:30 నుంచి)
దిల్లీ × యూపీ (రా. 8:30 నుంచి)

దిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో ఆలస్యంగా పుంజుకొన్న తెలుగు టైటాన్స్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. విశాల్ భరద్వాజ్ (8) ట్యాక్లింగ్‌లో చెలరేగి ప్రత్యర్థిని ఓ పట్టుపట్టడంతో శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 24-21 తేడాతో జైపుర్ పింక్ పాంథర్స్‌పై గెలిచింది. ఈ సీజన్‌లో టైటాన్స్‌కిది మూడో విజయం. విశాల్ ఆరంభం నుంచే సత్తాచాటడంతో టైటాన్స్ పది నిమిషాలు ముగిసే సరికి 7-4తో ఆధిక్యంలో నిలిచింది. తిరిగి పుంజుకున్న జైపుర్ ఆటగాళ్లు 8-8తో స్కోరు సమం చేశారు. ట్యాక్లింగ్‌లో సందీప్ ధూల్ (4), రైడింగ్‌లో అజింక్య పవార్ (3) పాయింట్లు తేవడంతో జైపుర్ తొలి అర్ధభాగాన్ని 14-11తో ముగించింది. విరామం తర్వాత విశాల్ అండతో టైటాన్స్ పట్టుబిగించింది. అతను సూపర్ ట్యాకిళ్లు చేయడంతో జట్టు 15-15తో స్కోరు సమం చేసింది. అక్కడి నుంచి పోరు రసవత్తరంగా మారింది. ఆధిపత్యం చేతులు మారుతూ సాగింది. 32వ నిమిషంలో అబోజర్ సూపర్ ట్యాకిల్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. 19-17తో ఆధిక్యం సాధించిన టైటాన్స్ పట్టు వదల్లేదు. చివరి రెండు నిమిషాల ఆట ఉదనగా 21-22తో ప్రత్యర్థి స్కోరు సమం చేసేలా కనిపించింది. కానీ మరో ట్యాకిల్ పాయింట్‌తో అబోజర్ జట్టుకు 23-21తో ఆధిక్యం అందించాడు. చివరి రైడ్లో ఫర్వేద్ పాయింట్‌తో టైటాన్స్ స్పష్టమైన ఆధిక్యంతో మ్యాచ్ సొంతం చేసుకుంది. 10 మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో టైటాన్స్.. 23 పాయింట్లతో తొమ్మిదో స్థానానికి చేరింది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో దబంగ్ దిల్లీ 33-31తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది.

పింఛను ప్రీమియంగా పీఎం కిసాన్ సొమ్ము!

- రైతులు బ్యాంకులో ఆమోద పత్రం ఇస్తే చాలు
- రాష్ట్ర వ్యవసాయశాఖను కోరిన కేంద్రం
- పీఎం కిసాన్‌లో ఇచ్చేది ఏడాదికి రూ.6 వేలు
- ప్రీమియం కింద పోయేది రూ.2400
- రైతుకు నికరంగా అందేది రూ.3600
- ఒకచేతితో ఇచ్చి.. రెండో చేతితో మళ్లించడమేనంటున్న రైతులు

ఈనాడు, హైదరాబాద్: రైతులకు కేంద్రం పెట్టుబడి సాయం కింద ఇస్తున్న మొత్తంలో కొంత సొమ్మును వారి కోసం ఉద్దేశించిన పింఛను పథకానికి ప్రీమియంగా మళ్లించుకోనుంది. ఇందుకోసం రైతులు బ్యాంకులో అంగీకార పత్రం అందజేయాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్రం తాజాగా రాష్ట్ర వ్యవసాయశాఖకు తెలిపింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం కింద ఇస్తున్న సాయాన్ని 'ప్రధానమంత్రి కిసాన్ మన్-ధన్ యోజన' (పీఎం కేఎంవై)కు మళ్లించుకుంటామని.. పీఎంకిసాన్‌లో లబ్ధి పొందిన రైతులందరినీ పీఎంకేఎంవైలో చేరేలా చూడాలని రాష్ట్ర వ్యవసాయశాఖకు సూచించింది. ఇది ఒక చేతితో ఒక పథకంలో ఆర్థిక సాయం చేస్తూ మరో పథకానికి ఇంకో చేతితో సొమ్మును మళ్లించుకోవడమేనని రైతులు అభిప్రాయపడుతున్నారు.

స్థోమత లేనివారే అధికం

దేశంలోని మొత్తం అన్నదాతల్లో 80శాతం మంది సన్న, చిన్నకారు రైతులకు ఐదెకరాల్లోపు భూమి ఉంది. వీరికి ఆదాయం సరిగా లేక జీవిత చరమాంకంలో సామాజిక భద్రత ఉండటంలేదు. ఈ నేపథ్యంలో వీరికి ఆ సమయంలో సాయపడేందుకు కేంద్ర వ్యవసాయశాఖ ఈ నెల ఒకటి నుంచి పీఎంకేఎంవైని అమలులోకి తెచ్చింది. ఐదెకరాల్లోపు ఉన్న రైతుకు 60ఏళ్లు నిండినప్పటి నుంచి నెలకు రూ.3వేల పింఛను ఇవ్వాలనేది దీని ప్రధానోద్దేశం. ఇందుకు 18-40 ఏళ్లలోపున్న రైతులు నెలకు వారి వయసును బట్టి రూ.55నుంచి 200దాకా ప్రీమియం చెల్లించాలి. రైతులు సొంతంగా ప్రీమియం కట్టడానికి చాలారాష్ట్రాల్లో ముందుకు రావడంలేదు. అత్యధికశాతం రైతులు నెలనెలా ప్రీమియం కట్టగల ఆర్థిక స్థోమత లేనివారే కావడం ఇందుకు ప్రధానకారణం.

తెలంగాణలో 36 లక్షల మంది

తెలంగాణలో పీఎం కిసాన్ పథకం కింద 36లక్షల మంది రైతుల పేర్లు, బ్యాంకు ఖాతాల వివరాలను ఆన్‌లైన్‌లో వ్యవసాయశాఖ నమోదు చేసింది. వీరిలో 31.97లక్షల మంది ఖాతాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జులై నెలాఖరు వరకు రూ.640కోట్లను కేంద్ర వ్యవసాయశాఖ జమచేసింది. ఒక్కో రైతు ఖాతాలో రూ.2వేల చొప్పున వేసింది. మిగిలిన 4లక్షల మంది ఖాతాల్లో ఈ నెలలో వేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖకు తెలిపింది. పీఎం కిసాన్ కింద ప్రతీ ఆర్థిక సంవత్సరంలో నాలుగు నెలలకోసారి రూ.2వేల చొప్పున 3 విడతలుగా ఏడాదికి మొత్తం రూ.6వేలు రైతు ఖాతాలో కేంద్రం జమచేస్తుంది. ఈ రూ.6వేల నుంచి పీఎంకేఎంవై పథకానికి రైతు కట్టాల్సిన ప్రీమియం కింద రూ.2400 తీసుకుంటామని కేంద్రం తెలిపింది. ఇవిపోగా నికరంగా రైతుకు రూ.3600లే పీఎంకిసాన్‌లో అందుతాయి.

పీఎంకిసాన్ సొమ్ము జమ అయిన ఖాతా నుంచి పీఎంకేఎంవైకి తన ప్రీమియం తీసుకోవడానికి రైతు అంగీకరిస్తూ సంతకం చేసి పత్రమిస్తే.. ఆటోడెబిట్ ద్వారా ఏటా ప్రీమియం వెళ్లేలా బ్యాంకు సిబ్బంది చూస్తారు. రైతు భార్య కూడా పీఎంకేఎంవైలో విడిగా నెలనెలా ప్రీమియం కట్టి చేరవచ్చు. వారి సొమ్మునూ పీఎంకిసాన్‌లో నుంచి తీసుకోమని కోరవచ్చు. ప్రీమియం కట్టడం మొదలైన తరవాత రైతు కన్నుమూస్తే అప్పటివరకు కట్టిన ప్రీమియం సొమ్మును వడ్డీతో సహా నామినీకి చెల్లిస్తారు. దీనిపై పీఎంకిసాన్ లబ్ధిదారులైన రైతుల్లో అవగాహన కల్పించాలని కేంద్ర వ్యవసాయశాఖ సూచించినట్లు రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జా 'ఈనాడు'కు చెప్పారు.

వినూత్న బోధనకు 'ఉత్తమ' గుర్తింపు

ఆశారాణిని వరించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ఆశారాణి

ఈనాడు, హైదరాబాద్: పిల్లలకు ఉపాధ్యాయురాలిగానే కాకుండా ఓ తల్లిగా... మార్గదర్శకురాలిగా మారి బోధించారు. ఆంగ్ల భయాన్ని పోగొట్టేందుకు...ఆ సబ్జెక్టుపై ఆసక్తి కల్పించేలా వినూత్నంగా...సృజనాత్మకంగా పాఠాలు చెప్పారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆమె తన బోధనా వృత్తిని అమితంగా ప్రేమించారు. అందుకే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ఆమే బెండి ఆశారాణి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని జీడిమెట్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈసారి రాష్ట్రం నుంచి ఆమె ఒక్కరే ఎంపికకావడం విశేషం. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆశారాణి తండ్రి రక్షణ రంగంలో పనిచేయడంతో ఆమె బెంగళూరు, అండమాన్ తదితర చోట్ల చదువుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నా ఇంటర్ వరకు తెలుగు మాధ్యమంలోనే అభ్యసించారు. నాలుగేళ్ల బీఏ, బీఈడీ(ఇంటిగ్రేటెడ్)ని భువనేశ్వర్‌లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ ఐఈ)లో చదివారు. అయినా ఆంగ్ల భాషపై పట్టు రాలేదు. తర్వాత ఓయూలో ఎంఏ రాజనీతిశాస్త్రం పూర్తి చేశారు. ఆంగ్లం సరిగా మాట్లాడలేదని ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం ఇవ్వలేదు. 1995లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆనాటి శంకరపల్లి ఎంఈవో శేషాద్రి ప్రోత్సాహంతో ఓయూలో 2000 సంవత్సరంలో ఎంఏ ఆంగ్లం పూర్తిచేశారు. పట్టుదలతో ఆంగ్లంపై పట్టు సాధించారు. 2002లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. తరగతిలో చెప్పుకుంటూ పోకుండా విద్యార్థులతో మాట్లాడిస్తూ..సంభాషణల రూపంలో బోధిస్తుంటానని, ప్రతి విద్యార్థి రోజూ ఒక కొత్త పదం చెప్పేలా ప్రోత్సహించి వాటిని అందరికీ సుపరిచితమయ్యేలా చేస్తున్నానని ఆశారాణి పేర్కొన్నారు.

తెలంగాణ బిడ్డ కృషితో రాజస్థాన్ ముందంజ

వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్‌లో తొలిస్థానంలో నిలిపిన వెదిరె శ్రీరామ్

ఈనాడు, దిల్లీ: జల సంరక్షణ, నీటి వనరుల నిర్వహణ విషయంలో ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్ వరుసగా రెండో ఏడాది ముందంజలో నిలిచింది. తొమ్మిది అంశాల ఆధారంగా నీతి ఆయోగ్ విడుదల చేసిన 'సమగ్ర నీటి యాజమాన్య సూచిక (ఐడబ్ల్యూఎంఐ)లో వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, సాగునీటి నిర్వహణలో తొలి స్థానంలో ఉంది. 2016లో రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి జల్ స్వావలంబన అభియాన్ (ఎంజేఎస్ఏ)ను ప్రారంభించారు. ఇందులో ప్రతి గ్రామానికి జల బడ్జెట్‌ను రూపొందించారు. ప్రతి వాన నీటిచుక్క భూమిలో ఇంకే ఏర్పాట్లు చేశారు. 21 జిల్లాల్లో భూగర్భ జలాలు 4.66 అడుగుల మేర పెరిగాయి. ఎండిపోయిన బోర్లలో 64 శాతం తిరిగి నీటిని అందివ్వడం ప్రారంభించాయి. ఇలా రాజస్థాన్‌కు జలకళను తెచ్చిన ఘనత వరంగల్‌కు చెందిన వెదిరె శ్రీరామ్‌కు దక్కుతుంది. నాలుగేళ్ల పాటు ఆయన తన బృందంతో శ్రమించి జల వనరుల పునరుద్ధరణ, నీటి సంరక్షణలో సఫలీకృతులయ్యారు.

చీకటి గదుల్లో చరిత్ర

మ్యూజియం స్టోర్ రూంలో విలువైన చారిత్రక సంపద

ఈనాడు, హైదరాబాద్: మ్యూజియం.. చరిత్రకు చిరునామా. నాగరికత పరిణామక్రమానికి నిలువెత్తు సాక్ష్యం. రాజధాని హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర మ్యూజియం.. ప్రపంచంలోనే రెండో అతి పెద్దది. బుద్ధుని అవశేషాలు సహా విగ్రహాలు, శాసనాలు, ఆయుధాలు, అత్యంత విలువైన బంగారు నాణేలతోపాటు వెండి నాణేలు సహా సుమారు 15 రకాల చారిత్రకసంపద ఉందిక్కడ. యుద్ధాల్లో రాజులు వాడిన కత్తులు అనేకం ఉన్నాయి. ఇవన్నీ చీకటి గదులకే పరిమితమయ్యాయి. స్టోర్‌రూంలలో ఉండిపోయాయి. గుప్తులు మొదలుకుని అసఫ్‌జాహీల వరకు దాదాపు మూడు లక్షల నాణేలు మ్యూజియంలో ఉన్నాయి. కత్తులు సహా వెయ్యి ఆయుధాలున్నాయి. టిప్పుసుల్తాన్ వాడిన కత్తి సైతం ఇందులో ఉంది. దిల్లీ మ్యూజియం నుంచి ప్రత్యేకంగా ఇక్కడకు తీసుకొచ్చారు. అవన్నీ దశాబ్దం క్రితం వరకు అల్మారాల్లో ఉండేవి. అప్పుడు సందర్శకులు వీక్షించేవారు. తర్వాత వీటిని సర్దుబాట్ల పేరుతో చీకటిగదుల్లో పడేశారు.

ముగిసిన మొదటి విడత సీపీగెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాల పరిధిలో ఎంకాం, ఎంఎస్‌సీ, ఎంఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి పోస్టుగ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష (సీపీగెట్)లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల మొదటి విడత ధ్రువపత్రాల పరిశీలన శనివారం ముగిసింది. మొత్తం 44 విభాగాల్లో 40,100 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో 38,900 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని వారికి ఈ నెల 26న అవకాశం కల్పించనున్నట్లు సెట్ కన్వీనర్ ప్రొ.కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. 27న వెబ్ ఆప్షన్‌లో తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. 29న మొదటి విడత సీట్లను కేటాయించనున్నట్లు వివరించారు.

ప్రభుత్వ భూముల రక్షణకు ఉద్యమిస్తాం: చాడ వెంకటరెడ్డి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: 'ప్రభుత్వ భూములను రక్షిద్దాం-సామాజిక న్యాయం కోసం ఉద్యమిద్దాం' పేరుతో సెప్టెంబరు 11 నుంచి వారంపాటు తెలంగాణ సాయుధ పోరాట వార్షోత్సవాలను నిర్వహించబోతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర కమిటీ సమావేశాల వివరాలను ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. 11న బస్సు యాత్రను ప్రారంభిస్తామన్నారు.

వివేకా కేసులో ఇద్దరికి ముగిసిన నార్కో పరీక్షలు

పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక బృందం ముమ్మరంగా విచారణ కొనసాగిస్తోంది. ఈక్రమంలో కడప జిల్లా పులివెందులలోని జూనియర్ సివిల్ కోర్టు అనుమతితో సుమారు నెల రోజుల క్రితం నలుగురు అనుమానితులను ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలో నార్కో అనాలసిస్ పరీక్షలు నిర్వహించేందుకు గుజరాత్‌కు తీసుకెళ్లారు. వీరిలో వివేకా ఇంటి వాచ్‌మెన్ రంగన్న, వివేకా అనుచరుడు ఎర్రగంగిరెడ్డిని శనివారం పులివెందులకు తీసుకొచ్చారు. వీరిని స్థానిక పోలీసులు స్టేషన్‌లో కొద్దిసేపు ఉంచి సాయంత్రానికి ఇళ్లకు పంపించారు. మరో ఇద్దరు అనుమానితులు చంద్రశేఖర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డిల నుంచి కీలకమైన ఆధారాలు రాబట్టేందుకు గుజరాత్‌లోనే ఉంచినట్టు సమాచారం.

కొండా దంపతులతో భాజపా సంప్రదింపులు

ఈనాడు, హైదరాబాద్: కొండా దంపతులను భాజపాలోకి తీసుకువచ్చేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బలమైన నేతల కోసం కమల దళం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీతో భాజపా రాష్ట్ర ముఖ్య నేత సంప్రదింపులు జరుపుతున్నారు. ఇటీవల పార్టీ ముఖ్య నేత ఒకరు వారితో ఫోన్‌లో మాట్లాడి భాజపాలోకి ఆహ్వానించినట్లు తెలిసింది. కొండా దంపతులు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

నిర్లక్ష్యంతోనే చంపేస్తున్నారు

- అధిక లోడు వాహనాలతో రోడ్డు ప్రమాదాలు
- చట్టాలను కఠినంగా అమలు చేయకుంటే మరిన్ని ప్రమాదాలు
- ఘాటుగా స్పందించిన హైకోర్టు
- సీజ్ అయిన వాహనాల విడుదలకు మార్గదర్శకాల జారీ

ఈనాడు - హైదరాబాద్

సామర్థ్యానికి మించి అధికలోడుతో వెళ్తున్న వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, దీనివల్ల అమాయక ప్రాణాలు బలవుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాలపై జస్టిస్ వి.ఆర్.కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేస్తూ తీర్పు వెలువరించి 30 ఏళ్లు దాటినా పరిస్థితి మెరుగుపడలేదంది. రోడ్డు ప్రమాదాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని పేర్కొంది. రహదారి భద్రతకు చెందిన రెండు చట్టాలను కఠినంగా అమలు చేయని పక్షంలో మరిన్ని అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని వ్యాఖ్యానించింది. ఈ నెల 4న ఆటో ప్రమాదంలో 13 మంది అమాయక వ్యవసాయ కూలీలు మృతిచెందగా, మరికొందరు గాయపడ్డారని, ఆరుగురి కోసం రూపొందించిన వాహనంలో ఇంతమందిని ఎక్కించుకోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందంది. ఇలా ప్రయాణించే వాహనాలను సీజ్ చేయడంతోపాటు కఠిన శిక్షలు విధిస్తే వాహన యజమానుల్లో భయం ఏర్పడుతుందని వ్యాఖ్యానించింది. అధిక లోడుతో వెళుతున్న వాహనాలను సీజ్ చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారించిన జస్టిస్ పి.నవీన్‌రావు వాటిని పరిష్కరిస్తూ ఇటీవల తీర్పు వెలువరించారు. ప్రత్యామ్నాయం ఉండగా నేరుగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదన్నారు.

చట్టాల అమల్లో ఉదాసీనత

అధికలోడుతోపాటు సామర్థ్యంలేని వాహనాలను నియంత్రించడానికి చట్టాల్లో నిబంధనలున్నప్పటికీ అమలులో ఉదాసీనత కనిపిస్తోందని జస్టిస్ పి.నవీన్ రావు వ్యాఖ్యానించారు. కఠినమైన శిక్షలు లేనిపక్షంలో అమాయకుల ప్రాణాలకు రక్షణ కల్పించడం సాధ్యం కాదన్నారు. వాహనాన్ని వినియోగించుకునే హక్కు వ్యక్తులకు ఉందని, అయితే ఇది విస్తృత ప్రజాప్రయోజనాలకు లోబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సీజ్ చేసిన వాహనాల విడుదల విషయంలో దాఖలైన దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాల్సి ఉందన్నారు. వాహనాల సీజ్, వాటి విడుదలకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేశారు.

ఇవీ మార్గదర్శకాలు

- ఎక్కువ లోడుతో వెళుతున్న వాహనాలను సీజ్ చేసినపుడు నేరుగా హైకోర్టులో పిటిషన్ విచారణార్థం కాదు. యజమాని, డ్రైవర్ ఎవరైనా ఇక్కడ పిటిషన్ వేయడానికి ముందే చట్టప్రకారం ఉన్న ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవాలి.
- రాష్ట్ర మోటారు వాహన నిబంధనల ప్రకారం సీజ్ చేసిన వాహన యజమాని ఆర్‌టీఏ కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై కార్యదర్శి చట్టప్రకారం పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలి. తగిన షరతులు విధించి వాహనాన్ని విడుదల చేయవచ్చు.
- వాహనాన్ని సీజ్ చేసే ప్రక్రియను వీడియోతో చిత్రీకరించి దాన్ని రికార్డులో భాగం చేయాలి. వీడియో రికార్డింగ్ విధానాన్ని రూపొందించాలి.
- కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంటే పరిష్కారంలో ఎక్కువ జాప్యం జరుగుతోందన్నది యజమానుల ఆవేదన. దీనికి పరిష్కారంగా ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్నదానిలో ప్రత్యేకంగా పేజీ, ప్రత్యేంగా మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తును పరిష్కరించాలి. విచారణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టాలి. ఇలాంటి దరఖాస్తును వారంలోగా పరిష్కరించాలి.
- మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఇప్పటికే విడుదలైన వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఈ కోర్టు చెప్పడం లేదు. అయితే ప్రాసిక్యూషన్ చేయడానికి, జరిమానా విధించడానికి ఈ ఉత్తర్వులు అడ్డంకి కావు. ఒకవేళ యజమాని అడ్వాన్స్‌గా సొమ్ము చెల్లించినట్లయితే తప్పుతేలి విధించే జరిమానాతో సర్దుబాటు చేయాలి. యజమాని జరిమానా చెల్లించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. చట్టప్రకారం ప్రాసిక్యూట్ చేయడానికి అధికారులకు అవకాశం ఉంది.
- జరిమానా చెల్లించడానికి వాహన యజమాని చేసుకున్న దరఖాస్తును అనుమతించినట్లయితే వాహనాన్ని విడుదల చేసే ముందు దాన్ని సామర్థ్యాన్ని పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయాలి.
- అక్రమాలకు పాల్పడుతున్న ఇసుక లారీలను స్వాధీనం చేసుకునే విషయంలో మైనింగ్ అధికారులు కూడా రవాణాశాఖతో అనుసంధానమై తగిన నిర్ణయాలు తీసుకోవాలి.
- ప్రభుత్వం, రవాణాశాఖ కమిషనర్లు సాంకేతిక రంగాన్ని వినియోగించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలి. పోలీసు, పరిశ్రమల శాఖల అధికారులకు అవకాశం ఉండేలా ప్రయాణికులు, సరకు రవాణా వాహనాలు నిబంధనల ఉల్లంఘనలు ఆన్‌లైన్‌లో కనిపించేలా ఉండాలి. యజమాని/డ్రైవర్ పదేపదే నిబంధనలను ఉల్లంఘిస్తే ఆవివరాలు ఆన్‌లైన్‌లో కనిపించాలి, తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- తప్పులకు పాల్పడ్డ యజమాని/డ్రైవర్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి గడువును నిర్దేశించాలి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను మూడు నెలల్లో రూపొందించాలి.

లభించని శ్రీహర్ష ఆచూకీ

- తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: లండన్‌లో ఆచూకీ కనిపించకుండా పోయిన భాజపా ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సన్నే ఉదయ్ ప్రతాప్ కుమారుడు ఉజ్వల్ శ్రీహర్ష వివరాలు శనివారం సాయంత్రానికీ లభ్యం కాలేదు. కుటుంబసభ్యులు తల్లడిల్లుతున్నారు. ఈనెల 21న లండన్ నుంచి ఖమ్మంలోని తల్లి, హైదరాబాద్‌లోని చెల్లి ఐశ్వర్యతో కాల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఉజ్వల్ శ్రీహర్ష ఆ తర్వాత అందుబాటులో లేకుండా పోయారు. శుక్రవారం సాయంత్రం లండన్ పోలీసులు ఖమ్మంలోని ఉదయ్ ప్రతాప్‌నకు ఫోన్ చేసి ఉజ్వల్ శ్రీహర్ష కనిపించనందున మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ బిట్స్ పిలానీలో బీటెక్ చదివారు. లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీలో శ్రీహర్ష ఎంఎస్ చదివేందుకు వెళ్లారు. మరికొద్ది రోజుల్లో యూనివర్సిటీ నుంచి ఎంఎస్ విద్య పూర్తయిన ధ్రువపత్రాలు తీసుకుని తిరిగి రావాల్సి ఉంది. కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ శనివారం ఉదయ్ ప్రతాప్‌నకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుని ఓదార్చారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి ఈ విషయాన్ని పార్టీ నేతలు తెలిపారు. ఆయన ఉదయ్ ప్రతాప్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

దత్తాత్రేయతో ఫోన్‌లో మాట్లాడుతూ విలపిస్తున్న భాజపా ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ ప్రతాప్

వంటింటి నుంచి వంటకు!

- ఆహార వ్యర్థాలతో వంట గ్యాస్ తయారీ
- తెలంగాణకు 20 ప్లాంట్లు మంజూరు
- సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: మిగిలిన, పాడైపోయిన ఆహార పదార్థాలు ఇక వ్యర్థం కావు. వాటి నుంచి వంట గ్యాస్ తయారు చేసుకునే పరిజ్ఞానం రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో అందుబాటులోకి రానుంది. సాధారణంగా ఇంట్లో ఆహారం పాడైపోయినా, మిగిలిపోయినా బయట పాడేస్తుంటాం. కూరగాయలు తరిగాక మిగిలిన ముక్కల విషయంలోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఈ ఆహార వ్యర్థాలను మరో రూపంలో ఉపయోగించుకునే పరిజ్ఞానాన్ని తెలంగాణ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి (టీఎస్ కాస్ట్) అందుబాటులోకి తెస్తోంది. పాడైన కూరగాయలు, మిగిలిపోయిన అన్నం, కూరలతో వంట గ్యాస్ తయారుచేసే ప్లాంట్లను అందుబాటులోకి తెస్తోంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన రెండు ప్లాంట్లు మంచి ఫలితాలు ఇస్తుండటంతో.. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో 18 ప్లాంట్ల నిర్మాణాన్ని చేపడుతోంది.

నెలకు 100 కిలోల గ్యాస్

వృథా అయిన ఆహారం నుంచి మిథేన్ గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ గ్యాస్‌ను వంటకు ఉపయోగిస్తారు. ఇలాంటి ప్లాంట్లను కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు 20 మంజూరు చేసింది. ఒక్కో ప్లాంటు వ్యయం రూ.8 లక్షలు కాగా.. రూ.4 లక్షలు కేంద్రం భరిస్తోంది. హైదరాబాద్‌లో సీసీఎంబీ, ఎన్ఐఆర్‌డీలో టీఎస్ కాస్ట్ రెండు ప్లాంట్లు ఏర్పాటు చేసింది.

- ఆహారం నుంచి గ్యాస్ తయారీకి 'బయో డైజెస్టర్' ఏర్పాటు చేస్తారు. పాడైన కూరగాయలు, మిగిలిన అన్నం, కూరలు, కూరగాయ ముక్కలు, పచ్చగడ్డి.. ఇలా ఏ రకం ఆహారం వృథా అయినా ఇందులో వేస్తారు. లోపల ఆక్సిజన్ లేకుండా చేసి, బ్యాక్టీరియాను వేస్తారు. దీంతో ఆ ఆహారం కుళ్లిపోయి గ్యాస్, పిప్పి రూపంలో మారుతుంది. రోజు 60-70 కిలోలు వృథా అయిన ఆహారాన్ని వేస్తే నెలకు 15 క్యూబిక్ మీటర్ల మిథేన్ గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ఇది 100 కిలోల గ్యాస్‌కు, దాదాపు 7 సిలెండర్లకు సమానం. ఈ గ్యాస్‌ను తిరిగి వంటకు వినియోగించుకోచ్చు. సీసీఎంబీ, ఎన్ఐఆర్‌డీలోనూ ఇలాగే వినియోగిస్తున్నారు. ఇలా ఉత్పత్తి అయ్యే గ్యాస్‌తో నెలకు రూ.7 వేలు ఏడాదికి రూ.84 వేల వరకు ఖర్చు ఆదా అవుతుందని టీఎస్‌కాస్ట్ అధికారి ఒకరు తెలిపారు. గ్యాస్‌తో పాటు వచ్చే పిప్పిని.. పొడిలా మార్చి ఎరువుగా పంట పొలాలకు ఉపయోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఆల్‌రౌండర్‌ని కోల్పోయాం

- జైట్లీ మృతి తీరనిలోటు: రాంమాధవ్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మృతిపై భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. శనివారమిక్కడ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు జైట్లీకి సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంమాధవ్ మాట్లాడుతూ.. "జైట్లీ గొప్ప ఆల్‌రౌండర్. భాజపా బ్యాట్స్‌మన్‌లా, విపక్షాల వికెట్లు తీసే బౌలర్‌లా రాణించారు. అరుదైన రాజకీయ వ్యక్తిత్వం కలిగిన ఆయన మృతి పార్టీకి, దేశానికి తీరని లోటు" అని పేర్కొన్నారు. "ఉద్యమ సమయంలో తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా మాట్లాడారు.పునర్విభజన బిల్లు ఆమోదం పొందేందుకు జైట్లీ కృషిచేశారు" అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ గుర్తుచేసుకున్నారు. దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రామచందర్‌రావు, వివేక్, డీకే అరుణ తదితరులు జైట్లీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో జైట్లీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఇంద్రసేనారెడ్డి, లక్ష్మణ్, రాంమాధవ్, దత్తాత్రేయ, వినోద్ తదితరులు

తెలంగాణ బిల్లు ఆమోదానికి ఒకరోజు ముందు దిల్లీలో అప్పటి భాజపా రాజ్యసభాపక్షనేత జైట్లీతో సమావేశమైన కేసీఆర్, కేశవరావు, విద్యాసాగర్‌రావు

ఆయన నిర్ణయాలు అమోఘం

"జైట్లీ మృతి తీరని లోటు. ఆయనో అద్భుతమైన పార్లమెంటేరియన్, మంచి వక్త. మూడు దశాబ్దాలపాటు దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేశారు. ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు, వాణిజ్య మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు అమోఘం. రాజ్యసభలో ఏపీ పునర్విభజన బిల్లు ఆమోదం పొందడంలో జైట్లీ చేసిన కృషిని ఎవరూ మరిచిపోలేరు. అప్పట్లో కేసీఆర్, కె.కేశవరావులతో కలిసి తెలంగాణ ప్రజల సమస్యలను జైట్లీకి సవివరంగా తెలియజేశాం"

– మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు

ఉగ్రవాదుల కోసం పోలీసుల వేట

తమిళనాట కొనసాగుతున్న తనిఖీలు

ఈనాడు డిజిటల్, చెన్నై: ఉగ్రవాదుల చొరబాటు హెచ్చరికలతో ఉలిక్కిపడిన తమిళనాట ఉత్కంఠ కొనసాగుతోంది. ముష్కరుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. చెన్నైలో సచివాలయం నెలకొన్న సెయింట్ జార్జికోట, వేళాంకణ్ణిలోని మేరీమాత ఆలయం, మదురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వరాలయం, రాష్ట్రంలోని ముఖ్య విమానాశ్రయాలు, ప్రధాన రైల్వే స్టేషన్లలో శనివారమూ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. వేలూరులోని కోట, శ్రీపురంలోని స్వర్ణ దేవాలయం, ప్రముఖ ఆసుపత్రులు, విద్యాసంస్థల వద్ద పోలీసులు నిఘా పెంచారు. విడిది క